
అభ్యుదయ

నవంబరు 1978

ఒక రూ



విషయ సూచిక

ముఖచిత్రం :

విశాఖలో గురజాడ కాంస్య విగ్రహం, శిల్పి అంట్యాకుల పైడిరాజు

అభ్యుదయ

సంచిక 11, సంపుటి 2 నవంబరు 1978 సాలు చందా రూ. 10

గమ్యం, సమైక్యత

అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్యమండలి యావదాంధ్రానికి వ్యాపించిన, మూడు దశాబ్దాలకు మించిన చరిత్రవున్న ప్రగతిశీల సంస్థలు. సాహిత్య, కళా రంగాలలో యివి సాగించిన కృషి, కలిగించిన ఉత్తేజం అక్షరాల సాటిలేనివి. కేవల కాల వ్యయానికి ఉపయోగపడుతూ వుండిన సాహిత్యాన్ని, కళలను యీ సంస్థలు సామాన్య ప్రజలలో చైతన్య స్ఫూర్తికి ఎలా సద్వినియోగం చేసినదీ; వారికి విముక్తి మార్గన్నెలా చూపినదీ జగద్విదితం.

పీడిత ప్రజల సముద్ధరణ అపరాధంగా పరిగణింపబడి, యీ రెండు సంస్థలూ నిర్బంధ కాండకు గురిరావడమూ, అందువల్ల చాలా కాలం వాటి కార్య కలాపాలు సన్నగిల్లడమూ సంభవించి; యిటీవల కొన్ని సంవత్సరాలుగా అవి నూతనోత్తేజంతో రాష్ట్రం నలుమూలలా కృషి సాగిస్తున్నాయి. నవంబరు మొదటి వారంలో హైదరాబాద్‌లో జరుగనున్న ప్రజా నాట్యమండలి మహాసభ, డిసెం బరులో కాకినాడలో జరుగనున్న అభ్యుదయ రచయితల సంఘ మహాసభ ప్రగతి శీల కళా సాహిత్యాల యితోధిక వ్యాప్తికి తప్పక దోహదం చేయగలవు.

సాహిత్యం, కళలు సన్నిహితాలు; పరస్పరాధారాలు. కీర్తిశేషులు సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు, గరికిపాటి రాజారావు యీ రెండు సంస్థలకు తమ జీవితాలు అంకితం చేయడం యిందుకు నిదర్శనం. తమ మహా సభల ఫలితంగా, యీ రెండు సంస్థల సన్నిహిత సహకారం మరింత నిర్మాణ యుతంగా దిట్టపడగలదని ఆశించవచ్చును.

దేశ పరిస్థితులు, సామాన్య ప్రజలలో నానాటికి పెరుగుతోన్న అశాంతి వామపక్ష శక్తుల సమమైక్యతను విముక్తి మార్గంగా చూపుతున్నాయి. అనైక్యత అభ్యుదయ కాముకుల లక్ష్యసాధనకు మార్గం కాదన్న అవగాహన రానురానూ స్పష్టపడుతున్నది. కాబట్టి సమ సమాజ స్థాపన గమ్యంగావున్న సాహిత్య, కళా సంస్థలన్నీ యీ సమైక్యత కోసం కేంద్రీకృతంగా కృషిచేయడం తప్పని సరి అని గమనించవలసి వుంటుంది.

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం మద్రాసు శాఖ మాస పత్రిక

గురజాడ జాడ

శివలెంక ప్రకాశరావు

"తెలుగు సాహిత్యం అంతట్లోకి ముగ్గురే మహాకవులున్నారు. వాళ్లే తిక్కన, వేమన, గురజాడ" అని అంటాడు శ్రీ శ్రీ.

ఈ కవిత్రయంలో నవయుగ వైతాళికుడు గురజాడ. 'నవ్యాంధ్ర కవిత్వ శుభోదయానికి వేగుచుక్క, గురజాడ. సాహిత్యం ద్వారా సామాజిక పరిణామాన్ని తెచ్చిన సంఘసంస్కర్త గురజాడ. భూతాన్ని వదిలి, వర్తమానంతో భవిష్యత్తును ఊహించిన క్రాంతదర్శి గురజాడ. సహజమైన వాడుకభాషను కావ్యాలలో ప్రయోగించి దానికి విశ్వజనీనతను కలిగించిన మహామనీషి గురజాడ. ప్రబంధ వీధులలో బంధింపబడ్డ కావ్య కన్యకకు బంధాలు త్రెంపి 'ముత్యాల సరాలు' అలంకరించిన కవిబ్రహ్మ గురజాడ. కందుకూరి సాంఘిక విప్లవాన్ని గిడుగు భాషా విప్లవాన్ని సమన్వయపరిచి కొత్త సాహిత్య విప్లవాన్ని మేల్కొల్పిన వాడు గురజాడ.

1882 లో తన 22 వ యేటనే గురజాడ ఆంగ్లభాషలో కవిత్వం వ్రాసి 'Indian Leisure Hour' అనే పత్రికలో ప్రకటించాడు. ప్రముఖ వంగ విద్యావేత్త శంభుచంద్ర ముఖర్జీ వాటిని చదివి 1884 జనవరి 27 న వ్రాసిన లేఖలో "ఇతరులు సాధించిన గొప్పతనాన్ని తెలుసుకొనండి. కాని ఇతరుల మీద ఎన్నడు అధారపడవద్దు. మీ ఆత్మ శక్తిమీద మీరు విశ్వాసం ఉంచి, అన్ని విధాల దాని వికాసానికి కృషిచేయండి. మీలో ప్రతిభ ఉంది. సాధన చేత ప్రకాశమానం చేసుకోవచ్చును. జానపద గేయాలు, వివిధ ఛందస్సులలో పద్యాలు వ్రాయడానికి ఉపక్రమించండి" అని ప్రబోధించారు. అదే అప్పారావు గారిలో ఒక నూతనోత్తేజాన్ని కలిగించి 1893 లో కన్యాశుల్కాన్ని, 1910 లో ముత్యాల సరాల్ని సృజింప జేసింది.

ఈ రచనలకు ముందు ప్రాచీన సంప్రదాయాన్ని అనుసరించిన గురజాడ కలంనుంచి కొన్ని ఖండికలు వెలువడినాయి.

గురజాడ పై మొదట్లో పూర్వ సంస్కృతాంధ్ర కవుల ప్రభావం ఎంతగా ఉందో యివి విశదంచేస్తాయి. అయితే అలాగే అనుకరణ జీవిగానే ఉంటే గురజాడ పేరు మనం ఈనాడు చెప్పుకోవలసిన అవసరం లేదు, రాదు. అనుకరణ మొట్టమొదట ప్రతి కవికీ సహజమే! కాని ఆ ప్రభావం నుంచి బయటపడి తన సొంత గొంతు వినిపించినప్పుడే ఆ కవి చరితార్థుడవుతాడు. ప్రత్యేకమైన ఒక వ్యక్తిత్వం కలవాడవుతాడు. అదృష్టం కలిసి వస్తే అతడే మరికొందరికి తరవాత మార్గదర్శకుడవుతాడు. అట్టివాడే గురజాడ.

గురజాడ కవిత్వపు పోకడ మారడానికి ముఖ్యంగా షెక్స్పియర్, వర్డ్సు వర్తు వంటి కాల్పనిక కవులు, జాన్ స్టువర్టు మిల్, టి. హెచ్. గ్రీన్ వంటి

ఇంగ్లీషు తాత్వికులు కారకులు. అంతేకాక రాబర్ట్ బర్న్సు నుంచి స్వేచ్ఛా ప్రియత్వం, వ్యావహారిక భాషాప్రయోగ ప్రయత్నం, ఇబ్సన్ నుంచి నాటక రచనా శిల్పంతోబాటు పాత్ర చిత్రణ (మీనాక్షి, కన్యక వంటి స్త్రీ పాత్రలు) గురజాడ అలవర్చు కున్నాడు. 'లిరికల్ బాలెడ్స్' గూర్చి వర్డ్సువర్త్ చేసిన కవితా సిద్ధాంతాలు, ప్రకృతి వర్ణనలో అతడు చూపిన నైపుణ్యం, కావ్య నాయకులను తీర్చిదిద్దడంలో కావలసిన విశాల దృక్పథం గురజాడపై మంచి ప్రభావం కలిగించాయి. వీటితోబాటు, తనతో బుట్టి జగద్విఖ్యాతి గాంచిన రవీంద్రుని దేశీయచ్ఛందస్సు, ఏకేశ్వరోపాసన, మూఢ విశ్వాసాలపై తిరుగు బాటు గురజాడను బాగా ఆకర్షించాయి. ఇదే సమయములో తెలుగు గడ్డపై వీరేశ లింగం ప్రసంగాలు, గిడుగు పిడుగులు విరుచుకు పడ్డాయి. వీటన్నింటినీ జాగ్ర త్తగా పరిశీలించి ఆకళింపుచేసుకొని తనదైన ఒక కొత్త జాడను వేశాడు గురజాడ.

'కన్యాశుల్కం' అనే నాటకమే గురజాడ మొట్టమొదట చేసిన క్రొత్త ప్రయోగం. సజీవమైన వ్యావహారిక భాషా ప్రయోగానికీ, సమాజంలో పాతుకు పోయిన మూఢ విశ్వాసాల నిరసనకూ, మనస్తత్వ పరిశీలనకూ, పాత్ర చిత్రణకు కన్యాశుల్కం ఒక మచ్చు తునక. తెలుగుదనానికిది ఆటపట్టు. గిరీశం, రామ ప్పంతులు, పోలి శెట్టి, అసిరిగాడు వంటి పాత్రలు సహజమైన భాషలో ప్రత్యక్ష మయిన సజీవ చిత్రాలు. మధురవాణి లాంటి వేశ్యామణులు నాటి సాంఘికా చారాల కొక తార్కాణం.

అందుకే "అసలు గురజాడ యావత్ప్రపంచాన్నీ ఒక నాటకకర్త కళ్లతో చూస్తాడు. గురజాడ వ్రాసిన గేయాలూ కథలూ అన్నీ నాటకాలే!" అని అంటాడు శ్రీశ్రీ.

"తెలుగులో నవ్యరీతులకు ప్రయత్నించిన మొదడి కవిని నేనే. నా కావ్యకళ నవీనం. కావ్య యితివృత్తాలు భారతీయం. కవితలో నేను ఉత్తమ ప్రయోజనాలను ఉపలక్షించాను. జీవితాన్ని నూతనదృక్పథంతో దర్శించి, కథా కవితా రూపంలో దాని తత్వాన్ని అన్వయించడానికి ప్రయత్నించాను. నాకా కళలవల్ల జీవితం పట్ల కొన్ని ఆదర్శాలు వున్నాయి. వాటిని సంస్కృతీపరులు మాత్రం అర్థం చేసుకుని హర్షించగలరు. సంస్కృతీ శూన్యులు కావ్య కథా సంవిధాన హాస్య ధోరణులను గమనించి అంతటితో సంతృప్తి పడతారు."

'నాది ప్రజల వుద్యమము. దానిని యెవరిని సంతోష పెట్టడానికైనా వదలు కోలేను' అని తన డైరీలో వ్రాసుకొన్న దాన్నిబట్టి గురజాడ కవిత్వాన్ని ఒక ఉద్యమంగా స్థిరసంకల్పంతో ప్రారంభించినట్లు, దానికి కొన్ని ఆదర్శాలు ఉన్నట్లు స్పష్టమవుతుంది.

కవిత్వంలో చేసిన నూత్న ప్రయోగాలనుబట్టి గురజాడను ప్రాచీన కవి పాలకురికితో పోల్చారు మన విమర్శకులు. ఎందుకంటే పాలకురికిది శివభక్తి. గురజాడది మానవాభ్యుదయాసక్తి. ఆతడు జాను తెనుగుకూ, ఈతడు తెలుగు పలుకుబడికీ ప్రాణ ప్రతిష్ఠ చేశారు. ఇది గురజాడ 1909 లో వెలువర్చిన 'నీలగిరి

వాటల్ లో వెల్లువికింది. ఈ ఆరు పాటలూ మాత్రాచ్ఛందస్సులో కూర్చబడినా, ప్రాచీన సంప్రదాయ ముద్రనుంచి పూర్తిగా గురజాడ బయటపడనట్లు ఇవి రుజువు చేస్తాయి. 'భావించడం నా ముచ్చట, ఆలోచన నా బలం' అన్న ఆయన మాటలకివి నిదర్శనాలు. 'ఎచ్చట చూచిన—పచ్చిక పట్టులు, పొద పొద రొదలిడు పొలుపగు పిట్టలు ....' తరవాత –

'చూతునా అని చూసితిని మరి
చేతునా అని చేసితిని ఇక
చూడ చేయగరాని వింతలు
చూపి కన్నుల కట్టితిన్'

(లంగరెత్తుము)

'కన్నుకానాని వస్తు తత్వము
కాంచనేర్పరు లింగిరీజులు ;
కల్ల నొల్లరు ; వారి విద్యల
కరచి సత్యము నరసితిన్'

(ముత్యాల సరములు)

వంటి వాటిల్లో గురజాడ సాంప్రదాయమైన దేశి రచనలతోపాటు, పాశ్చాత్యుల 'లిరిక్కు'ల ప్రభావం తనపై ఉన్నట్లు స్పష్టపరిచారు.

కావ్య వస్తువును సామాన్య ప్రజా జీవితంనుంచి గ్రహించి 'మైకేల్' వంటి కావ్యాలు వ్రాశాడు వర్డ్స్‌వర్త్. అలాగే 'లవణరాజు కల' లో 'మాలెత'ను, 'కన్యక'లో సెట్టి కూతురును, 'పూర్ణమ్మ'లో పూజారి కూతురును కావ్యనాయికలుగా స్వీకరించి గురజాడ కవిత్వంలో నవ్యత్వం చూపించారు. విజయనగరం రాజా వారి సంస్థానంలో మెదిలిన మనిషి కాబట్టి సాధక బాధకాలన్నీ అనుభవపూర్వకంగా తెలుసుకున్నాడు గురజాడ. అందుకే "పెద్ద వ్యవస్థలో నుండు దుర్జనుని కన్న తక్కువ స్థితిలో నుండు సజ్జనుడు నిజమైన గొప్పవాడు కాడా ?" అని 'వ్యాస చంద్రిక'లో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయం గురజాడ జాడ కొక అలంబన.

"గురజాడ సాహిత్యంలో జీవితాన్ని ఫొటోగ్రాఫ్ మాత్రమే కాదు, యక్సురే ఫొటోగ్రాఫ్ కూడా చేశాడు" అను శ్రీశ్రీ మాటలు గురజాడ తత్వానికి ముత్యాల మూటలు.

ఊహలతో కసరత్తులు చేయించడం, కృత్రిమమైన పద చిత్రాలు సృష్టించడం గురజాడ జాడకు 'చుక్కెదురు.' కవితలో వాస్తవికతను ప్రవేశపెట్టిం వాడు గురజాడ.

'వెలుగు నీటను గ్రుంకె చుక్కలు
చదల చీకటి కదల బారెను
యెక్కడనొ వొక చెట్టు చాటున
వొక్క కోకిల పల్కు సాగెను

మేలు కొలుపులు కోడి కూసెను
విరులు కన్నులు విప్పిచూసెను
ఉండి ఉడిగియు ఆకులాడగ
కానరె నోయన గాలి వీచెను'

అనే ముత్యాల సరంలో ప్రభాత వర్ణనం ఎంత స్వభావ సిద్ధంగా ఉందో గమనించండి.

అలాగే 'లవణరాజు కల' లో నాయిక పాట పాడిన ఘట్టంలో

'పాట పాడెను, చెట్లు చామలు
కోటి చెవులను గ్రోలి యలరగ
తాటి పనమున వాగి చంద్రుడు
తాను చెవియొగ్గన్'

అనే వర్ణన ప్రకృతి పరవశత్వాన్ని కన్నులకు కట్టిస్తుంది.

గురజాడ వారి 'పూర్ణమ్మ' ఒక అపూర్వ సృష్టి – ఆమె ఒక 'పుత్తడి బొమ్మ'. ఆమె నడలు 'పళ్లను మీరిన తీపులు' 'కొండల నడుమ కోనొకటున్నది...' ఇత్యాదిగా ప్రారంభమయిన గురజాడ వారి భావనాశక్తి 'కన్నుల కాంతులు కలువల చేరెను ... దుర్గను చేరెను పూర్ణమ్మ' అనడంతో శిఖరాయమాణమయింది. ఇది ఒక చక్కని చిక్కని ధ్వని కావ్యం. చిన్న అద్దంలో పెద్ద కొండను చూపెట్టిన గురజాడ ప్రతిభకిది ఒక పట్టు.

గురజాడ మానవతావాది. 'కన్యాశుల్కం' లోని మధురవాణి మట్టిలో బుట్టిన మాణిక్యం. మనిషిలోని మంచితనానికి ఒక ప్రతీక. మానవుడిలో మాధవుడిని చూచిన, చూపిన క్రాంతదర్శి, కాంతిప్రదర్శి గురజాడ.

'మనిషి చేసిన రాయి రప్పకి
మహిమ కలదని సాగిమొక్కుతు
మనుషులంటే రాయి రప్పలకన్న కనిష్టం
గాను చూస్తావేల బేలా ?
దేవుడెకడో దాగెనంటూ
కొండ కోనల వెతుకులాడే వేలా?
కన్ను తెరచిన కానబడడో ?
మనిషి మాత్రుడి యందు లేడో ?
యెరిగి కోరిన కరిగి యీడో ముక్తి!' (మనిషి)

అనడంలో నాస్తిక వాదం ఉందని భ్రమించినా మానవతా వాదానికే ఇది గురజాడ వేదం.

దీనిపై "whom dost thou worship in this lovely dark corner of temple with doors all shut?'' ఇత్యాదిగాగల రవీంద్రుని గీతాంజలిలోని గేయం పూర్తి ప్రభావం కల్గించిందని విమర్శకుల మాట. అయినా గురజాడ స్వాభిప్రాయాన్ని ఇందులో ఎలుగెత్తి చాటాడు.

గురజాడ బ్రహ్మసమాజానికి అతీతుడు. మానవకారుణ్య సిద్ధాంత ప్రతిపాదనకు మాత్రమే ఆ మతం ఆయనకు సమ్మతం.

'సంఘ సంస్కరణ గురజాడ ప్రయాణ పతాక. ఆయన మనోరథానికి సాహిత్య రథం ఒక ముఖ్య సాధనం. 'కన్యాశుల్కం' ఆ ప్రయత్నంలో పండిన రాజనాల పంట.

'లవణరాజు కలలో

"మలిన దేహుల మాలలనుచును
మలిన చిత్తుల కధిక కులముల
నెలవు సంగిన వర్ణ ధర్మమధర్మ ధర్మంబే

అని మాల అనేది మనసు బట్టి కలగాలని ప్రతిపాదించాడు. అలాగే

'మంచి చెడ్డలు మనుజులందున
ఎంచి చూడగ రెండె కులములు;
మంచి యన్నది మాలయైతే మాలనే అగుదున్

అనే ఉత్తము సంస్కార వంతుడు గురజాడ. ఈ అభ్యుదయ భావాలు గాంధీ గారి కంటే గురజాడలోనే ముందుగా పొడచూపాయి. 'పూర్ణమ్మ'లో వృద్ధవివాహాలను ఖండించాడు గురజాడ. అది కూడా ఆయన సంఘసంస్కరణలో ఒక భాగమే.

గురజాడ ప్రతిపాదించిన ప్రేమ ద్వివిధాలు. (1) పవిత్ర దాంపత్యరక్తి (2) విశ్వ మానవ ప్రేమ.

మొదటి దానికి 'కాసులు' అన్న గేయం ఒక ఉదాహరణ. నగలు తేలేదని మగనిపై అలిగిన మగువ నూరడిస్తూ పలికిన పలుకులు కలకాలం నిలిచే తళుకులు. గమనించండి ఒకసారి.

"మరులు ప్రేమని మది దలంచకు
మరులు మరలును వయసు తోడనె;
మాయమర్మము లేని నేస్తము
మగువలకు మగవారి కొక్కటె
బ్రతుకు సుకముకు రాజ మార్గము -
ప్రేమ నిచ్చిన ప్రేమ వచ్చును -
ప్రేమ నిలిపిన, ప్రేమ నిలుచును."

అలాగే విశ్వ మానవ ప్రేమను

'ఎల్ల లోకము లొక్క యిల్లై
వర్ణభేదము లెల్ల కల్లై
వేల నెరుగని ప్రేమ బంధము
వేడుకలు కురియ'

అనే ముత్యాల సరంలోనూ,

'దేశమనియెడు దొడ్డ వృక్షం
ప్రేమలను పూలెత్తవలెనోయ్

అన్నదమ్ముల వలెను జాతులు
మతములన్నీ మెలగ వలెనోయ్'

అనే దేశభక్తి గేయంలో ఎలుగెత్తి చాటాడు గురజాడ.

ఆయన దేశభక్తికి ఎల్లలు లేవు. దేశమంటే మట్టికాదనీ, మనుషులేనని తెలియ జెప్పిన మహనీయుడు గురజాడ. ఇది 'టెన్నిసన్' వ్రాసిన 'Love thon thy land' అనే శీర్షికను పోలింది,

ప్రబోధ కవిత్వానికి అప్పారావుగారే మార్గదర్శకులు. ఇది తరువాతి నవ్య కవులపై చాల ప్రభావం తెచ్చింది. అలాగే 'అరటికాయ బజ్జి -మినపప్పు సొజ్జి ...' ఇత్యాదిగా గల 'మిణుగురులు' అనే వీరి బాల గేయం ఆ ప్రక్రియకు మూలమనే చెప్పాలి.

కవిగానే కాక కథా రచయితగా కూడా గురజాడ ఒక ధ్రువ తారగా నిలుస్తాడు. "దేవుడు చేసిన మనుష్యుల్లారా! మనుషులు చేసిన దేవుళ్లారా మీ పేరేమిటి ?" అనే వీరి కథానిక చాల ఉత్తమమయింది.

గురజాడ ఎంత హాస్య ప్రియుడో అంత గంభీరుడు. ఎంతటి ఆత్మీయత గలవాడో అంతటి నిర్మొగ మాటి. అందుకే తన పంథా నచ్చని వాళ్లను

'మెచ్చనంటావీవు, నీవిక
మెచ్చకుంటే మించిపాయెనె ?
కొయ్యబొమ్మలె మెచ్చు కళ్లకు
కోమలుల సొగెక్కునా ?"

అని విమర్శించాడు ముత్యాల సరంలో.

గురజాడ బుద్ధి పూర్వకంగానే. వ్యాకరణాన్ని త్రోసి రాజని రచనలో ఒక తిరుగుబాటు తెచ్చాడు. యతి ప్రాసలూ, పాదనియమాలు పాటించ లేదీయన. కాని గురజాడ 1915 అక్టోబరు 30 న రచించిన

'అందజాలని పళ్ల కోసము
అఱ్ఱు జాపితి, నేల పాకిన
చెట్ల పళ్లను విలువ లెరుగక సాదరక్షల మట్టితిన్

తీపివిరిగిన చెరకు వలె ఆ
నాటి కోర్కెలు నేడు బెండా
టెంచి నవ్వితి; బుద్ధిచపలత కొత్త కోర్కెల తలిగితిన్"

(దించు లంగరు)

అనేది కవిత్వంలోని గుట్టును బట్టబయలు చేస్తున్నది.

ఏది ఏమయినప్పటికీ కృష్ణ శాస్త్రి గారన్నట్టు "1915 లో గురజాడ చని పోయినా తరువాతనే ఆతడు జీవించినాడు." ఎందుకంటే - నూత్న ఛందో క్రియకు, గేయ కథా కావ్య రచనకు, ప్రబోధ కవిత్వానికి, సంఘ సంస్కరణ ప్రియ త్వానికి, బాల గేయ నవ్యత్వానికి ఒక విధంగా గురజాడ మూల పురుషుడు. తరు వాతి అభ్యుదయవాదులకు మార్గదర్శకుడు. నేటి పత్రికల్లో, ఆకాశవాణిలో వాడే భాషపై గురజాడ ప్రభావం చాల వుంది.

గురజాడ లేకపోతే మన జాడ ఎలా ఉండేదో మరి !

కవికొండల వారి కవితా వైభవం

సోమసుందర్

కీర్తిశేషులు కవికొండల వెంకటరావు గారు కవిగా కథకులుగా బహుముఖ ప్రజ్ఞాశాలి. వారు దాదాపు సహస్ర మాసజీవిగా పూర్ణాయుర్దాయం అనుభవించారు. తమ వృత్తి తాము చేసుకుంటూ – నిరాడంబరంగా సాహిత్య సేవచేసి కీర్తిమంతు లయ్యారు. పటాటోపంలేని సాహితీ సృజనతో కాలం గడిపారు.

వారు రాజమండ్రి తాలూకా శ్రీరంగపట్నంలో ఒక సంపన్న కులకర్ణి కుటుంబంలో 20. 7. 1892 లో జనన మొందారు. రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో స్వర్గీయ అడవి బాపిరాజు ప్రభృతుల సహాధ్యాయిగా చదువు కొన్నారు. సమగ్రకళాశీలి, సర్వతోముఖ ప్రతిభాశాలి కూల్డ్రే దొర ప్రిన్స్‌పాల్‌గా ఉండి ఆనాటి ఈ విద్యార్థులందరిపై సంగీత సాహిత్య చిత్రలేఖనాది కళలపై ఆసక్తి కలిగించి ఎంతో ప్రభావం బరిపారు. మహాచిత్రకళాకారుడుగా అంతర్జాతీయ కీర్తి పొంది, పిన్న వయసులోనే కన్నుమూసిన దామెర్ల రామారావు గారు కూడ వీరికి సహాధ్యాయే కాక కవికొండల వారికి సన్నిహిత బంధువులు కూడ.

రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో బి. ఏ. పటం పుచ్చుకొని, మద్రాసు లా కాలేజీలో బి. ఎల్. చదివారు కవికొండల.. అప్పటినుంచీ రాజమండ్రిలోనే న్యాయవాది వృత్తిలో స్థిరపడ్డారు. ఒక సాదా ధోవతి, ఒక షర్టు, నలిగి పింజలు పోసిన ఉత్తరీయం ధరించి నిరాడంబరంగా రాజమండ్రి పురవీధుల్లో బక్క పల్చగా తొందరగా నడచి వెళ్ళే వ్యక్తి ఎవరైనా పదేళ్ళ వెనుక కంటపడితే – వారే కవికొండల వెంకటరావు గారుగా ఎవరైనా పోల్చుకోవచ్చు. కోర్టుకు వెళ్ళేప్పుడు మాత్రం – ధోవతిలో షర్టు ఇన్సర్టు చేసి – నలిగిపోయిన నల్ల కోటు వేసుకొనేవారు. దారిలో ఎవరైనా చిన్న పిల్లవాడు పలకరించినా, ఒంగి నమ్రతగా జవాబు చెప్పేవారు. మనిషి ఊదితే పడిపోయేటట్లు చీపురుపుల్లలా ఉండేవారు. మనిషి వేషభాషల్లో పిసరంత గీర్వాణమైనా కనిపించేది కాదు. ఉపన్యాసానికి పూనుకుంటే – అలా అలా పాదరసంలా జారిపోతూ సాగిపోవడమే గాని – విషయాన్ని సూటిగా పాయింటుకు బద్ధమై సాగించలేకపోయేవారాయన. అందుకే పాపం ఆనాటి రాజమండ్రి పౌరులు – ఆయన పట్టుకుంటే ఒక పట్టాన విడిచిపెట్టరని తమలో తాము గుసగుసలాడేవారు.

నేను, మా తమ్ముడు శశాంకా చాలా మారులు వారింటికి వెళ్ళేవాళ్ళం. మా పట్ల చాలా ఆత్మీయంగా ఉండేవారాయన. సాహిత్యాభిమాను లెవరైనా ఎంతో ఆప్యాయతతో స్వీకరించేవారాయన. గంటలు గంటలు మాట్లాడుతూ – తమ పనులన్నీ పాడు చేసుకొనేవారు.

వారు 4. 7. 1969 వ తేదీన గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో కన్నుమూశారు. 1935 లో తొలిప్రచురణ పొందిన అత్యంత మనోహర కవితా సంకలనం 'వైతాళికులు' లో వారి

కవితా హృదయం గురించి శ్రీ ముద్దు కృష్ణ చక్కని మదింపు చేశారు. "ఆంగ్ల కవి ప్రపంచంలో వర్డ్స్‌వర్తు వలె అడుగడుగునా ప్రకృతి ఉపాసకుడు. ఆలు చిప్ప మొదలు శివరాత్రి ప్రభ వరకూ సృష్టిలో సమస్తమూ ఈయనకు ఏదో కొత్త ఊహను స్ఫురింప చేస్తుంది. రచనలలోనూ ఊహలలోనూ వైవిధ్యం ఎక్కువ. భాష పట్టింపు లేదు. భావాన్ని బట్టి, మానసిక స్థితినిబట్టి పద్యం ఇష్టం వచ్చినట్లు స్వతంత్రించి పరిగెడుతుంది. ఏవస్తువైనా అమిత ఉత్సాహాన్ని, ఆవేశాన్ని కలిగిస్తుంది. ఊహాలలో మిక్కిలి ప్రత్యేకత కలవాడు. మొత్తంమీద భావంలో వినూత్నత, విధానంలో అతి స్వతంత్రతగల సాహసుడు . . ." అంటూ కీర్తించిన ముద్దుకృష్ణ గారి మాటలు అక్షర సత్యాలు. అవి 1935 లో ఎంత సత్యాలో ఇప్పటికీ అంత సత్యాలే!

శ్రీ కవికొండల వారికి అభిమానులంతా కలిసి 17-7-1952 న ఎంతో వైభవంగా షష్టిపూర్తి జరిపారు. ఆ సందర్భంలో విశాల విశ్వము అనే పేర వారి కవితలను ఒక సంపుటిగా ముద్రించి యిచ్చారు. ఆ గ్రంథంలో తొలి రచనగా శివరాత్రి ప్రభ స్వీకృతమైంది.

ఈ శివరాత్రి ప్రభ - ఈ శతాబ్దంలో రచించబడిన ఉత్తమ కవితలో ఒకటిగా నిస్సందేహంగా పేర్కొనవచ్చు. అది ఈ శతాబ్దపు రెండవ దశకంలో రచింపబడింది. మూడవ దశాబ్దంలో సర్వ సాహితీ ప్రియుల ఆదరాన్ని చూరగొన్నది. దాని ప్రభావం చాలామంది కవులపై కనిపిస్తుంది. అలాగని అంగీకరించిన వారు శ్రీ శ్రీ ఒక్కరే అయినా - సర్వశ్రీ వేదుల సత్యనారాయణ శాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు గారి శివతాండవం మున్నగు కృతులపై కనిపిస్తుంది. ఇలాగని చెప్పడం ఆ కవిత విశిష్టతను అవగతం చేసుకుందుకే గాని - సమకాలిక కవులను కించపరచడం కాదు.

ఆ దినాలలో వెలువడిన కవికొండల వారి శివరాత్రి ప్రభ - మూకలో కలసిపోని విశిష్టవ్యక్తిత్వంగల దీపస్తంభంలా నిలచింది. స్వరూప స్వభావాలలో పూర్తిగా స్వీయమైన వ్యక్తిత్వ స్ఫూర్తిని సముపార్జించుకో గలిగిన కవిత. ఇది ఫలానా మాత్రాఛందంలో రచించబడిందని వక్కాణించి చూపడమే కష్టం! షట్పదీ రగడలలో ఒక స్వరూపమూ అంటే రుజువు కాదు. ఇతివృత్తమూ - మన పౌరాణిక సంప్రదాయ స్పృహ నుంచి ఎన్నుకోబడిందే! కాని ఆ అభివ్యక్తి సంవిధానంలో ఏదో అనిర్వాచ్యమైన సమకాలీన స్వేచ్ఛా చైతన్యం అంతర్లీనంగా భాసించడం వల్ల — ఆ కవితమ తమ గుండెల మ్రోతగా జాతి స్వీకరించింది.

"కాల కంఠుని నాగసర్పము
కుబుస మూడ్చి పడగ బున్నందీ!
రెండు నాల్కలు గండు మీసాలట్లు
దూసింది!
నాగసర మూదేది ఎవరోయి?
కారు నల్లని కారు రాత్రి! . . ."

అనే ప్రారంభ వాక్యాలతో సాగే ఈ మహాకవిత - మన చుట్టూ ఒక ఝంఝూ మారుత సదృశ వేగాన్ని సృష్టించుతుంది. నింపాదిగా మనసులో మననం చేసుకుంటూ చదువుకుందామంటే - మన ప్రయత్నాన్ని ఎంత మాత్రం సాగనీయని మహోద్రేకం

సర్వాంగీణంగా సంతరించబడింది. చదువరి తనకు తెలియకుండానే గొంతెత్తి విపరీతావేశంతో చదువుతూ, ఊగి పోతాడు. అలాంటి ప్రాణశక్తినీ, ఆవేశ స్ఫూర్తినీ ఆద్యంతం ఆ కవితలో దట్టిం చారాయన. పదాల పోహళింపులో ఒక ఓజస్వంతమైన పొంకం చేకూరింది.

అందుకే, కవిత్వంలో తానుగా తీసుకు రాగలిగిన మార్పులేమిటా, నడవవలసిన కొత్త దారు లేమిటా అని మౌన తపస్సులో అన్వేషిస్తున్న రోజు లలో శ్రీ శ్రీకి మార్గదర్శన రచనలలో ఒకటిగా ఈ శివరాత్రి ప్రభ దర్శన మిచ్చింది. ఆ కవిత అతనిపై కొంత ప్రభావం కలిగించడంలో ఆశ్చర్యం లేదు. దీన్ని శ్రీ శ్రీ నవీన కవితావిర్భా వంగురించి రచించిన వ్యాసాలలో తెల్పు కున్నారు. (చూ. శ్రీ శ్రీ సాహిత్యం).

"నొసట కొసరిన మూడో కన్ను ।నివురు లూదిన కొలిమి దెగడి। నెగడి దిప్పింది ... పొగలు గప్పింది.'' అలా లేచిన జ్వాలాసహస్రం ఎలా ఉపయుక్త మవుతున్నదో కవి చమత్కరిస్తాడు. "కమ్మరయితే యినుము కరగగ - సోమరైతే చలిని కాగ .. ఎవరు వచ్చా రోయ్! ఎవరు మెచ్చారోయ్ ?'' అంటూ ప్రశ్నిస్తారు. జవాబుకోసం ఆశించని ప్రశ్న. ఇష్టం ఉన్నా లేకున్నా - ఆ శివ రాత్రి ప్రభను అందరూ హర్షించారని ధ్వని. కమ్మరి తన ఇనుము కరగించు కుందుకు ఇంధనపు ఖర్చు లేకుండా ముక్కంటి కంటి మంటల్ని ఉపయో గించు కున్నాడు. నొసట కొసరిన మూడో కన్ను కొలిమి నెగడి మంటలలో సోమరిపోతులైన అయ్యలు చలిని కాచు కుంటున్నారు. ఒక నిరంజన భావ చిత్రాన్ని (abstract idea) వాస్తవ పద చిత్రంగా - (concrete image) లోకి అనువర్తింపచేసి చెప్పడం ఆనాటి ప్రయోగశాలుర కవితలలోనే ఆరంభ మైంది. దానికిది ప్రబల సాక్ష్యం!

విశాలవిశ్వము అనే ఈ కవితా సంపుటి 1952 లోనే ఆంధ్రప్రభ (దినపత్రిక) లో సమీక్షింపబడింది. సుప్రసిద్ధ విమర్శకులు స్వర్గీయ డాక్టర్ శ్రీపాద గోపాలకృష్ణ మూర్తి గారు విపులంగా సమీక్షించారు. వారు తమ సమీక్షకు - మసిబొగ్గులూ మాణిక్యాలూ అనే శీర్షిక ఉంచారు. వారి మదింపులో శ్రీ కవికొండల గొప్ప ఊహాకవిత ఉన్నకవి. కాని విచక్షారహితంగా పొల్లూ నెల్లూ కలగల్పి గ్రంథంగా ఎత్తా రన్నదే వారి అభిశంస! ఇది ప్రతి రచ యితకూ పరిహరించ వలసిన దోషమే! శ్రీపాదవారు ఎన్నో సాహిత్య సభల్లో- గొంతెత్తి శివరాత్రి ప్రభను గానంచేసి, శ్రీ కవికొండలవారి కవితా వైశిష్ట్యాన్ని ఉగ్గడిస్తూ ఉపన్యాసాలిచ్చిన అభి మానులే! అయితే అభిమాన దురభి మానాలు మనీషకు నేత్ర కుసుమం కారాదనే వారి ఆవేదన! ఉచితానుచిత గుణ దోష విమర్శ లేకుండా సర్వాన్నీ తలకెత్తుకోవడం ఎవరి పట్లనైనా శుష్క వీరారాధనా భావమే! ఆ వ్యాసంలోనే శ్రీపాద వారు కవికొండల వారిని షష్టి పూర్తి సందర్భాన్ని పురస్కరించుకొని హృదయపూర్వకంగా అభినందించారు. వారి సాహిత్యమూర్తికి నీరాజనా లర్పిం చారు. కథానికా సంపుటాన్ని కూడా ముద్రించాలని షష్టిపూర్తి సంఘం వారిని అర్థించారు. కాని ఇప్పటికీ జరగలేదు.

1968 లో విశాలాంధ్ర ప్రచురణా లయం వారు ప్రచురించిన వైతాళికులు సప్తమ ముద్రణలో శ్రీ కవికొండల

వెంకటరావు గారిని పాపం — 1966 లోనే మరణానికి గురి చేసారు శ్రీ ముద్దుకృష్ణగారు. (చూ. వైతాళికులు పుట 269) కవుల జీవిత విశేషాల గురించి కొసమెరుపులు దిద్దడంలో వారికీ పొరబాటు సంభవించింది.

శ్రీ కవికొండల సర్వకవితా రచనలూ, దాదాపు గ్రంథస్తమైపోయాయి. వారి కావ్యాలలో నెలబాలుడు, ప్రకృతి చందనం, మాతృదేశ సంకీర్తనం, జనపదములు, విలాసినీ వైనతేయము, వివిధ కుసుమావళి యిత్యాది.

వీరు కవితలోనే గాక కథానికా రచనలో కూడ మిక్కిలి నిష్ణాతులని లోగడ చెప్పుకొన్నాం. నేనెరిగినంత వరకూ వీరి కథలు సుమారు రెండు వందల వరకూ ఉంటాయి. వారి కథలు నవ్వుల తోట, వినోదిని, రెడ్డి రాణి వంటి వాటి మొదలుకొని యిటీవలి పత్రికల వరకూ అన్నింటా ప్రచురితమయ్యాయి. అయినా అధిక సంఖ్యాకాలు భారతిలోనే ప్రచురితమయ్యాయి. పాత భారతి సంపుటాలన్నీ వరుసగా తిరగవేసిన వారికి వారి కథలన్నీ దర్శనమిస్తాయి. అయినా కథా సంపుటి గ్రంథ ప్రచురణ కాక పోవడం దురదృష్టం. వీరి కథలలో విశాలమైన గ్రామీణ సామాజిక జీవితం ఎంతో నిశితంగా పరిశీలింపబడింది. పల్లీయుల కష్టనిష్ఠురాలు, సామాజిక దోపిడీ, పెత్తం దారుల దాష్టీకం, పల్లెపడుచుల శృంగార, వెరసి జీవన ప్రకృతి యావత్తూ నిలువెత్తు చిత్రంగా ఆవిష్కృతమై సాక్షాత్కరిస్తుంది. కథానికా రచనలో వీరెన్నో కొత్త పోకడలు పోయారు. సమకాలీన కథాసాహిత్యంలో ఒక విశిష్టమూర్తిమంతనాన్ని సాధించుకున్నారు. ఐతే వీరికి సహజంగా అవరోధమై ఎదురు నిలిచే వెకిలితనం కూడా అడపా దడపా గోచరమైనా - దానిని సానుభూతిగా విస్మరిస్తే - సత్ఫలితాన్ని పాఠకుడు తప్పక పొందగలడు. ఎప్పుడో పాతిక సంవత్సరాల క్రితం భారతిలో ప్రచురితమైన - 'ఉస్తి' అనే కథలోని పాత్ర హావభావ విశేషాలు గాని, సరసోక్తులు గాని - ఈ వ్యాసకర్త హృదయ తలాన్ని యింత వరకూ విడిచి పెట్ట లేదంటే - ఆ కథలోని శక్తి ఎంతటిదో తెలుస్తుంది. అలాంటి ఉత్తమ కథలను ఎన్నిక చేసి, ఒక విపుల పీఠికతో గ్రంథంగా ప్రచురించుకోవలసి ఉంది. ప్రచురణకర్త లెవరైనా ఆ మహత్కార్యానికి పూనుకుంటే— ఈ వ్యాసకర్త సహకార మందించడానికి సంసిద్ధుడే!

కవికొండల వారి సమగ్ర సాహితీ వ్యక్తిత్వాన్ని పరిశోధించి, వారి విశిష్టతను విలువ కట్టగల సమర్థులైన యువకులకు మన విశ్వవిద్యాలయాలు అవకాశం యివ్వడం ద్వారా మంచి కృషి సల్పిన వారవుతారు. నిరాడంబర సాహితోపాసకులుగా, సరస సాహితీ ప్రచారకులుగా, నిస్స్వార్థ జీవిగా బ్రతికి తృప్తిగా కన్ను మూసిన శ్రీ కవికొండల వారు విస్మరింపదగిన సాహితీమూర్తి కాదు.

ఆయన కవిత్వ రంగంలో - అటు మార్గ సంప్రదాయాన్ని, యిటు దేశ సంప్రదాయాన్నీ పరిపుష్టిగా పోషించారు. వారి జనపదములు, విశాల విశ్వము వంటి కృతులలో జానపద సాహితీ సంప్రదాయం ఎంతో పరిపోషించారు. ఆ కవితల గురించి మరొకమారు ముచ్చటించు కుందాం.

తెలుగు సాహిత్యంపైని అక్టోబరు విప్లవ ప్రభావం

తుమ్మల వెంకటరామయ్య

అక్టోబర్ సోషలిస్టు మహా విప్లవం రష్యాలోనే గాక ప్రపంచ చరిత్రలోనే నూతనాధ్యాయాన్ని లిఖించింది. ఆనాడు పరాధీనంగా ఉన్న దేశాల ప్రజలకు ఆ విప్లవం ఒక ఆశాజ్యోతి. అలాంటి సామాజిక పరివర్తనకై ఉవిళ్లూరే జాతీయ స్వాతంత్ర్య యోధులకు వేగుచుక్క. ఆ విప్లవాన్ని గురించి సమగ్ర సమాచారం లేకున్నా, జాతీయోద్యమాలలో పాల్గొంటున్న మేధావులపై అక్టోబర్ విప్లవ ప్రభావం ప్రగాఢంగానే వుండేది.

1921 లోనే గోవిందరాజు వెంకట కృష్ణారావు ఇంగ్లీషులో ''నికొలాయ్ లెనిన్'' అనే గ్రంథాన్ని రాశారు. అదే సంవత్సరం ''ఆంధ్ర పత్రిక'' ఉగాది సంచికలో ప్రముఖ జాతీయ నాయకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య రష్యా విప్లవాన్ని పొగుడుతూ ఒక వ్యాసం రాశారు.

ఉన్నవ లక్ష్మీనారాయణ నవల ''మాలపల్లి''లో ఈ విప్లవ ప్రభావం స్పష్టంగా కనబడుతుంది.

''మాలపల్లి'' రచయిత జాతీయ వాది. దేశ స్వాతంత్ర్య ఉద్యమాలలో పాల్గొని కారాగార శిక్ష అనుభవిస్తున్న కాలంలో ఆయన ''మాలపల్లి'' రచించారు. ఆయన సోషలిస్టు కాదు. ఐనా, అట్టడుగున పడివున్న హరిజన వ్యవసాయ కార్మికుల దుర్భర జీవన పరిస్థితులు ఆయన్ని కదల్చి వేశాయి. వారి పోరాటాలూ, గ్రామాలలోని వర్గ పరిస్థితులూ ఈ నవలలో చక్కగా చిత్రింపబడ్డాయి.

అక్టోబర్ విప్లవం గురించి ఆ నోటా ఆ నోటా వింటున్న ప్రజలలో కల్గిన చైతన్యం, దోపిడి వ్యవస్థ, వర్గ పోరాటం, సమ్మెలు, బోల్షివిజం మొదలైన అంశాలు విరివిగా ప్రస్తావించబడ్డాయి, ఈ నవలలో.

అక్టోబర్ విప్లవం నాటికి శిథిల మౌతున్న పెట్టుబడిదారీ ప్రపంచాన్ని గురించి, ''మాలపల్లి'' పీఠికలో ఆంధ్ర పత్రిక సంపాదకులు కాశీనాధుని నాగేశ్వరరావు ఇలా అన్నారు.

'' ... . సకల వ్యవస్థలును శిధిలములై పునర్నిర్మాణము నపేక్షించుచున్న విధమును ప్రపంచావరితమైన మహాపరివర్తనము విశదము చేయుచున్నది. .... 'మాలపల్లి' యందు సంకల్పించిన నవజీవన నిర్మాణ విధానము లాంధ్ర సాహిత్య సంస్కారమునందు నూతనాధ్యాయములు.''

"మాలపల్లి" లోని భాష, భావము, రచనలలో "నవజీవనోద్యమములు గోచరమగుచున్నవి" అని కూడా ఆయన అన్నారు.

ఏమిటా పరివర్తనం? ఏమిటా నవజీవనోద్యమం?

నిస్సందేహంగా అక్టోబర్ విప్లవాన్ని మనసులో ఉంచుకొనే నాగేశ్వర రావు గారా పదాలను వాడారు.

1921 లో జైలులో రాసిన ""మాలపల్లి"" నవలను 1922 లో తొలిసారి రచయిత ప్రచురించారు.

ఈ నవల రాసిన కాలానికి ఆంధ్రదేశంలో చెప్పుకో తగిన పరిశ్రమలు లేవు. అందుచేత పారిశ్రామిక కార్మికుల ప్రస్తావనను ఊహించలేము. ఐతే సమాజంలో దోపిడిచేసే వర్గాలున్నాయనీ, అట్టడుగున ఉన్న వ్యవసాయ కార్మికులా దోపిడికి బలి అవుతున్నారనీ ప్రప్రథమంగా వర్ణించింది "మాలపల్లి." అంతే గాదు, ఈ నవలలోని "ధర్మ దోపిడుల" సిద్ధాంతం సోషలిస్టు విప్లవానికి సమగ్ర అవగాహన, కాదు. వర్గ సంఘర్షణ దుస్సాహస పథం పట్టిన రూపం అది.

ఈ నవలలోని ""సంగదాసు,"" భూస్వామి దౌర్జన్యాలను ప్రతిఘటించే పాత్ర. హరిజన వ్యవసాయ కార్మికులలో చైతన్యం రగిల్చి సమ్మెలకు నాయకత్వం వహించే వ్యక్తి. భూస్వామి దౌర్జన్యానికి అతడు బలి ఔతాడు. ఆ మరణ దృశ్యాన్ని ఎంతో ఆవేదనతో, ఆవేశంతో చిత్రిస్తారు రచయిత.

""లోకంలోని అక్రమాలను జూచి ఆక్రోశించిన రక్తం, ఉన్నత భావాలను ఉద్రేకించిన రక్తం, పరుల సేవలో పాలిపోయిన రక్తం, పవిత్ర భావాలచేత పావనమైన రక్తం, గొట్టాలు జిమ్మినట్లు ప్రవహిస్తున్నది."

ఇందులోని మరొక పాత్ర వెంకటదాసు. ""తక్కెళ్ల జగ్గడు"" అనే మారు పేరుతో ధనికుల ఆస్తిని కొల్లగొట్టి పేదలకు పంచేవాడు. దీనినే ""ధర్మ కన్నాలు"" లేక, ""ధర్మ దోపిడులు" అని పిలిచేవాడు.

""తక్కెళ్ల జగ్గడి" నాయకత్వమున నడిచిన ధర్మదోపిళ్ల యుదంతము సాంఘిక పరివర్తనము నందు నూతనాధ్యాయము" అని "మాలపల్లి" పీఠికలో కాశీనాధుని నాగేశ్వరరావు గారన్నారు.

""ధర్మ కన్నాల""గురించి వెంకటదాసు ఇలా నిర్వచించుతాడు.

""ఎవడైనా తనకవసరమైన దాని కంటె ఎక్కువ భాగ్యం పోగుచేసి అవసరమైన వాళ్లకు ఉపయోగ పడకుండా నిలువజేసినా, లేక, దుర్వ్యయం చేస్తున్న వాడింట్లో కన్నంవేసి ఆ ద్రవ్యమంతా లోకాని కుపయోగ పడేటట్లయితే అది ధర్మకన్న మంటారు.""

""ఎవరు దొంగలు ?"" అనే దానికి వెంకటదాసు సమాధానం ఇది:

"... అంతా దొంగలే. కాని వాళ్లెవరు? పెద్ద శేట్లు పెద్ద దొంగలు. ... దాళాలో, తూనికలో పిక్కి, కల్తీచేసి, తప్పు ధరలు చెప్పి పెద్ద శేట్లవుతారు.""

తన మార్గం అధర్మమని వాదించిన వారికి సమాధానంగా వెంకటదాసు యుద్ధాల స్వభావాన్ని ఇలా వివరిస్తాడు.

""నేను చేసే యుద్ధం ధర్మయుద్ధం. పౌరుషమనీ, ప్రతాపమనీ, దేశాభి

మానమనీ, ధర్మ రక్షణ మనే పేర్లు పెట్టి స్వలాభ ప్రేరేపితులై, భాగ్యవంతులు లక్షల కొలది బీద జనులను రణరంగాల్లో బలిదీస్తారు. లోభుని ప్రతినిధులైన, ధర్మ వినాశకులైన భాగ్యవంతుల మీదనే ధర్మ యుద్ధం ప్రకటిస్తాను. రాజులు యుద్ధాలుచేసి దేశాలను నాశం చేస్తే, నేను స్వల్ప సంఖ్యాకులైన భాగ్యవంతులను నాశనం చేస్తాను. వాళ్లు సంఘాలను దోస్తే, నేను కుటుంబాలను దోస్తాను.... రాజు పెద్ద దొంగ. నేను చిన్న దొంగను.''

తక్కెళ్ల జగ్గడు బుర్ర కథల ద్వారా చేసిన ప్రచారంలో ఆదిమ కమ్యూనిజం గురించి, వర్గ సమాజంలోని ప్రజల బాధల గురించీ వర్ణిస్తాడు. ''భాగ్యవంతులకు బీదలెల్లరు బానిసలయినారు'' అని అంటాడు. కూలీలలో ఇలా చైతన్యం రగుల్చుతాడు:

> ''కూలికి విలువ గలదని మీరు గుట్టు తెలుసుకోండి
> కూలికి దగిన విలువ పుచ్చుకొనే కూలికి మురిపొండి
> వీళ్ల కూలికి వొప్ప కొంటిరా నెనెసరు చెరుపుక్రాంద్రు
> పని వారందరు యేకమైతిరా ప్రపంచమే మీది
> ఐక్యమత్యమే అన్ని పనులకు ఆధారము సుండి
> శ్రేణులు గట్టి నమ్మ గట్టితే చెల్లును మీ మాట".

కారల్ మార్క్స్ కమ్యూనిస్టు ప్రణాళికలో వాడిన మాటలనే మరో రూపంలో ''పని వాండ్రందరు యేకమైతిరా ప్రపంచమే మీది'' అని అంటాడు.

వెంకటదాసు పట్టుబడి కోర్టులో ఇచ్చిన వాఙ్మూలంలో కూడ ఇలాంటి భావాలే వ్యక్తంచేశాడు:

''ఇసుక మేట వేసినట్టు ధనం యే కొద్దిమంది దగ్గరనో చేరింది. ఒక చోట పల్లం చేస్తేనే కాని వేఱొక చోట మెట్ట యేర్పడదు. భూమి కుంగి చెరువయితే పక్క కొండ ఒకటి పైకుబుకుతుంది ... ... అశేష జనులూ దరిద్రులై యెవరో కొందరు భాగ్యవంతులయినారు.''

ఇంతే కాదు. ఈ నవలలో ఒకానొక చోట సోవియట్ వ్యవస్థ గురించిన వివరణ వుంది. బెజవాడ వ్యవసాయ కార్మికుల సభలో వెంకటరెడ్డి అధ్యక్షోపన్యాసంలో రష్యాలో జార్ చక్రవర్తుల సామ్రాజ్య అవశేషాల నిర్మూలనకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకొన్నదీ ఇలా వర్ణించాడు:

''పూర్వపు రష్యా చక్రవర్తులు జయించిన పర రాష్ట్రాలకు పంచాయితీ సర్కారు స్వాతంత్ర్య ప్రదానం చేసి మా రాజుల పాపమును క్షమింపుడని కోరుతున్నారు.''

రచయిత తాత్విక దృక్పథం ఏమైనా యీనవల మొట్టమొదటిసారిగా, నిమ్న తరగతుల కష్టాలను కాంక్షలను, ఆశలను, ఆశయాలను, ఆవేశాలను చర్చించింది. అందులో రష్యా విప్లవ ప్రభావంగా ఏర్పడిన అనుభూతి, అనేక ఘట్టాలలో విస్పష్టమౌతూ వచ్చింది. ఈ కారణంగా కూడా ''మాలపల్లి'' తెలుగు సాహిత్యంలో విశిష్టస్థానాన్ని ఆక్రమించింది.

ఆంధ్ర యూనివర్సిటీ వారి బహుమతి నందుకొన్న అడవి బాపిరాజు గారి ''నారాయణరావు'' బోల్షివిజాన్ని గురించి ప్రస్తావించిన నవల.

''నిజమైన ప్రజాస్వామిక ప్రభుత్వం ఏది అంటే బోల్షివిజమనే చెప్పాలి. ఆస్తి అందరికి సమము కావింప బడవలెను. అంటే ఆస్తి అంతయు ప్రభుత్వముది. ప్రజలు తమ తమ విధులు నిర్వర్తించాలి. వారి వారి పనులనుబట్టి జీతము టిక్కెట్ల రూపమున ఇవ్వాలి.''

''ఉత్కృష్ట కార్యాలు చేసే వాళ్లకు ఎక్కువ టిక్కెట్లు ఇస్తారు.''

ఇలాంటి ప్రస్తావన ఈ నవలలో వుంది.

అక్టోబర్ విప్లవం గురించీ బోల్షివిజం గురించీ సమగ్ర అధ్యయనం సాధ్యంకాని ఆ రోజుల్లో రాసిన ఈ నవలలో విప్లవ స్వరూప స్వభావాల సమగ్ర చిత్రణ లేనిమాట నిజమే. అందుచేతనే, ''ప్రపంచం అంతా కలిసి, జనాన్ని బట్టి (సంపద) పంచుకొడం'' లాంటి అభిప్రాయాలు దీనిలో వ్యక్తమయ్యాయి.

ప్రపంచంలోని పెట్టుబడిదారీ వ్యవస్థ గురించి రచయితకు స్పష్టమైన అభిప్రాయమే వుంది.

''అసలు ప్రపంచానికి వచ్చిన చిక్కేమిటో చూడు. కావలసినంత తిండి తయారు అవుతోంది. అంతా పంచితే అందరికీ పూర్తిగా ఆకలి తీరుతుంది. కాని ఎన్ని కోట్ల మంది ప్రజలు మల మల మాడిపోవుట లేదు? ఏమిటి ఆ లోటు? తయారైన పదార్థాలని పంచే మార్గం సరిగా లేదు. ధనిక వర్గం ఆ పని యేనాటికీ చేయలేదు.''

బోల్షివిక్ విప్లవం ఉత్కృష్టమైనదనే భావాన్ని యిలా రచయిత ఒక పాత్ర ద్వారా వెల్లడించారు.

''సుబ్బారాయుడి గారి హృదయమున రషియను బోల్షివిక్కుల రాజ్య తత్వము మెరుపు వలె తోచినది. ప్రపంచమున నెంతకాలము ''ఆస్తులు,'' నా డబ్బు, నా పొలము అని అనుకోగలడు? డబ్బు లేనివాళ్లు, ఆస్తిలేనివాళ్లు, ఎక్కువ మంది ఉన్నారు కాదా? వాళ్లు తలచుకొంటే డబ్బు గల వాళ్లు ఎక్కడ ఉంటారు? .....''

''ఒక్క రష్యాలో తప్ప ఎక్కడైనా సైన్యం, ప్రజలు తిరగబడ్డారా? తక్కిన రాజ్యాలలో రాజుల్ని తీసివేసి నపుడు తిరగబడ్డ వాళ్లు రాజు కింద రాజుని ఆడించే ప్రభువులో, కోటీశ్వరులో కాని సైన్యాలు అనగా తక్కువ జీతం పుచ్చుకొనే వాళ్ళు తిరగబడలేదు...''

''రష్యాలో మరీ విపరీతమైన స్థితి ఉండాలి. లేకపోతే అల్లా ప్రజలు అంటే బీదవాళ్లు తిరగబడి వుండరు. ...'' ఇంకా ''నిజమయిన ప్రజాస్వామిక ప్రభుత్వం ఏది అంటే బోల్షివిజమనే చెప్పాలి'' అంటూ దానిని ''ఉత్కృష్ట రాజ్య పద్ధతి''గా చిత్రించారు.

అక్టోబర్ సోషలిస్టు మహా విప్లవాన్ని అరమరికలు లేకుండా అర్థంచేసుకోడానికి ఆనాడు మేధావులు ప్రయత్నించారనడానికి ఈ రెండు నవలలూ తార్కాణం. వారి ప్రగతిశీల హృదయ వైశాల్యానికీ ఇవి నిదర్శనం.

(మిగతా వచ్చే సంచిలో)

వరుణదేవుని కక్ష

కథానిక

రాధేయ

ప్రకృతి పై పగబట్టిన వరుణ దేవుడు ఎడతెగని వర్షంలో సమస్త లోకాన్ని జలమయం చేస్తున్నాడు. వరదలతో నదులు పరవళ్ళు త్రొక్కుతూ, కోపోద్రేకమున నాలికలు చాస్తున్నాయి నీటి అలలు. ఆ వరదల్లో తల్లులూ, పిల్లలూ చెట్టుకొకరూ పుట్ట కొకరూ అయ్యారు. అక్కడక్కడా శోకంతో నిలిచిపోయాయి పూరెమ్మలు విరబూయకుండా. ఆశాభంగం పొందిన వసంత కన్య శోక దేవతే అయింది. సందడిగా సంచరించే జనులంతా ఈ బీభత్సాన్ని చూడలేక తలుపులు బిడా యించుకొన్నారు.

మిద్దెలు, మేడలున్న వారి కెలాంటి ఆపాయమూ లేదు కానీ, నది గట్టు నున్న పూరిగుడిసె లన్నిటినీ తనలో కలుపుకొంది ఆ అనంత జలప్రవాహం. ఆ రోజు అర్ధరాత్రికి పెరిగిన నీటి మట్టం ఏడ్చేందుకు వీలులేకుండా, ఎదిరిం చేందుకు శక్తిలేకుండా అందరినీ కాజే సింది. వారం రోజుల నుండి ఎడతెగని వర్షం వల్ల పనులు లేక పస్తులున్న పూరిగుడిసెల్లోని పేదలందర్నీ ఒడిలోకి తీసుకుంది. చుట్టూ పరిసరాలు గుర్తు పట్టలేని విధంగా మారిపోయాయి.

ఎవరక్కడ ?

....సమాధానం రాలేదు..

నిన్నే.. పిల్చేది వినపడలేదా — ఈసారి గద్దించాడు వాచ్‌మన్.

నేనే బాబు! వీరయ్యను...

ఇంత రాత్రి వేళ ఆ గట్టున ఏం చేస్తున్నావ్? లే.. లే వెళ్ళిపో.. ఈ రోజు నిన్నటి కంటె ఇంకా ఎక్కువ నీటి మట్టం పెరిగే సూచన వుంది. వెళ్ళిపో వెంటనే ... హెచ్చరించాడు వాచ్ మెన్.

అవతల నుంచి జవాబు రాలేదు..

అరె.. నీక్కాదు చెప్పేది, వెళ్తావా లేవా?

ఎక్కడ కని వెళ్ళను బాబయ్యా...

ఎక్కడైన తల దాచుకో.. ఇక్క డుంటే చాలా ప్రమాదం.. నిన్న రాత్రి నీరు ఎక్కువై ఆ ప్రక్కనున్న గుడి సెలన్నీ కొట్టుకొని పోయాయి! ఎంత మంది పోయారో అంతే తెలియడం లేదు...

ముడతలు పడ్డ వీరయ్య ముఖంతో విరక్తితో గూడిన మందహాసం మెరి సింది ఆ క్షణం. కానీ ఆ చీకటిలో వాచ్‌మన్ గమనించలేకపోయాడు.

ఒక్క రోజు తను లేకపోయే సరికల్లా ఎంత ఘోరం జరిగిపోయింది? పస్తు లున్న భార్యాబిడ్డల్ని చూడలేక పొరు గూరికి పనికి పోయి సంతలో సరుకులు తీసుకొని ఆత్రంగా ఇంటికి తిరిగే చ్చాడు.. వచ్చి చూస్తే..

ఇంకేముంది! మహా ఘోరం జరిగి పోయింది. భార్యాబిడ్డల జాడలేదు.. పూరి పాక ఆమాకి అసలే లేదు..

ఇదంతా తనకేమీ పట్టనట్లు నిండు గర్భిణిలా ఒరుసుకుంటూ ప్రవహి స్తోంది నది..

ఈ దారుణ సంఘటన వీరయ్యను పిచ్చి వాణ్ణి చేసింది. కాళ్ళ క్రింద భూమి పాతాళంలోనికి క్రుంగి పోతున్నట్లనిపించింది. భూకంపం వచ్చి తాను కూడా పోయివుంటే

బాగుండుననిపించింది.. తన వాళ్లంతా వెళ్లి పోయినప్పుడు తను మాత్రం ఒక్కడూ ఈ భూమిపైన ఎవరి కోసం బ్రతకాలి?. .

అనుకున్నదే తడవుగా వడివడిగా అడుగులేస్తూ నడిచాడు నది ఒడ్డుకు. కానీ అంతలో మెదడులో ఓ ఆలోచన తళుక్కున మెరిసింది. తన వారు ప్రాణాలతో ఎక్కడైనా ఒడ్డుకు చేరుకున్నారేమో నన్న సందేహంతో అడుగులు ఆగిపోయినయ్.

తన వాళ్లు బ్రతికి బయట పడితే ముడుపు కట్టుకొని దర్శిస్తామని ఏడు కొండల వానికి మొక్కుకున్నాడు వీరయ్య నిశ్చలమైన మనస్సుతో.

ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు వీరయ్యకు. రెండు రోజుల క్రిందట కాస్త గంజి త్రాగినట్లు కూడా గుర్తు లేదు. ఆకలి ధ్యాసే లేదు.. కన్ను మూస్తే తన వాళ్ల దీనాలాపన, కళ్లు తెరిస్తే ఎడ తెగని వర్షం..

ఎట్లాగో ఆ రోజు తెల్లవారింది కానీ ఆ భయంకర వాతావరణానికి భయపడి సూర్యుడు కూడా రాలేదు.. ఎప్పటిలాగే సన్నగా తుంపరలు పడుతూనే వున్నాయి. ఆవేదనతో ఆత్రంగా మళ్లీ నది ఒడ్డుకు వచ్చాడు వీరయ్య. అటు వైపు సంచరించే జనమైనా తన వారి ఆచూకి ఏమైన విన్నారేమోనని!

ఏరా వీరయ్యా! ఎంత అన్యాయం జరిగి పోయిందీ ? మన వాళ్లంతా గంగమ్మకు బలి అయినారని విని చాలా బాధపడిపోయాను.. అటుగా వెళ్తున్న సరుకుల కొట్టు యజమాని వీరయ్యను చూచి జాలిని నటిస్తూ అన్నాడు..

పోయిన వాళ్లతోటి మనమూ పోతామా ఎంటిరా! ఎందుకు బాధపడి పోతావు? గవర్నమెంటు వరదల పాలైన మీ కుటుంబాలను ఆదుకుంటుందని ఈ రోజు పేపరులో వేశారు.. అని అటుగా వస్తున్న మునసబు.

అంత కంటె వాళ్లు ఇంకేం చేస్తారు.. మా కన్నీళ్లు తుడవటానికి.. అనుకున్నాడు వీరయ్య.

అదేంటిరా, ఈరిగా, ఎక్కడి కెళ్తున్నావు?... వేప పుల్లతో పళ్లు తోముకుంటూ ఎదురొచ్చాడు గంగులు.

ఎవరి మాటలు తను పట్టించుకోలేదు. ఎవరి సానుభూతి కోసం ఎదురు చూడ్డంలేదు.

నేరుగా ఈతగాళ్ల దగ్గరకి పోయాడు.

బాబు! ఈ రోజు మావాళ్ల జాడ ఏమైన తెలిసిందా? చెప్పండి బాబు!

లేదు వీరయ్యా, ఎంత ప్రయత్నించనా మేం వారిని రక్షించలేక పోయాం, ఎక్కడా బయటపడలేదింకా. రేపో.. ఎల్లుండో శవాలైనా తేల వచ్చునేమో.

మరుసటి రోజంతా ఆ ఒడ్డున కూర్చున్నాడు అనంత జలప్రవాహం వైపు ఆశగా చూస్తూ.

రా...ఇంకెందుకు ఆలస్యం? నీవూ మాతో కలిసిపో అంటూ పిలుస్తున్నాయి నీటి కెరటాలు.

రేపు ఒక్క రోజు ఆగు మావాళ్లెక్కడైన తేలుతారేమో.. అంటూ సమాధాన మిచ్చింది వీరయ్య అంతరాత్మ, భగవంతుడు అన్యాయం చెయ్యడన్న ప్రగాఢ విశ్వాసంతో.

ఏరా.. నీక్కాదూ చెప్పేది. .అన్యాయంగా చచ్చిపోతావని చెబుతుంటే లెక్కచేయకుండా కూర్చున్నావే!

ముందు అక్కణ్ణుంచి కదులు, లేక నన్నే రమ్మంటావా ? ఈసారి వాచ్ మన్ గర్జనకు చలించి లేచాడు వీరయ్య.

నా ప్రాణాల మీద నాకే తీపి లేప్పుడు ఈయనగారికేమిటో నా మీద ఇంత దయ. .అనుకుంటూ నడిచాడు.

కూడు లేదు గూడు లేదు మరి ఈ అర్ధరాత్రి ఎక్కడ కని వెళ్లాలి ? ఎవరు చోటిస్తారు. . . ఇదే ఆలోచన తనకు.

ఎయిర్ కూల్డ్ మేడల్లో ఆదమరచి నిదరబోతున్న ధనవంతుల ప్రతీకల్లా వున్నాయి నీడ నివ్వలేని వీధి లైట్లు. చెట్టు క్రిందనైనా తల దాచుకుందా మంటే వర్షానికి తోడుగా నీటితో తడిసి ఆకులు గాలికి మరిన్ని జల్లులను విదిలించేస్తున్నాయి.

తెల్లవారితే మూడవ రోజు

ఎట్లాగో. . గాలైనా. . వానైనా.. భరిస్తాను ఈ రోజు. . రేపటి కైనా ఆచూకీ తెలియక పోతుందా. . అను కుంటూ తడుస్తూ నడుస్తున్నాడు వీరయ్య.

కప్పలు, కీచురాళ్ల అరుపులతో బీభత్సంగా వుంది. సమస్త ప్రకృతి భయంకరమైన ఆ రేయి గడిచిపోయింది.

తెల్లవారింది యథావిధిగా. .

యథాప్రకారం ఈతగాళ్లను కలుసు కున్నాడు.

ఎప్పటిలా అదే ప్రశ్న వేశారతను. అదే జవాబు వారిది.

అక్కడ ఒక్క క్షణం కూడా నిలువ బుద్ధిపుట్ట లేదు.

అదేంటి వీరయ్యా ! ఎందుకలా గట్టు దగ్గరగా పోతున్నావు ? కట్టు తిరిగి పడిపోతావ్ జాగ్రత్త. అక్కడి కెళ్లకు. ఇలా రా. . అంటూ వారు కేకేశారు. కాని వీరయ్య వినలేదు.

వీరయ్యా ! మా మాట విను ! అక్కడ నీళ్లు చాలా లోతుగా ఒరుసుకుంటూ పారుతున్నాయ్ - వద్దు అక్కడ కెళ్లకు. అయినా లెక్క చెయ్యలేదు.

రెప్పపాటులో నీటిలో దబేల్ అన్న శబ్దంతో పాటు వీరయ్య కూడా కలిసి సుళ్లు తిరిగి పోయాడు ఆ ప్రవాహంలో.

ఈ ఘోరం చూస్తున్న ఈతగాళ్లు తమ ప్రాణాలు కూడా లెక్క చెయ్యక నదిలో దూకి వీరయ్యను రక్షించటానికి విశ్వ ప్రయత్నం చేశారు.

కాని అప్పటికే అందరికీ అందనంత దూరంగా వెళ్లి పోయాడు. . వెతికి. . వెతికి. . వేసారి. . చేసేది లేక ఒడ్డుకు చేరుకున్నారు వారు.

కన్నీటికి, కష్టాలకు ఎదురీది తన వారిని విడిచి పెట్టలేక నీటిపాలైన వీరయ్య , కళేబరాల్లాంటి వన్నీ వారం రోజులకల్లా మరో ఒడ్డుకు విసరివేయబడ్డాయి.

కక్ష సాధించు కొన్న వరుణ దేవుడు తన కోపాన్ని ఉపసంహ రించు కున్నాడు అప్పటికి!

బూర్జువా విప్లవం విజయవంతం కావడం శ్రామిక వర్గానికి లాభం. బూర్జువా వర్గ అధికారం, బూర్జువా వర్గంతో పోరాడడానికి ఒక సరికొత్త ఆయుధాన్ని శ్రామిక వర్గం చేతుల్లో వుంచుతుంది. అంతే కాదు. గుర్తింపు కలిగించి దానికో కొత్త హోదా కల్పిస్తుంది.

కారల్ మార్క్స్

విశాఖపట్నం చిత్రాలు

మానేపల్లి సత్యనారాయణ

విశాఖ ఔటర్ హార్బర్

ఒడ్డును సముద్రం ఒలుచుకు తినేసింది తొలుత
సముద్రాన్ని వెంటబెట్టి దూరదూరంగా తరుముతోంది
ఒడ్డు ఈ తరవాత
బీచ్ రోడ్ గొప్పమించి ఈ భోగట్టా అంతా
టౌన్ హాల్ చూస్తూనే వున్నాది
మనుషుడేం సామాన్యుడా మరి ?
గాలినీ గెలుస్తాడు గగనాన్నీ జయిస్తాడు
కావాలంటే కాలాన్నీ గాలంతో కట్టేస్తాడు
అపార పారావారాన్ని - పదపద "అసింటా" వుండమంటున్నాడు
అంతకూ కాదూ కూడదంటే ఔపోశనం పట్టేస్తాడు
చెలరేగుతున్న బంగాళాఖాతాన్ని
బెరుకు బెరుకుగా గవాక్షాల్లోంచి చూస్తూ
సోయగాలు పోయేది చెంగల్రావు పేట
పాపం ఇప్పుడది చెప్పుకోలేని చింతతో
ఊపిరి సలపక లోజ్వరంతో తీసుకుంటున్నాది
తలలు చితికిన సహస్రఫణాల్లా బుసలుకొడుతూ అలలు
ఈ బొమ్మలాట అంతా చూస్తూనే వున్నది డాల్ఫిన్ కొండ
మొనగాళ్లకు మొనగాడిలాగ ఆ పక్కనే యేరాడ కొండ !
ఇది విశాఖపట్నమా మరికోటీ మరికోటీనా
బంగాళాఖాతమా పదపద వెనక్కి పద
కనబడ్డం లేదూ తెనుగు వాళ్ల ఓడరేవు
వినబడ్డం లేదూ స్టీమర్ల వింత వింత
మొండిగా గుట్టపోసిన శిలాశకలాల ఇలా తలంపై
అఖండ గర్వంతో అహంకారంతో ఔరా ! ఔటర్ హార్బర్ !
ఇంట్లో ఈగల మోత జోరుగా వుందా ?
అయితేనేం - ఇంటి పేరు కస్తూరివారే కద
ప్రపంచ నౌకాకేంద్రాల పటంలో వైజాగ్ హార్బర్
మరింత జిగజిగలాడి పోతున్నాది చూడు చూడు
చూస్తున్నావా చూస్తున్నావా ఎంత చైతన్యం ఎంత సంక్షోభం
చూస్తున్నావా ఎంతెంత అలజడి ఎంతెంత సంచలనం
ఉబికి ఉబికి ఉద్రేకంతో ఒగురుస్తోంది ఊర్వీజలం
గరమ్ గరమ్‌గా వీస్తోంది హోరు గాలి జోరుగా
ఇది విశాఖపట్నమా మరికోటీ మరికోటీనా
వి - అంటే విప్లవం ఒక్కటే కాదు వేస్తం
వి - అంటే విశాఖపట్నం కూడానూ

వేసవిలో విశాఖ

విశాఖ సూర్యుడు విస్ఫులింగాలు కక్కుతాడు
బంగాళా ఖాతంలోగాని బడబాగ్ని దాగిందా ?
గంగ ఉడుకుతోంది
గాలి ఉడుకుతోంది
నేల ఉడుకుతోంది
నింగి ఉడుకుతోంది
భుగభుగ కుతకుత
సముద్రంలో దాగిన ఉప్పు
నగరవాసుల స్వేదంలో పేలుతోంది టపటప
విశాఖ సూర్యుడు ఉల్కలే ఉమిస్తాడు

వద్దు వద్దు వద్దు
ఈ ఉడుపులు ధరించడం నావల్ల కాదు
విశాఖపట్నంలో సముద్రంలో దిగినా తాపం తీరదు
బ్రతుకులో బాధ ఉడికి ఉడికి
మరిగి మరిగి సెగలు కక్కుతోంది ఉక్కలా
కటువుగా క్షారంలా
విప్పేస్తున్నాను విప్పేస్తున్నాను ఈ చర్మం
వొళ్లు వొలిచేసుకుంటాను
ఊపిరితిత్తులు ఊడతీసి బీచిలో ఆరేస్తాను

చూడలా చూడెలా కమ్ముకొస్తున్నాయో దట్టంగా పొగలు
ఫ్యాక్టరీ గొట్టాల్లోంచి చూడటు ఆ వేడి ఆవిర్లు
తప్పించుకోలేని మృత్యువులా తమూల వృంతాలు
కనపడని వెసూవియస్‌లు దాక్కున్నాయా
ఈ మట్టిలో గుట్టల్లో కొండల్లో ?
కరుగుతున్న గంధకం ఉందా ఈ గాలిలో ! ?

వేసవిలో విశాఖ మంచులా కనిపించె మంట
చలిజ్వరం – హిమజ్వాల ! !

విశాఖలో మృత్యువు

విశాఖలో మృత్యువు విశ్వరూపం ధరిస్తోంది
అసలే మృత్యువు omnipotent, ! omniscient

ఇన్నాళ్లూ ఆకలి, అగ్ని ప్రమాదాల రూపంలో
యుద్ధం, జరారుజల రూపంలో వచ్చేది మృత్యువు
ఇప్పుడు –
శరవేగంతో మారుతున్న నాగరికతలో

మృత్యువు తన వేషం మనం పోల్చుకోలేకుండా మార్చుకుంటోంది
కక్షల రూపంలో కలహాల రూపంలో
సమ్మెల రూపంలో సుడిగాలి రూపంలో
బస్సుల రూపంలో పోలీసుల తుపాకీల రూపంలో
లారీల రూపంలో రాయల్ ఎన్ఫీల్డ్ల రూపంలో
మాట పట్టింపులా మతద్వేషంలా
కల్తీ సారాలా కమ్మని విషంలా
మృత్యువు తన వేషం మార్చుకుంటోంది
జాగ్రత్త జాగ్రత్త మృత్యువు ప్రచ్ఛన్నంగా విరుచుకుపడుతోంది

ఇల్లు వీడినవాడు ఇల వీడిపోడన్న నమ్మకం లేదు కద !
స్కూలుకు వెళ్లిన పసిపిల్లడు సజావుగా ఇంటికొచ్చిందాకా
ఏ తల్లి గుండెలు తిన్నగా వుంటున్నాయని ?
ఆఫీసుకు వెళ్లినాయన చావుల మదుం
చేరాడంటే ఎలా నమ్మడం ?
సినిమాకి వెళ్లిన సైక్లిస్టును సిటీ బస్సు
మట్టించదని గ్యారంటీ ఏమిటి ?
సముద్రం పైకి వెళ్లిన జాలరిని
సుడిగుండం చుట్టుకోలేదని గ్యారంటీ ఏమిటి ?

ఎవరికీ ఎక్కడా గ్యారంటీ లేదు
బ్రతుక్కి ఈ నగరంలో ష్యూరిటీ లేదు
అసలే మృత్యువు Omnipotent, Omniscient !
ఇప్పుడిక – వినపడని చప్పుడులా
కనపడని కరాళ హస్తంలా మృత్యువు
ఈ మధ్య మరీ బరి తెగించేసింది
నగరం నడి బొడ్డున విలయనాట్యం ప్రారంభించింది.

కలలో విశాఖపట్నం

కలలో నా విశాఖపట్నం కడురమ్యం కమనీయం
కత్తెరచ్చుతీసిన తీగల్లాగ రోడ్లు
తీర్చిదిద్దినట్టు ట్రాఫిక్
అంతా అద్దంలా
అందంగా ఉద్యానంలా
దిద్ది తీర్చిన తైల వర్ణచిత్రంలా

సుశిక్షణగా సిటీ బస్సులు
సుందరంగా స్వీట్ గా సినిమా హాళ్ళు
సౌకర్యంగా బస్ కాంప్లెక్సులు
బిజీగా బ్లిస్ఫుల్ గా బీచ్ రోడ్

హాయిగా హాపిగా హార్బర్
జాగ్రత్తగా జాణల వైట్ హౌస్
కరెక్టుగా నడిచే రైళ్లతో
బహు క్లీన్‌గా కిస్సబుల్‌గా
క్యూలో నిలబడ్డ క్వీన్స్‌లాంటి
ప్లాట్‌ఫారాల్తో వాల్తేరు రైల్వేస్టేషన్ !

అంతా సజావుగా ఆంధ్రా యూనివర్శిటీ
అంతా ఆనందంగా మెంటల్ హాస్పిటల్
అంతా ఆరోగ్యంగా కే. జి. హెచ్
అంతా ఎక్సలెంట్‌గా ఎలిగెంట్‌గా ఎల్లమ్మ తోట
జల్తారు జాబిలిలా జగదంబ
డెలిషస్‌గా డాల్ఫిన్స్ ఇంటర్ కాంటినెంటల్ !!

ప్రజల చిక్కుల్ని వెంటనే విడదీసే మునిసిపాలిటీ!
ప్రజల్ని భక్షించని రక్షకభటులు !
సమస్తం దొరికే సూపర్ బజార్ !!
కలలో విశాఖపట్నం
ఉత్తరాంధ్రానికి గుండె
విశాలాంధ్రానికి విశిష్ట ప్రాణం
తెలుగు ప్రజల కంటి వెలుగు
కళింగాంధ్ర ఖనుల్లోని మాంగనీసు
విశాల విశ్వానికి పంచే జీవదాత
జగతికి జ్ఞాన ధనం పంచే
ఆంధ్ర విశ్వ విద్యాలయపు విజయ ధ్వజం
ఉక్కుకు ఉనికి పలు పరిశ్రమలకు మనికి
ప్రత్యూషానికీ ప్రశాంతికీ మెట్టినిల్లు
పేదవాడే కనపడని Paradise
కష్టజీవుల పాలి కల్పవృక్షం
శ్రామిక జనజీవన బృందావనం

నా విశాఖపట్నం నానాసూన వితాన వీచిక
నా విశాఖపట్నం నరుడు సృష్టించిన నందనవనం
నా విశాఖపట్నం నవనవోన్మేషమైన స్వర్గం
నా విశాఖపట్నం ప్రపంచ మహానగరం.

మెదడు నుంచి వచ్చిన ఆలోచన పదార్థ లక్షణమైన ఆకర్షణకన్న ఏ విధంగా గొప్పది ? మన అహంభావం, ఆత్మాభినందనం తప్ప వేరు కాదు.

ఛార్లెస్ డార్విన్

సాహిత్యం - రచయిత చైతన్యం

శ్రీమతి పి. సంజీవమ్మ

ఆధునిక ప్రపంచ సాహిత్యం సమాజానికి యెంతో చేరువైంది.[1] సామాజిక వాస్తవికతను ప్రతిబింబించేదిగ తయారయింది. వాస్తవికతా వాదం నేటి సాహిత్య ధోరణుల్లో ప్రధానమైంది. సాహిత్యం సాంఘిక ప్రయోజనాత్మకంగా వుండటం అవసరం అన్నది నిర్వివాదాంశమైంది. 'సామాజిక దృక్పథం', 'సామాజిక స్పృహ', 'సామాజిక చైతన్యం' అనే మాటలు నేటి సాహిత్య విమర్శలో యెక్కువగ వినపస్తున్నాయి. సాహిత్య కళా చైతన్యం సామాజిక చైతన్యంలో ఒక అంశమే. ఈ సాహిత్య కళ ఒక శక్తిగా సామాజిక చైతన్యాన్ని జాగృతం చేయటానికి, ప్రగమింప చేయటానికి దోహదం చేయగలదనేది చారిత్రక సత్యం. ఒక వైపు నేటి వ్యాపార సమాజాలు ఈ సాహిత్యాన్నే వ్యాపార సాధనంగ వుపయోగించుతూన్న వైనం కూడ గ్రహించ లేని దేమీ కాదు. అలాంటి సాహిత్యం 'సాహిత్యం' అనే మాటకు అర్థం కాదు.

మరి సాహిత్యకళ సామాజిక చైతన్యానికి దోహదం చేయ గలగటానికి ఆ సాహిత్యం రూపుదిద్దుకోవడంలో వెనుకవున్న రచయిత చైతన్యం పాత్ర యేమిటి, ఆ చైతన్యం యెలా రూపు వహిస్తుంది అన్న విషయం పరిశీలనార్హం. వ్యక్తి చైతన్యం - సామాజిక చైతన్యం పరస్పరం యెలా ప్రభావితం అవుతాయి అనేదీ గమనించాల్సిన విషయం.

సమాజాన్ని గురించిన, జీవితాన్ని గురించిన వ్యక్తియొక్క జ్ఞానం, అవగాహన, అభిప్రాయాలు, ఆలోచనలు స్థూలంగా వ్యక్తికి వున్న సామాజిక చైతన్యం అనవచ్చు. నిశితంగ పరిశీలిస్తే, సమాజ వ్యవస్థలో తన పాత్రను గురించిన చైతన్యం కూడా యిందులో యిమిడి వుంటుంది. వ్యక్తియొక్క యిటువంటి ఆత్మచైతన్యం ఒక గతిశీల సమాజ లక్షణం. వ్యక్తి చైతన్యం సామాజిక చైతన్యానికి తప్పని సరిగ సమ స్థాయిలో వుండవలసిన అవసరం లేదు. వ్యక్తి చైతన్యానికీ సామాజిక చైతన్యానికీ మధ్య ద్వంద్వాత్మక ఐక్యత వుంటుంది. అంటే సామాజిక చైతన్యాన్ని వ్యక్తి చైతన్యం ప్రగమింప చేస్తే, వ్యక్తి చైతన్యాన్ని సామాజిక చైతన్యం రూపొందిస్తుంది, నిశితం చేస్తుంది, వ్యక్తమయేందుకు తోడ్పడుతుంది.

చైతన్యం అంటే — సంకల్పం (CONATION) భావం (AFFECTION) పరిజ్ఞానం (COGNITION) - ఈ మూడింటి యొక్క సమిష్టి అని నిర్వచనం వుంది.[2] దీని వుద్దేశ్యం - చైతన్య పూరిత వ్యక్తికి ఒక ప్రపంచ దృక్పథం

---

1 'Historical materialism' -Kelle & Kovalson

2 'మానవికీ పారిభాషిక్ కోశ్ - దర్శన్ ఖండ్'

(Weltanschanning) వుండాలని. ముఖ్యంగా రచయిత అయిన వ్యక్తికి తనకు అంటూ ఓ ప్రపంచ దృక్పథం సామాన్యంగా వుండి తీరుతుంది. ఆ దృక్పథం - అతని పరిశీలన, అనుభవాలు, అధ్యయనం, ఆలోచన, మనస్తత్వం, తాత్త్వికత . వీటి అన్నింటి మీద ఆధారపడి వుంటుంది. ఆ దృక్పథం శాస్త్రీయమైనది కానక్కరలేదు. అది తప్పుడు అవగాహనతో కూడినది అయినా అయి వుండవచ్చు. జీవిత సత్యాన్ని అతడు గ్రహించిన తీరునుబట్టి ఆ దృక్పథం యేర్పడి వుంటుంది. అది కేవలం బుద్ధిజనితం మాత్రమే కానందున, సంకల్పం, భావం ఆ ప్రపంచ దృక్పథాన్ని సృజనశీలం చేస్తాయి. కళా సర్జనకు మూలం – అటువంటి దృక్పథాన్ని యితరులతో పంచుకుందామనే కళాకారుని తపన కావచ్చు. ఆ దృక్పథం కళాకారుని వ్యక్తిగత చైతన్య జనిత మనేది గమనార్హం. కాని ఉత్తమ సాహిత్యం ఆత్మాభివ్యక్తి మాత్రమే కాదని అంగీకరించినప్పుడు రచయిత యొక్క ఈ దృక్పథం కూడా రచనకు యెంత వరకు దోహదం చేస్తుందనేది ప్రశ్న. లుకాచ్ చెప్పినట్లు – గొప్ప రచనకు రచయిత ప్రపంచ దృక్పథం గీటు రాయి కాదు. ఆ దృక్పథం పట్ల అతడు యెంత వరకు నిర్మముడై దాన్ని అధిగమించినాడు అనేది గీటురాయి. కవితలో కంటె కథా సాహితిలో యిందుకు అవకాశం వుంది. కవితలో ఆత్మాభివ్యక్తి యెక్కువ చోటు చేసుకో గలదు.

సమాజ శాస్త్ర దృష్టితో రచయిత యొక్క సామాజిక చైతన్యాన్ని విశ్లేషిస్తే ముఖ్యంగా యీ అంశాలు కనిపిస్తాయి — పరిజ్ఞానం, సామాజిక సంబంధాల స్వరూపం, సౌందర్య శాస్త్ర సంబంధాలు.

రచయిత యొక్క పరిజ్ఞానంలో – సామాజిక జ్ఞానం, సామాజిక అవగాహన యిమిడి వుంటాయి. జ్ఞానం అనేది అధ్యయనం వల్ల, పరిశీలన వల్ల కలుగుతుంది. అవగాహన అనేది ప్రతిభవల్ల, అనుభవం వల్ల, ప్రజలతో సంబంధం వల్ల కలుగుతుంది. ఈ సామాజిక పరిజ్ఞానంవల్ల, రచయితకు ఒక సామాజిక దృక్పథం యేర్పడుతుంది. ఈ దృక్పథం రచయితలకు మరల సామాజిక పరిస్థితులను అవగాహన చేసుకునేందుకు యెక్కువ ఉపకరిస్తుంది. ఇటువంటి అవగాహన – సమాజ వాస్తవికతను గురించి యాంత్రికమైన అంచనాతో కూడింది కాదు (సమాజ శాస్త్రం చేసే పని కాదు); సమాజ వాస్తవికతకు స్పందిస్తూ (ఈ స్పందన సంవేదనాత్మకం కావచ్చు, లేక సంజ్ఞానాత్మకం (cognitive) కావచ్చు), ఆ వాస్తవికతను విశ్లేషించి చూచే సమగ్ర చైతన్యంతో కూడినట్టిది. ముఖ్యంగా సమాజపు స్థూల నిర్మాణాన్ని (macro structure) అర్థం చేసుకొనేందుకు ఈ పరిజ్ఞానం అవసరం. సమాజాన్ని గురించిన రచయిత యొక్క ఈ పరిజ్ఞానం, రచనలో వాస్తవికతా చిత్రణ ద్వారా వ్యక్త మవుతుంది. ఇతర సామాజిక సంబంధాలను అర్థం చేసుకోవడానికి రచయిత యొక్క స్వంత సామాజిక సంబంధాలు, అనుభవాలు తోడ్పడతాయి. ఇక సౌందర్య శాస్త్ర సంబంధాలు, రచయిత యొక్క దృష్టిని నిశితం చేస్తాయి అనటంలో సందేహం లేదు.

రచయిత యొక్క సామాజిక చైతన్యంలో అతని ప్రపంచ దృక్పథంతో పాటు చెప్పుకోతగ్గ పాత్ర వహించేది, భావజాలం (Ideology). రాజకీయాలు, తత్త్వశాస్త్రం, నైతిక విలువలు, సామాజిక సంబంధాలు, సౌందర్య దృష్టి మొదలైనవాటిని గురించిన పరస్పర విరుద్ధం కానట్టి, సమన్వయీకరించబడినట్టి సచేతన కృషిద్వారా యేర్పరచు కొన్నట్టి భావాల, అభిప్రాయాల, ప్రతి పాదనల సమాహారం భావజాలం[3]. వర్గ సమాజంలో భావజాలం వికృతమై (distorted) కూడ వుంటుంది. రచయిత తన రచనలో ఈ వికృత భావజాలానికి ప్రాతినిధ్యమిస్తున్నాడా, లేక సరియైన భావజాలానికా అనేది పరిశీలించ వలసిన విషయం. రచయిత యే భావజాలం వైపు మొగ్గు చూపుతున్నాడన్నదాన్నిబట్టి, రచన నిబద్ధత ఆధారపడి వుంటుంది.

రచనలో రచయిత యొక్క దృక్పథం, భావజాలం మాత్రమే కాక, సమాజ మనస్తత్వాన్ని కూడ చూడగలము. సమాజ మనస్తత్వం సాధారణ చైతన్యానికి సంబంధించినది. జన సమూహాలను చిత్రిస్తున్నపుడు, సమాజ మనస్తత్వాన్ని కూడా రచయిత గమనం లోనికి తీసుకుంటాడు. ముఖ్యంగా ఉద్యమాల చిత్రణలో సమాజ మనస్తత్వాన్ని చిత్రించే ప్రయత్నం నవలాకారులు చేసినారు.

వ్యక్తి చైతన్యాన్ని రచయిత చైతన్యాన్ని ప్రభావితం చేయగలవి, వారివారి వర్గ చైతన్యాలు. కాబట్టి సాధారణంగా సమాజంలో యే వర్గానికి చెందిన వ్యక్తికి ఆ వర్గపు ఆలోచనలు వుంటాయనటం నిజమయినా, మినహాయింపు లుంటాయి; ముఖ్యంగా మధ్యతరగతి మేధావుల్లో, అమానుషమైన పెట్టుబడిదారీ వ్యవస్థలో డబ్బుతో ప్రతి విలువ ముడిపడి వున్న నికృష్టమైన స్థితిలో, మేధావులు తమ సామాజిక చైతన్యాన్ని పెంచుకొనక తప్పని పరిస్థితులు యేర్పడ్డాయి. నేటి భారతీయ పరిస్థితుల్లో చాలా విషయాల్ని గూర్చి మేధావి అవగాహనలు వేరుగ వుంటున్నాయి. ఎన్నో దొంతరలు కలిగిన సమాజం (multi strata society) కావటం మూలాన, అవగాహన అన్ని సందర్భాల్లో, అన్ని విషయాల్లో సరిగా లేకపోవటం జరుగుతూంది. ఈ పరిస్థితిలో మేధావి - రచయిత అయిన వాని అవగాహన మరింత నిశితము, గంభీరము కావలసిన అవసరం వుంది. సమాజ జీవితం లోనికి చొచ్చుకుపోవడం, సమాజ స్వరూపాన్ని గూర్చిన చారిత్రిక శాస్త్రీయ దృక్పథం కలిగి వుండటం – ఆ అవగాహనకు అవసరం. వ్యక్తిగతమైన వూహకు ప్రాధాన్యం యిచ్చి చేసుకొనే అవగాహన ఆత్మాశ్రయమై వుంటుంది.

రచనలో కళాత్మక అంశానికే ప్రాముఖ్యం యిచ్చే రచయితలు, విమర్శకులు రచయితకు సామాజిక చైతన్యంతో అవసరం యేమిటని అడగవచ్చు. అంటే సమాజంతో అవసరం లేదనటమే. ఇది ఒక విధమైన నెగటివ్ అవగాహన. సమాజ ఆరోగ్యానికి అంత మంచిది కూడ కాదు. ప్రస్తుత దశలో

---

3 'వీచిక' – సామాజిక చైతన్యం – వై. విజయకుమార్. ఆగష్టు సంచిక 1977.

ప్రగతి శీలియైన రచయితకు, స్పందనతో కూడిన సమగ్రమైన సామాజిక అవగాహన చాలా అవసరం. రచనలో రచయిత యొక్క మానసిక పరిణతి, ప్రతిభా సామర్థ్యాలు, అతని ప్రపంచ దృక్పథం ప్రతిఫలిస్తాయి. ఇవన్నీ అతనికి సమాజంతో వుండే సంబంధాల నుండే సంక్రమించినవి అనేది స్పష్టం. కాబట్టి రచయితకున్న ఈ సామాజిక చైతన్యం, అతని రచనలు సాంఘిక ప్రయోజనాత్మకంగా వుండటానికి దోహదం చేస్తుంది.

అయితే రచయిత తన రచనల వల్ల పాఠకుని చైతన్యాన్ని ప్రభావితం చేయాలన్నా, గాఢం చేయాలన్నా అతనికి వున్న అచైతన్యం మాత్రమే చాలదు. రచనలో తన చైతన్యాన్ని యెలా అభివ్యక్తం చేశాడనేదీ ముఖ్యం. అంటే రచనా సంవిధానం – శిల్పసౌందర్యం కూడ చాల ముఖ్యాంశమని అర్థం. పాఠకుని చైతన్యాన్ని మొట్టమొదట సూటిగా తాకేది రచనలోని ఈ కళాత్మక అంశమే. కాబట్టి, రచయిత ఈ అంశం పట్ల శ్రద్ధవహించాలనేది వేరుగ చెప్పనక్కరలేదు.

పరాజిత!

పులిచేరి రామమోహనరావు

క్రట్నాల మార్కెట్టులో
వరుణ్ణి కొనుక్కోలేక
ఎన్నాళ్లయినా పెళ్లికాక
మరి గత్యంతరం లేక

కుందనపు బొమ్మలాంటి
అందమైన ఆడపిల్ల
ఉద్యోగం చేస్తున్నది

ఆడతనపు టాకర్షణ
ఎరగా వేసి
బేరగాళ్లను
ఆకర్షించేందుకు
ఆర్థిక దోపిడికి
ఆలవాలమైన వ్యవస్థ
నిర్దేశించిన
కాల్ గర్ల్, సేల్స్ గర్ల్
లాంటి పదవులలో
చాలీ చాలని జీతంతో

పునీత భారతదేశంలో
ఆడపిల్ల
ఉద్యోగం చేస్తున్నది;

తల్లికి తండ్రికి
తదనంతరము
అన్నలకు, వదినలకు
వారి సంతతికి
సంపాదన యంత్రమై
ఉషస్సు నెరుగని
ఉదయంలా
గ్రహణం పట్టిన నాటి
పగలులా
ముసురు పట్టిన నాటి
సంధ్యలా
ఆడపిల్ల ఉద్యోగం
చేస్తున్నది

కట్నాలు గుమ్మరించలేక
కన్నెచెర విడిపించుకో
లేక
మరి గత్యంతరం లేక
ఆడపిల్ల నేడు చేస్తున్న
కొన్ని ఉద్యోగాలు
మన ప్రగతికి
నిదర్శనాలా?
కావు, సాంఘిక నీతిలోని
అధోగతిని చాటుతున్న
ప్రత్యక్ష నిదర్శనాలు

నాటి బాల వితంతువుకు
పెళ్ళికాని నేటి కన్నెపిల్లకు
జరుగుతున్న అన్యాయం
ఒకటే

నాడామె చాకిరి మాత్రం
మేసిన బంధువర్గం
నేడామె చాకిరినీ
సంపాదననూ
కలగలిపి మృష్టాన్న
భోజనం చేస్తున్నది.

'సంసార వృక్షం'
కథావస్తు పరిశీలన

వల్లంపాటి వెంకట సుబ్బయ్య

శ్రీ సుదర్శనం కథకుడు, నవలాకారుడు, విమర్శకుడు, కవి. స్థూలంగా చెప్పాలంటే శ్రీ సుదర్శనం బూర్జువా, విమర్శకుడు, ధ్యానకవి, అస్తిత్వ – అద్వైత వాద నవలా రచయిత. పైన పేర్కొన్న ఈ నాలుగు భావ ధారలకూ మూలం ఒకటే అవునా కాదా అన్నది పరిశీలించ తగ్గ విషయం.

'సంసార వృక్షం శ్రీ సుదర్శనం నాల్గవ నవల. మొదటి నవల 'అను బంధాలు' కథా ప్రధానంగా నడిచింది. 'మళ్ళీవసంతం' లో అస్తిత్వవాద భావధార ప్రధానం. 'అసుర సంధ్య' లో భగవద్గీత ప్రభావము, అద్వైత వేదాంతం వైపు మొగ్గు స్పష్టంగా కనిపిస్తాయి. 'సంసార వృక్షం' రచయితను ప్రభావితుణ్ణి చేసిన వివిధ బౌద్ధిక, తాత్త్విక వాదాలకు ప్రతిరూపం ముఖపత్రం మీద ఉన్న "గజం మిథ్య – పలాయనం మిథ్య" అన్నవాక్యమూ, చివరి అట్టమీద ముద్రించిన ఒకవ్యక్తి జీవితం అతని వయస్సు యొక్క ప్రతి బింబమే –" అన్న అభిప్రాయమూ ఈ నవలను అర్థం చేసుకొనటానికి ఉద్దేశించిన సూచనలుగా నేను భావిస్తు న్నాను. అంత మాత్రమే కాకుండ "హేతువాదంలో పూర్వ సంస్కారాలు ఛేదించి సమదర్శిత్వం అలవర్చుకోవడానికి ఒక మేధోపజీవి చేసిన సాధనను ఈ నవల చిత్రిస్తున్నదని, ఆధునిక భావాలకు, మన సంస్కృతిలోని మూలతత్త్వా నికి ఈ నవల వంతెన నిర్మించ పూనిందని" చివరి అట్ట మీద వున్న ప్రకటన తెలియజేస్తుంది. వీటిని నవల ఉద్దేశాన్ని తెలియజేసే వాక్యాలుగా, ఒక రకంగా, 'క్లైయిమ్స్' గా భావిస్తున్నాను. వీటి నన్నింటినీ పరిశీలించడమే యీ వ్యాసం యొక్క ప్రధానోద్దేశం.

ఈ నవలలోని కథా వస్తువును అర్థం చేసుకోవడానికి కీలకమైన పాత్రలు రెండు– వీరభద్రరావు అనే డాక్టరు, కథకుడు. వీరభద్రరావు హింసావాది. అతనికి హింసలో– యితరులను హింసించటంలో– ఎంతో ఆనందం వుంది. అవ కాశం వచ్చినప్పుడల్లా తన హింసా ప్రవృత్తిని చూపిస్తూవుంటాడు. కొంత కాలం నక్సలైటు. తరువాత 'జీవితానుభవంకోసం' బయటికి వచ్చేశాడు. ఇతడు నూటికి నూరు పాళ్ళు భౌతికవాది నని భావిస్తాడు. డాక్టరుకు ప్రతిద్వంద్విలాంటి పాత్ర యీ కథను చెప్పే కథకుడిది. 38 సంవత్సరాల వయస్సులో వున్న, పిల్లలు లేని వివాహితుడు. వృత్తిచేత లాయరు. ప్రవృత్తి చేత అద్వైత వేదాంతి. సంసారవృక్షాన్ని అసంగత్వంతో ఛేదించి విముక్తి పొందాలని వాంఛిస్తాడు

(పుట 31). పెళ్ళయిన తర్వాత కూడ హేమసుందరి అన్న యువతితో రొమాంటిక్ వ్యామోహంలో పడి, కొంతకాలం తర్వాత అది గార్హస్థ్య ధర్మానికి విరుద్ధమని తెలుసుకొని ''ధర్మబద్ధుడై'' నిర్లిప్తతను వహిస్తాడు. ప్రధానంగా యీ రెండు పాత్రల మధ్య సంఘర్షణే నవల యితివృత్తం. శ్రీ సుదర్శనం యీ సంఘర్షణకు ఒక సాంకేతికార్థం యివ్వటానికి కూడ ప్రయత్నించారు. నవల చివర కథకుడు వీరభద్రరావు ఒక ప్రత్యేక వ్యక్తి కాదని, బహుశ తన వ్యక్తిత్వంలోని ఒక పార మాత్రమేనని భావిస్తారు. ఈ ప్రయత్నం యొక్క ఉద్దేశమేమిటో తరువాత పరిశీలిద్దాము.

నవల అచ్చమైన ఆధునిక సాహిత్య ప్రక్రియ. ఆధునిక జీవిత చిత్రణకు, ఆధునిక భావాల వ్యాప్తికీ ప్రపంచంలోని ప్రసిద్ధ నవలాకారు లంతా నవలను వుపయోగిస్తున్నారు. సమకాలిక సామాజిక జీవితాన్ని పూర్తిగా తిరస్కరించినప్పుడు నవల ఒక సాహిత్య ప్రక్రియగా నశించిపోవచ్చు నవల ప్రాదుర్భావాన్ని, పరిణామాన్ని పరిశీలించితే ఈ విషయం సుస్పష్టమౌతుంది. అనగా దైవభక్తి, రాజభక్తి లాంటి మధ్యయుగాల 'సెంటిమెంటు', ఆత్మాన్వేషణ, అద్వైత సాధనలాంటి సంపూర్ణ వ్యక్తిగత భావాలు నవలా ప్రక్రియకు అంతగా సరిపడని కథా వస్తువులు. అలా కాక సమాజాన్ని పూర్తిగా తిరస్కరించి నప్పుడు 'సంసార వృక్షం' లాంటి నవల వుద్భవిస్తుంది. ఈ నవలలో సమాజం, ఆధునిక భావాల చిత్రణ లేవు. అవి వున్నాయన్న భ్రాంతి మాత్రమే వున్నది. అందుకు కారణం డాక్టరు వీరభద్ర రావు పాత్ర. నిజానికి వీరభద్రరావు ఆధునిక సామాజిక భావాల పట్ల శ్రీ సుదర్శనం కున్న అసహ్యతకు, సహిష్ణుతను ప్రదర్శించును కోవటానికి చిత్రించ బడిన వికృత రూపం మాత్రమే. [అందుచేతనే వీరభద్రరావు పాత్ర అంత అసంతృప్తికరంగా తయారైంది.] ఆధునిక చేతన కరువైన యీ నవల నిండా బాబాలు, 'అనిర్వచనీయమైన అద్వైతానుభూతులు', 'నిర్లిప్తతలు' ప్రత్యక్ష మయ్యాయి. అందుచేత 'సంసార వృక్షం' ఆధునిక నవల కాక 'వచన పురాణం' మైపోయింది. నవలా ప్రక్రియను దిగుమతి చేసుకొన్న మనం అందుకు కావలసిన ఆధునిక చేతనను అవగాహన చేసుకోలేక పోయామని ''సంసార వృక్షం'' మరొక్కసారి నిరూపిస్తుంది.

'సంసార వృక్షం' సాంఘిక నవల కాక పోవటానికి మరొక్క కారణం- అస్తవ్యస్తమైన అస్తిత్వ వాదాన్ని శ్రీ సుదర్శనం మరింత అస్తవ్యస్తం చేయటం; దానితో శంకరా ద్వైతానికి పెళ్ళి చేయాలని ప్రయత్నించటం. అస్తిత్వవాదంలో ఆస్తిక, నాస్తిక ధోరణులు రెండూ ఉన్నాయి. మొదటి దానికి కిర్క్‌గార్డు, రెండవ దాని జీన్ పాల్ సార్త్ర్ మూల స్తంభాలుగా పరిగణించబడుతున్నారు. కిర్క్‌గార్డ్ అస్తిత్వ వాదాన్ని క్రైస్తవ వేదాంతంతోను, సార్త్ర్ మార్క్సిజంతోను ముడి పెట్టడానికి ప్రయత్నించి విఫలులయ్యారు. హెగెల్ మానవుని అంతర్, బహిర్ జీవితాలు రెండూ ఒక గతితార్కిక సంబంధాన్ని కలిగి వుంటాయని సూత్రీకరించాడు. ఈ సూత్రాన్ని కిర్క్‌గార్డ్ వ్యతిరేకించాడు. కిర్క్‌గార్డ్ అభిప్రాయం ప్రకారం మానవుని వ్యక్తిగత జీవితం దుర్భేధ్య మయినది, యితరు

లకు అర్థం కానిది. ఈ సిద్ధాంతం మానవునికి, సమాజానికి వున్న సంబంధాలను తిరస్కరిస్తుంది. ఇది అస్తిత్వ వాదానికి ప్రాతిపదిక.

స్థూలంగా, అస్తిత్వవాదం అసాంఘిక వ్యక్తిప్రధాన ధోరణి, ఎట్టి నియమాలూ, నిబంధనలూ లేకుండా వ్యక్తి తన స్వేచ్ఛకోసం ప్రయత్నించాలని చెప్పటమే అందులోని ప్రధాన భావం. మిగిలిన వన్నీ (జ్ఞాత, జ్ఞేయం సిద్ధాంతం మొదలైనవి) దానికి తొడిగిన ఆడంబరపు దుస్తులు మాత్రమే. భౌతిక ప్రపంచమూ, మానవ జీవితమూ కొన్ని ప్రాథమిక నియమాలకు కట్టుబడి వున్నవనే విషయాన్ని సంపూర్ణంగా నిరాకరించే "పాజిటివిస్టు" ధోరణులలో అస్తిత్వవాదం కూడా ఒకటి. ఒక్కమాటలో చెప్పాలంటే అస్తిత్వ వాదం వ్యక్తి ప్రధాన అరాచక వాదం.

శ్రీ సుదర్శనం ఆస్తిక అస్తిత్వవాదిగా కనిపిస్తారు. 'సంసార వృక్షం' లో దాన్ని శంకరాద్వైతంతో ముడిపెట్టాలనే ప్రయత్నం చేశారు. అట్టమీద ముద్రించిన 'గజం మిథ్య పలాయనం మిథ్య' అన్న వాక్యం యీ విషయాన్ని స్పష్టం చేస్తుంది. శంకరాద్వైతం కూడ ఆత్మాశ్రయ భావ వాదమే కాబట్టి, దీనికీ అస్తిత్వ వాదానికి లంకె కుదురుతుందన్న భ్రమలో పడ్డారు శ్రీ సుదర్శనం. బాహ్య ప్రపంచాన్ని [వ్యావహారిక సత్యంగా శంకరుడు అంగీకరించటానికి కారణం బౌద్ధాన్ని దెబ్బతీయాలన్న కోరిక మాత్రమే] 'మిథ్య' గా తిరస్కరించే అద్వైతానికి, తిరస్కరించని అస్తిత్వ వాదానికి లంకె కుదరదని నా భావన. అసలు యిలా లంకె కుదిరించాలన్నది, యీలోగా భారతీయ మేధావులలో దిన, దిన ప్రవర్ధమానమౌతున్న చాపల్యం. ఈ రెండు వాదాలకూ లంకె కుదరక పోవటంతో 'సంసారవృక్షం' తాత్త్వికంగా అతుకుల బొంతగా తయారైంది. వీటి ఫలితంగా "ఒక వ్యక్తి జీవితం అతని మనస్సు యొక్క ప్రతిబింబమే" — అనే తప్పుడు నిర్ణయానికి శ్రీ సుదర్శనం వచ్చారు. ఆర్థిక యిబ్బందులు, పిల్లల బాదరబందీ లేని 'సంసార వృక్షం' కథానాయకుడి విషయంలో కూడ యిది సత్యం కాలేదని నవలే నిరూపిస్తుంది. మానవ జీవితం — ముఖ్యంగా మన దేశంలో — వివిధ సాంఘిక, ఆర్థిక కారణాల మీద ఆధారపడివుంది. ఈ సామాజిక శక్తుల్ని (social forces శ్రీ సుదర్శనం గుర్తించలేక పోవటానికి ఆధునిక సామాజిక భావాలపట్ల వారికున్న నిరాదరణ, సమాజాన్ని తిరస్కరించే అస్తిత్వవాద ప్రియత్వమూ ముఖ్య కారణాలు.

తాత్త్వికంగా 'సంసార వృక్షం' లో వున్న అస్తవ్యస్త దృష్టి ప్రభావం కథ, పాత్ర చిత్రణల మీద కూడా పడక తప్పలేదు. కథకుడు [ఈ కథ ఉత్తమ పురుషలో చెప్పబడింది] కేవలం పడక కుర్చీ వేదాంతిగా మాత్రమే కనిపిస్తాడు. ఇతర సమస్యలు లేకపోవటంవల్ల వేదాంతాన్ని ఒక వ్యాపకంగా పెట్టుకున్నాడులా వుంది. అతనిలో నిజమైన 'ఆర్తి' కనిపించదు. అతడు నల్ల చెరువు స్వామి వద్దకు వెళ్ళటం కూడా అనుకోకుండా మాత్రమే జరుగుతుంది. కథకుడు 'అద్వైత స్థితిని తాను ఎప్పటికైనా పొందగలుగుతానా?' అని ప్రశ్నించి నప్పుడు స్వామీజీ తదేకంగా కథకుడి వైపు చూస్తాడు. ఆ చూపుతో చూపు కలిపిన కథకుడి హృద

యంలో ఏదో ఆనందతరంగం వువ్వెత్తుగా లేస్తుంది. స్వామీజీ తన ప్రశ్నకు జవాబు చెప్పకుండా చెప్పారని భావిస్తాడు. దాన్నిగురించి ఆలోచించి, అద్వైత స్థితి మనస్సుకు ఆవలే వుంటుందన్న నిర్ణయానికి వస్తాడు.

మరికొంత కాలానికి డాక్టరుతో మాట్లాడుతున్న సందర్భంలో పిల్లలు లేక పోవటం ప్రసక్తి వస్తుంది. డాక్టరు కథకుడి వీర్యాన్ని పరీక్షచేసి అందులో జీవమూ, చైతన్యమూ లేవని చెబుతాడు. సంసారవృక్షాన్ని అసంగత్వంతో ఛేదించి అద్వైతానుభూతిని పొందాలని ప్రయత్నిస్తున్న కథకుడు యీ వార్త విని పెద్దగా తల్లడిల్లిపోడు. సంతాన ప్రాప్తి లేకపోవటం వల్ల, యిక తన దాంపత్య జీవితంలో ప్రేమానుభూతి — దాని అభివ్యక్తికి సాధనమైన "సెక్స్" మాత్రమే పరమార్థాలన్న నిర్ణయానికి వస్తాడు. కానీ యీ రహస్యాన్ని తనలోనే దాచుకొని ఆత్మవంచన చేసి కోవటం యిష్టంలేక, తన భార్య సావిత్రితో చెప్పాలని భావిస్తాడు. కొన్ని కుటుంబ కారణాల వల్ల చెప్పటం కుదరదు. కొంత కాలం తరువాత సావిత్రి గర్భవతి అన్న విషయం తెలుస్తుంది. తమ కుటుంబానికి డాక్టరుకు ఏర్పడ్డ సాన్నిహిత్యాన్ని అపార్థం చేసుకొని - అందుకు కారణం డాక్టరై వుండవచ్చని భావిస్తాడు. ఇంతకాలమూ చేసిన అద్వైత సాధన అక్కరకు రాకపోగా, కావలసినంత డబ్బు, చెక్కు పుస్తకమూ తీసుకొని పూనా దగ్గరలో వున్న గురూజీ ఆశ్రమానికి పారిపోతాడు. బంధాలు తెంచుకొమ్మని చెప్పటం గురూజీ ముఖ్య బోధన. గురూజీ ఆశ్రమంలో ఆడా మగా నగ్నంగా తిరగటం, ముసలీ ముతకా డాన్సు చేయటం వేదాంత చర్చల సరసన జరిగే కార్యక్రమాలు. ఆశ్రమంలో పరిచయమైన "అలెన్" అన్న పాశ్చాత్య యువకుడు, కథకుడి లోని నిర్వేదాన్ని పోగొట్టటం కోసం 'నిన్ను విముక్తుణ్ణి చేస్తాను' అని మీద పడతాడు. హోమోసెక్షువల్ కాని కథకుడు అసహ్యించు కొంటాడు. కానీ అలా అసహ్యించుకోవటానికి వీలులేదని, అలెన్ అన్న దాంట్లో సత్యం లేకపో లేదని గురూజీ సమర్థిస్తాడు. అమృత అన్న యువతితో కూడ కథకుడికి పరిచయం కలుగుతుంది. ఆవిడ భర్తను వదిలేసి, కొడుకుతో బాటు ఆశ్రమాన్ని చేరుకుంది. ఆశ్రమానికి వచ్చాక తృప్తిగా, స్వేచ్ఛగా సెక్సు అనుభవించి, అందులో ఆకర్షణ, వ్యామోహము పోగొట్టుకొని నిర్లిప్తురాలైంది. ఆవిడ కథకుడితో 'మీరు సెక్స్‌లేక వాడిపోతున్నారు. మీ నిర్వేదం, స్తబ్ధత పోవాలంటే మీకు సెక్స్ అవసరం' అని వడ్డించటానికి సిద్ధమౌతుంది. సహజ ప్రవృత్తిలో జీవించటమే నిజమైన జీవితమని, యిది జంతువులకు తెలిసినంత బాగా మానవులకు తెలియదని కూడా చెబుతుంది. ఇది కథకుడికి అంతగా నచ్చదు. మరి కొన్నాళ్ళకు అమృత అకస్మాత్తుగా చచ్చిపోతుంది. ఆమె కొడుకును బలవంతంగా తండ్రి తీసుకు వెళ్ళిపోతాడు. వీటికి కార్యకారణ సంబంధం కనిపించని కథకుడు తానొక అయోమయ లోకంలో [అస్తిత్వవాద పరిభాషలో అబ్సర్డ్ వరల్డ్] వున్నానని నిర్ణయించుకొని గురూజీ ఆశ్రమం వదలి అమియ బాబాను చేరు కొంటాడు.

అమియ బాబాకు ఆశ్రమమూ, అట్టహాసమూ వున్నట్టు లేదు. ఎంతో కాలంగా ''తపించి'' పోతున్న కథకుడికి అద్వైతానుభూతిని ప్రసాదిస్తాడు అమియ బాబా. కథకుణ్ణి దగ్గరకు పిలిచి చొక్కా గుండీలు తియ్యమంటాడు. చేత్తో హృదయ స్థానాన్ని స్పృశిస్తాడు. కథకుడి వళ్ళు జలదరించి, వెన్నెముకలో విద్యుత్ ప్రవాహం జరిగినట్లు అనిపిస్తుంది. ఈ గాఢమైన అనుభూతిని గురించి కథకుడు తర్కించబోతే బాబా వారించి, తర్కంవల్ల ప్రయోజనము లేదని, తాను ప్రసాదించిన మంత్రాన్ని జపించమని చెబుతాడు. మేధాపరమైన జ్ఞానానికి బదులు హృదయపరమైన భక్తికి,సమర్పణకు అమియ బాబా ప్రాముఖ్యత నిస్తారని కథకుడు తెలుసు కుంటాడు... కొంత కాలం జపం చేసిన తరువాత కథకుడికి ధ్యానంలో కాంతి వలయం.... కాంతి మండలం.... తాదాత్మ్యం .... శాంతీ అనుభూతమౌతాయి.

ఒక రోజు రాత్రి కథకుడికి సావిత్రి పాపాయి [''పైగా ఆడ శిశువు కాదు, మగ శిశువు'' పుట 43] నిప్రసవించినట్లు కల వస్తుంది. బాబా కూడా యింటికి వెళ్ళమని కథకుడికి సలహా చెబుతాడు. కథకుడు వెళ్ళటానికి నిశ్చయించుకొని వెళ్ళేముందు తన వీర్యాన్ని మరొక్కసారి పరీక్ష చేయించు కుంటాడు. అందులో బీజ కణాలు సజీవంగా వున్నట్టు తేలుతుంది. భగవంతుడి లీల అంటే యిదే కాబోలునని నిశ్చయించుకొని, గజం మిథ్య పలాయనం మిథ్య అన్నట్టు అంతా తేలిపోగా యిల్లు చేరుకుంటాడు కథకుడు. సావిత్రి సంతోషిస్తుంది.

స్థూలంగా 'సంసార వృక్షం' 'కథ' యిది. కథకుడు అద్వైత సాధన కోసం చెసే ప్రయత్నం 'కథా వస్తువు'. అద్వైత స్థితి అంటే ఏమిటి? కథకుడు దాన్ని పొందగలిగాడా ? ఏలా పొందగలిగాడు ? లేదా ఎలా విఫలమైనాడు? ఇవన్నవి కథా వస్తువుకు సంబంధించిన ముఖ్యమైన ప్రశ్నలు.

శ్రీ సుదర్శనం 'అద్వైతం' అన్న మాటను చాలా చోట్ల సందిగ్ధంగా వాడారు. కొన్ని చోట్ల అస్తిత్వ వాద పరంగా (అనగా పదార్థము, దానికి చెందిన చైతన్యమూ అవిభాజ్యము అనే అర్థంలో), మరికొన్ని చోట్ల శంకరాద్వైత పరంగా వాడారు. ఈ సందిగ్ధత పాఠకుణ్ణి చాలా తికమక పెడుతుంది. శ్రీ సుదర్శనం అద్వైతస్థితికి నిర్లిప్తతను ప్రధాన సాధనంగా భావించారు. కాని ఈనాటి సమాజంలో నిర్లిప్తత సాధ్యమా అన్నది ప్రధానమైన ప్రశ్న. భార్య, పిల్లలు, ఆస్తిపాస్తులు, ఉద్యోగము, తాను జీవిస్తున్న సమాజము – వీటినన్నింటి నుండి పుత్పన్న మయ్యే సమస్యలను తిరస్కరించి, నిర్లిప్తతను సాధించాలని భావించటం ఆత్మవంచన, సాధించాననిచెప్పటం పరవంచన. అలాంటి నిర్లిప్తత సామాజిక జీవి అయిన మానవునికి అసాధ్యం. సమాజాన్ని సంపూర్ణంగా తిరస్కరించిన (అంటే మానవుణి ఒక ద్వీపంగా భావించే స్వాములకు, గురూజీలకు, దాదాజీలకు) సాధ్యం కావచ్చు నేమో! దానికి తోడు ''నిర్లిప్తత భగవద్గీతలో చెప్పబడింది. ఈ దేశ సంప్రదాయంలో జీర్ణించింది'' (14 వ పేజి) అని భావించటం తప్పు.. భగవద్గీతలో చెప్పబడిన నిష్కామ కర్మ (?) నిర్లిప్తత కచ్చితంగా కాదు.

ఫలితాన్ని ఆశించకుండా కర్మ చేయటము, భౌతిక ప్రపంచంపట్ల అనాసక్తంగా వుండటమూ- యివి రెండూ ఒకటే ఎలా అవుతాయో శ్రీ సుదర్శనం ఎక్కడా చెప్పలేదు.

శ్రీసుదర్శనం అద్వైత సిద్ధిని గురించి కూడా ఎక్కడా స్పష్టంగా చెప్పలేదు. నిర్లిప్తతే అద్వైత సిద్ధి అన్న అయోమయంలో వుండటంవల్ల, అది వీలుకాలేదను కుంటాను. ఈ వివాదాన్ని అలా వుంచి, కథకుడికి అద్వైత సిద్ధి కలిగిందా అని పరిశీలించుదాము. కథకుడు భార్యమీద అనుమానం కలిగి పారిపోతాడు - అంతే కాని ఆత్మాన్వేషణ కోసం కాదు. అతడు ఆత్మాన్వేషణను గురించి అప్పుడప్పుడు చెప్పే మాటలు హాస్యాస్పదంగా వున్నాయి. అలా వెళ్ళిన కథకుడికి అమియ బాబా "అద్వైతానుభూతి"ని ప్రసాదిస్తాడు. దాన్ని పొందిన కథకుడు నేరుగా భార్య వద్దకు వచ్చి వుండాలి. కాని మళ్ళీ ఒకసారి వీర్యాన్ని పరిక్షించు కొని అందులో బీజకణాలు సజీవంగా వున్నాయని తీర్మానించు కొన్న తరువాతనే ఇంటికి బయలు దేరుతాడు. నవల మొత్తం మీద ఇంత అస్తవ్యస్తమైన సంఘటన మరొకటి లేదు. అద్వైతానుభూతిని పొందినవాడు వీర్యాన్నెందుకు పరిక్షించు కోవాలి? దీన్ని బట్టి చూస్తే కథకుడు పొందిన అద్వైతానుభూతి ఎంత బూటకమో తేలిపోతున్నది. ఒకమాటలో చెప్పాలంటే భార్య మీద అనుమానం కలిగి పారిపోయిన కథకుడు, అనుమానం తీరిపోయాక తిరిగి వస్తాడు. ఈ విషయానికి యింత 'వేదాంత వస్త్రాలు' తొడగవలసిన అవసరం ఎంత మాత్రమూ లేదు.

కథకుడు అద్వైత సాధన కోసం చేసే ప్రయత్నం 'సంసార వృక్షం'లోని కథా వస్తువని రచయితే చెప్పాడు. కళా దృష్టితో పరిశీలించినప్పుడు అద్వైత సిద్ధియొక్క స్థితి ఏమిటి? కథా వస్తువుగా అది ఎంత మాత్రం పనికి వస్తుంది? అన్నవి ముఖ్యమైన ప్రశ్నలు. కథకుడు నల్ల చెరువు స్వాములను చూసిన తరువాత "అద్వైత స్థితి మనస్సుకు అవలే వుంది" అని డైరీలో రాసుకుంటాడు. అమియ బాబా అద్వైతానుభూతిని ప్రసాదించాక దాన్ని గురించి తర్కించ బోతే అంగీకరించడు. శ్రీ సుదర్శనం కూడా కథకుడు పొందిన అద్వైతానుభూతిని గురించి చర్చించరు. అనగా ఆ అనుభూతి భాషకు, భాష మూలంగా జరిగే చర్చకు అతీతంగా వున్నదన్నమాట. మనస్సుకు అవల వుండి, భాషకు అతీతమైన వస్తువుకు సాహిత్యంలో స్థానం లేదని నా భావన. ఇటువంటి విషయాలను కథా వస్తువులుగా స్వీకరించటం, వాటిని శిల్ప వైవిధ్యంతో మెరిపించాలని ప్రయత్నించటం - సుప్రసిద్ధ విమర్శకుడు జార్జి లుకాచ్ అన్నట్టు – కాపిటలిస్టు వ్యవస్థ యొక్క నగ్న సత్యాలనుండి పారిపోవటం మాత్రమే!

ఇంత వరకు చెప్పినవి శ్రీసుదర్శనం తాత్విక దృష్టిలో వున్న లోపాలు మాత్రమే. కాని డాక్టరు వీరభద్రరావు వాత్ర అభ్యుదయ భావనను, సామ్యవాదాన్ని బుద్ధి పూర్వకంగా వక్రీకరించాలని చేసిన ప్రయత్నం. నా దృష్టిలో యిది మొదటి దానికన్నా హీనమైనది, ప్రమాదకరమైనది. తన లక్ష్యాలు సాధించటం కోసం శ్రీ సుదర్శనం సృష్టించిన కుతర్కాలు, కూటవాదాలు లెక్కకు మించినన్నివున్నాయి.

నవల ప్రారంభంలో వీరభద్రరావు ఒక గజ్జి కుక్కను పిస్తోలుతో కాల్చి చంపుతాడు. మరొక సందర్భంలో ఈ విషయం చర్చకు వచ్చినప్పుడు డాక్టరు "అందులో విప్లవ స్వరూపమూ వుంది. ఒక అనుభవ విశేషమూ వుంది" అని తన్ను తాను సమర్థించుకుంటాడు.

చావును ఒక ప్రాణికి ప్రసాదించటంలో ఆనందం వుందని, ప్రాణం తీయటంలో ఆనందం పొందటం సహజ ప్రవృత్తి గాదని అనటం సత్యాన్ని దర్శించేందుకు నిరాకరించుటయేననీ కూడా చెబుతాడు. ఈ వాదనను విన్న కథకుడు డాక్టరు నక్సలైటులా వున్నాడు – అని తీర్మానించుకుంటాడు. అంతే కాకుండా నక్సలైట్లతో వుండిన తాను "జీవితానుభవం కోసం" బయటికి వచ్చానని డాక్టరు చెబుతాడు. దీన్ని వక్రభాష్యంగా గుర్తించటం కోసం పాఠకుడు నక్సలైటుగా వుండనవసరం లేదు.

డాక్టరు హింసా సిద్ధాంతాన్ని శ్రీసుదర్శనం మరికాస్త సాగదీసి వికృతం చేశారు. రాబోయే శ్రామిక వ్యవస్థ యొక్క మూలతత్వం హింసట. ధనస్వామ్యంలో ఆస్తివల్ల లభించే పెద్దరికం, నాయకత్వం శ్రామిక వ్యవస్థలో వుండవు. కాబట్టి వాటిని సాధించటం కోసం హింస తప్పదట. ఈ విషయాలు డాక్టరు చెబుతాడు. ఇక్కడ వున్న కిటుకల్లా శ్రీసుదర్శనం శ్రామిక వ్యవస్థలో వుమ్మడి సుఖం కోసం వర్ధిల్లే స్పర్ధను, వ్యక్తిగత హింసగా చిత్రించటం.

వివాహం పట్ల డాక్టరు కున్న అభిప్రాయాలకు కూడా ఆధారం హింసే స్త్రీ పురుషులు ఒకరి నొకరు చూచుకోవటంలోనే 'హింస' వున్నదట. అదే శృంగారపరమైన 'వేటగా' మారుతూందిట. మార్క్సిస్టులు ఏకపత్నీవ్రతయే పురోగతి అన్న బూర్జువా అభిప్రాయాన్నే అంటి పెట్టికొని వున్నారట. అందుకు మార్క్స్ లెనిన్‌లు అంతకంటే యేమీ చెప్పక పోవటమే కారణమట. శ్రీ సుదర్శనం యింతటితో ఆగలేదు. కథకుడు వివాహంపట్ల డాక్టరుకున్న అభిప్రాయాలను తన భార్యతో చర్చిస్తూ "నేను హేమను ద్వితీయం చేసుకుంటాననుకో. నీ సమానత్వం నిలబెట్టు కోవటానికి నువ్వు డాక్టరును ద్వితీయం చేసుకుంటావు. అప్పటికీ కూడా నీకూ నాకూ పిల్లలు కలగకపోతే డాక్టరు హేమనీ, హేమ డాక్టరునీ ద్వితీయం చేసుకొంటారు. అలా నలుగురూ కలిసి ఒక వివాహం" అని వక్రీకరిస్తాడు.

డాక్టరు హింసా దృష్టికి పరాకాష్ఠ — కథకుడి వీర్యంలో బీజ కణాలు లేవని అబద్ధం చెప్పటం. ఈ విషయాన్ని రచయిత ఎక్కడా వాచ్యంగా చెప్పకుండా సూచించారు. కథకుడికి 'అద్వైతానుభూతి' కలిగి వచ్చాక మళ్ళీ కథకుడు, డాక్టరు కలుసుకొంటారు. అప్పుడు కథకుడు 'మీ విప్లవ సిద్ధాంతాలు ఏమయ్యాయని' డాక్టరును ప్రశ్నిస్తాడు. బంగ్లాదేశ్ గొడవతో కథ అడ్డం తిరిగి పోయిందని, యిప్పట్లో యీ దేశానికి మోక్షం లేదని చెబుతాడు డాక్టరు. తాను ఒక గ్రంథం రాస్తున్నట్లు, అందులో యింద్రియానుభూతి (సెక్స్, శాడిజమ్?)ని ప్రాతిపదికగా తీసుకొని స్పందన, ఆలోచన దానికి ఎలా వుపాంగాలో చూపించి, . . . వ్యక్తి భూమిక నుండి విప్లవం ఎలా వస్తుందో చర్చిస్తున్నాడట. వక్రీకరణ యిక్కడితో ఆగిపోదు. కథకుడు దీన్ని గురించి ఆలోచిస్తూ "యింద్రియానుభూ

తిలో పారమ్యం అంటే అంతదాకా వెళ్ళక్కరలేదు. పెథిడిన్ వంటి మందులు, త్రాగుడు, వ్యభిచారము నేడు చాలా మందికి వ్యక్తి పారమ్యానికి సాధనాలుగా వున్నాయి. ఈ ధోరణినే వ్యవస్థీకరించి సిద్ధాంతం చేస్తున్నాడు కాబోలు'' అనుకుంటాడు.

నిత్య జీవిత విషయాలలో కూడా డాక్టరును పరమహీనంగా చిత్రించ టానికి ప్రయత్నించారు శ్రీ సుదర్శనం. హేమను పెళ్ళి చేసుకోవటానికి కట్నం తీసుకోనని చెప్పిన డాక్టరు, మాట వరుసకు అత్తవారు యిస్తానన్న డబ్బును అలిగి సాధించుకుంటాడు. డాక్టరు పాత్ర ఇలా అనేక రకాలుగా బుద్ధి పూర్వకంగా వక్రంగా, వికృతంగా చిత్రించబడింది. బుద్ధి పూర్వకంగా యీ పాత్ర వక్రీకరించ బడిందని చెప్పటానికి అనేక ఆధారాలు వున్నాయి. అందులో ప్రప్రధానమైనది కథకుడి "టోన్" (tone). దీన్ని నిశితంగా పరిశీలించితే శ్రీ సుదర్శనం వుద్దే శం స్పష్టంగా తెలుస్తుంది. బుద్ధి పూర్వకంగా వక్రీకరించిన డాక్టరును గురించి అతడు నాలోని 'వాడే' అనటం శిల్ప దృష్ట్యా వంచన మాత్రమే.

అభ్యుదయ భావనను శ్రీ సుదర్శనం వెన్నుపోటు పొడిచారని నిరూపించ టానికి మరొక ఉదాహరణ యివ్వదలచుకొన్నాను. ఒక సందర్భంలో కథకుడు తన మిత్రుడు భావనారాయణతో యిలా అంటాడు. "నేను వైయుక్తిక వాదం నుంచి సామాజికవాదాన్ని, కమ్యూనిజాన్ని సమర్థిస్తాను. అదే మానవుడు సమి ష్టిగా సాధించవలసిన ఏకత్వం. అయితే నేనా మార్క్సు యొక్క భౌతికవాదాన్ని అంగీకరించను. తొలి వస్తువు పదార్థమైనా, మనస్సయినా ఇబ్బంది లేదు. ఈ నాడు రెండూ — పదార్థమూ, మనస్సూ - ఒక దాని మీద ఒకటి పని చేస్తు న్నట్టు గమనించేది మనస్సే కాబట్టి, మనస్సుకే ప్రధానం. నాది భౌతికవాదం కాదు. మానవతావాదం.'' ఇంతకు మించిన వక్రీకరణ గందరగోళం మరొకటి లేదు. పదార్థం యొక్క ప్రాధాన్యత (primacy of matter), గతి తర్కం (dialectics) భౌతికవాదం (materialism) — యీ మూటినీ అంగీకరించకుండా కమ్యూనిజాన్ని అంగీకరించటం అసాధ్యం. శ్రీ సుదర్శనం వాద సారాంశం, మొత్తం నవలను దృష్టిలో వుంచుకొని చూచినప్పుడు, ఆధ్యాత్మికవాదం మా త్రమే. దాన్ని స్పష్టంగా చెప్పకుండా, తానుకూడా కమ్యూనిస్టేనని చెబుతూ కమ్యూనిజాన్ని వ్యతిరేకించటం వెన్నుపోటు పొడవటం మాత్రమే అవుతుంది.

శ్రీ సుదర్శనం 'సాహిత్యం లో దృక్పథాలు' అన్న గ్రంథంలో ఈవిధంగా వ్రాశారు. "ఈప్రశ్న (కవి దృక్పథం ఏమిటి?) చాలాముఖ్యమైనది. కావ్యా ర్థం కవి దృక్పథం మీదనే ఆధారపడుతుంది. కవి దృక్పథం అంటే అతడు వాచ్యం చేసే అభిప్రాయాలే కావు. అతని జీవితానికి, వ్యక్తిత్వానికి సంబంధించి, అతనికి పూర్తిగా అర్థం కాని భాగం. సమకాలీన సంఘ జీవితంలో అతనికి గల పాత్రనూ సంబంధాన్ని నిర్వచించే విషయం. దాన్ని కావ్యంలో దర్శించే ప్రయత్నం చేస్తేనే కావ్య స్వరూపము దర్శన మిస్తుంది'' (పుట 2).

ఈ సూత్రాన్ని సుదర్శనం గారికే అన్వయించటంలో తప్పులేదను కుంటాను. శ్రీ సుదర్శనం శ్రీ దాదాజీ వద్దనుండి ప్రత్యక్షానుభూతిని పొందిన

వారు. శ్రీ దాదాజీ అసలు పేరు అమియ రాయ్ చౌదరి; వీరు కలకత్తా వాసి. దాదాజీ గారి అరాధ్య దైవమైన 'సత్యనారాయణ స్వామి'కి 'సంసారవృక్షం' అంకితమివ్వబడింది. శ్రీ సుదర్శనం గురువుగారైన అమియ రాయ్ చౌదరి అమియ బాబాగా 'సంసార వృక్షం' లో దర్శనమిస్తారు. ఇలా యీ నవలలో వస్తువుకు రచయితకు విడదీయరాని సంబంధం వుంది. కథా వస్తువు రచయిత జీవితం నుండి వుద్భవించటంలో తప్పులేదు. కానీ ప్రతి జీవితానుభవమూ కథా వస్తువు కాలేదు. ఈ నవలలోని కథావస్తువైన 'అద్వైత సాధన' ఎంతో విలువైనదని, వాస్తవమైనదని తన్ను తాను నమ్మించుకోవటానికి చేసిన ప్రయత్నమే యీ నవల. అందుచేత నవలలో సమదృష్టి వెదికినా కనిపించదు. ఎలాగైనా తన వాదనను నెగ్గించుకోవాలి అన్న తాపత్రయము ఎక్కువ కావటంవల్ల, యీ నవల వక్రీకరణలతో నిండి పోయింది. 'సాహిత్య విలువలు' మృగ్యమై శిల్ప దృష్ట్యా ఎంతో 'ప్రిమిటివ్' గా రూపొందింది. మార్క్సిస్టు గ్రంథాల నుంచి వీరి కూర్చిన స్లోగన్లకు లాగే, తాత్త్విక గ్రంథాలనుంచి ఉద్ధరించిన వుపన్యాసాలకు 'సాహిత్య విలువ' లేదు. ఈ వ్యాస ప్రారంభంలో పేర్కొన్న క్లెయిమ్స్‌లో ఒకటి కూడ రచయిత సాధించలేకపోయారని నేను భావిస్తున్నాను.

'సంసార వృక్షం' చదువు తున్నంత సేపూ ఒకరకమైన 'సిక్ ఫీలింగ్' పాఠకుణ్ణి వెన్నాడు తుంది. అందుకు కారణం రచయిత మానవ జీవితం అర్థ రహిత మైనదని, జీవితంలో మానవుడు ఏకాకి అని మాటిమాటికి జ్ఞాపకం చేస్తుండటమే ఈ రకమైన జీవితదృష్టి ''ఆధునిక'' సాహిత్యానికి మూలకందంగా తయారవుతున్నది. ఈ పరిస్థితికి కారణం ఏమిటో అన్వేషించవలసిన సాహిత్య కారులు యిందులో మునిగి తేలుతూ, ఆనందాన్ని అనుభవిస్తున్నారు డి. హెచ్. లారెన్స్ వంటి కొందరు దీనినుండి బయట పడటానికి శక్తివంచన లేకుండా ప్రయత్నించారు గానీ శ్రీ సుదర్శనం ఆ ప్రయత్నం — కనీసం యీ నవలలో — చేయలేదు. చారిత్రక పరిణామ క్రమంలో యీ పరిస్తితిని ఒక దశగా గుర్తించి, అందుకు కారణాలను చూపించవలసిన బాధ్యత కలిగిన రచయిత దీన్ని మానవ జీవితాని కంతకూ (condition humaine) వర్తింప జేయటం ఎంతైనా విచారించ వలసిన విషయం.

నా మరణ శాసనం . . . సత్యశ్రీ

మట్టిలో కలిసిన నేను
మళ్లీ పుట్టవలసి వస్తే
ఖనిజ మౌతాను గాని
మనిషిగా మాత్రం రాను . -
అప్పుడు,

కర్రుగా మలచి నా చేత
మృత్తిక కరపించుకోండి,
కాని —
కత్తిగా మార్చి నా చేత
కుత్తుక నరికించ కండి.

ఎంత చెట్టుకి అంత గాలి

కథానిక

శ్రీమతి బెహరా సాహితి

"అయిదో నెల వచ్చిందనుకుంటాను" అంది సుమతి ముద్దుగా పిల్లవాడి బుగ్గలు పుణికి.

"ఊఁ! క్రిందటి వారమే వచ్చింది అయిదో నెల వస్తే గాని పంపరుగా. అప్పటికీ మా అమ్మకి బెంగే, ఎలా చేసుకుంటావో ఏమోనని తెగ గొడవ పెట్టింది. నీళ్లలో ఎక్కువ నానద్దని, చలిగాలిలో తిరగొద్దని. బాబుని డాక్టరుకి చూపిస్తూవుండమని. ఒకటి కాదనుకో ... ఓ పెద్ద లిస్టే" నవ్వింది గొప్పగా సులోచన తల్లి ప్రేమ తల్చుకుని.

"పెద్ద వాళ్ల కంతే." పొడిగా అని, తన పరిస్థితిని తల్చుకుని చిన్నబుచ్చుకుంది సుమతి లోలోపలే. తన తల్లి లాటి జాగ్రత్తలు చెప్పదు. చెప్పలేదు కూడాను! తనకి నీళ్లలో తడవక పోతే జరగదు చలికి బయపడితే ఎలా? గడగడ లాడే చలిలో లేచి చంటి పిల్లవాడ్ని భర్తకి చూడమని అప్పగించి పాలకి వెళ్ళాలి తను. ఇంట్లో వంట మనిషి, పని మనిషి అన్నీ తనే. "కార్యేషు దాసీ" అంటూ పూర్వం చెప్పిన భార్యా విధుల్లో మరో నాలుగు చేర్చుకుని, తను దశావతారాలూ ఎత్తాలి. అతి సామాన్యమైన మధ్య తరగతి గృహిణికి సులోచనలా సుకుమారాలెలా సాగుతాయి?

"అన్నట్లు మీకు నెల పిల్లాన్నే తీసుకొని వచ్చేసినట్లుంది కదూ? అబ్బ ఎలా చేసుకున్నారో గాని బలే కష్టం బాబూ!" భుజాలెగరేసి, కళ్లు తిప్పుతూ అంది సులోచన. ఆమె భర్త ఇంజనీరు. నెలకి వెయ్యి పైనే కళ్లజూస్తాడు.

"ఏం చేస్తాం? కష్టమైనా, సుఖమైనా... సాగితేనే.."

"ఏమో బాబూ!." మా అమ్మయితే నన్ను మంచం దిగనియ్యలేదు నెల లోపల. తరువాత కూడా, హాలు దాటితే బయటికి రాలేదు. పొరపాటున చన్నీళ్లు తగిల్తే కొంప మునిగినంత గాబరా పడేది, చంటివాడి పనంతా పని మనిషి చూసుకొనేది. అందుకే, ఈ వూర్లో మళ్లీ దొరుకుతారో లేదోనని, అక్కడి నుంచే పిల్లని తెచ్చుకున్నాను."

"మంచి పని చేసారు." ముక్తసరిగా అంది సుమతి.

ఆవలి వైపు

కలచవీడు మురళీధర్

ఆకాశపు తెరని తొలగించి అవని
ఆవలి వైపు చూస్తే కనిపించేదెవరు?
గుండె లోతులు తరచి తరచి
గొంతు గిలకని చప్పుడు చేస్తూ
అనుభూతుల్ని చేదుకొనే
అప్సరసలా?

విరిగిన మనసులతో ఎండిన
డొక్కలతో
అతుకుల గతుకుల
బతుకులు బ్రతికే నిర్భాగ్యులా?
అవని కళ్లు విప్పదు.
అంతరంగంలో కల్లోలం తప్పదు.

చంటి పిల్లవాడు కేర్ మన్నాడు.

"ఏవిరా అప్పుడే లేచావూ ? వీడి కిప్పుడే ఎంత షోకనుకున్నారూ ? తల క్రింద ఓ చిన్న తలగడా పెట్టాను చూశారా ? ఆ మాత్రం ఎత్తు లేకపోతే పడుకోడు. పక్క కూడా మెత్తగా వుండాలి" అంటూ పసివాడ్ని ఎత్తుకుని తీసుకొచ్చి, ముద్దులాడుతూ కూర్చుంది. మెత్తని, దూది పరుపు, పైన ఫాన్, పళ్ల రసం.

అదృష్టవంతుడు. తన బాబు ప్రసాద్‌కీ యీ అదృష్టం రాసి వుంటే, తన కడుపున ఎందుకు పడతాడు ? చీకటి గూభ్యం, నులక మంచం మీద ఓ పాత చీర వేసి, పడుకో బెట్టేది తను. పాలే సరిగా అమరక యిబ్బంది పడేవారు, పళ్ల రసాలివ్వ గలదా? సుమతి ముఖంలో భావాలని చూసి, సులోచనకి గర్వంగా అనిపించింది. తృప్తిగానూ ఫీలయింది.

"వెళ్తానండీ, బాబు స్కూలునుంచి వచ్చే వేళయింది." ఇంతలో ఇంటి బయట కారు హారన్ వినిపించింది. "ఎవరూ ?" అంటూ ఇద్దరూ బయట కొచ్చారు. ఎండలో పట్టు చీర, ఒంటి నిండా నగలు ధగధగ లాడుతుంటే మెరుపు మెరిసినట్లు, మేఘంలాంటి నల్ల కారులోంచి దిగింది ధనలక్ష్మి. సులోచన మొహం విప్పారింది సంతోషంతో.

"రండి, రండి" సంభ్రమంగా ఆహ్వానించింది. డ్రయివరు తనూ దిగి, గేటు తీశాడు. సుమతి మెల్లగా అడిగింది "ఎవరావిడ" అని.

"అయ్యో! తెలీయదూ ! కోటీశ్వరులు నిరంజనరావు గారి భార్య." గొప్పగా అని, అతిశయంగా చూసింది. "చూశారా ఆవిడ మా యింటి కొచ్చింది" అన్నట్లు.

"మిమ్మల్ని పేరంటం పిలవాలని వచ్చాను" అంటూ గబ గబ ధనలక్ష్మి మెట్లెక్కింది.

"రండి, రండి. లోపలికి రండి ఏవిటి విశేషం?" మర్యాదగా, అణకువగా ఆహ్వానించింది సులోచన. కుర్చీ చూపించింది.

"కూర్చోనండీ. మళ్ళీ టైమవుతుంది" అంటూనే కుర్చీలో చతికిల బడింది. "అబ్బ! ఏం ఎండరా బాబూ! రేపే ఫంక్షనేమో హడావుడై పోయింది. మా మనవడికి రేపు బారసాల. అదీ విశేషం."

"అలాగా! విన్నాను బాబుపుట్టాడని మీ నిర్మలకి. ఐతే పేరేం పెడతారో?"

"వాళ్ల తాతగారి పేరే." నవ్విందావిడ.

"కాఫీ తెస్తానుండండి" అంటూ లోపలి కెళ్ళబోయింది సులోచన.

ఆత్మావలోకనం

రాధేయ

ధనుష్టంకారంతో
రక్తాభిషేకం చేసుకున్న
రాజులు గతించారు
నాటి రాజభవనాలన్నీ
శ్మశాన వాటికలు కాగా
శిధిల రధాలనూ
బీటలు వారిన నందనవనాలనూ
శేషంగా చూసుకుంటూ
గతాన్ని ఆత్మావలోకనం
చేసుకొంటున్నాడు
మానవుడు
భావి తరాన్ని ఉజ్వలంగా
భావించే అభ్యుదయ మానవుడు.

"అబ్బెబ్బే! అదేం వద్దండీ! మంచి నీళ్ళు యివ్వండి చాలు," అంటూ పసివాడి దగ్గరగా వెళ్ళి, "మీ అబ్బాయా?" అని అక్కడే నిల్చున్న సుమతితో చెప్పడం మొదపెట్టింది గల గలా: "అబ్బో! మా నిర్మల కొడుకైతేనా. ఇలా ఈ పరుపు మీద పడుకో బెడితే, ఓ నిముష ముంటాడా? ఈ ఫాన్ గాలి వేడి బాబూ, ఒక్కనిముషం ఎయిర్ కండీషన్డ్ గదిలోంచి బయటకు రాదు మా నిర్మల పిల్లవాడితో పాటు. డన్‌లప్ పరుపు తప్పితే మరోటి పనికి రాదనుకోండి, వేలెడంత వున్నాడో లేడో గాని వెధవ. ఆపిల్ జూస్ సొక్కదండీ. వాడికది పట్టడానికి, ఇద్దరు ఆయాలూ డ్యాన్సు చేయవలసిందే," అంటూ ఫెళ ఫెళా నవ్విందావిడ.

"ఇదిగోనండీ మంచి నీళ్ళు" అంటూ అందించింది సులోచన. ఆమె మొహంలో ప్రసన్నత మాయమై పోవడం గమనించి, చిన్నగా నవ్వు కుంది సుమతి.

కొద్దిగా తాగి "ఓ ! మర్చేపోయాను అసలెవరింట్లోనూ మంచినీళ్లడగను నేను. ఇదే ఇబ్బంది" అంటూ టక్కున గ్లాసు ప్రక్కన పెట్టిందావిడ.

అదేమిటండీ అంటూ ఇద్దరూ ఒక్కసారే అడిగారు.

"అదేనమ్మా! ఫ్రిజ్ నీళ్ళు తప్ప — ఈ నీళ్ళు గొంతు దిగవు. వస్తానూ! టైమవుతోంది" అంటూ బొట్టు పెట్టి చరచరా నడిచింది ధనలక్ష్మి.

కారుదాకా సాగనంపారు.

"నిర్మల అయితే భర్త దగ్గరికి వెళ్లి పోతుందేమిటండీ బారసాల కాగానే!" అడిగింది సులోచన, ధనలక్ష్మి కారులో కాలు పెడుతుండగా.

"అమ్మో! అప్పుడే పంపడమే. ఇంకా పిల్లవాడికి బారసాలేగా! నక్షత్రం మంచిది కాదని, అయిదో నెలలో చెయ్యవలసి వచ్చింది. అంతే. పిల్లవాడికి నడక వస్తేగాని, నిర్మలని పంపను. ఎంత ఆయాలున్నా పిల్లవాడి జాగ్రత్త చూసుకోవాలిగా, వస్తానమ్మా. రండి పేరంటానికి తప్పకుండాను. పోనీ డ్రయివర్!"

"వెధవ గొప్ప" అన్న సులోచన మాట విరుపు; కిసుక్కుమన్న సుమతి నవ్వూ అన్నీ కూడా ఆ కారు రొదలో కలిసి పోయాయి.

తూర్పును పొదిగే పక్షి! . . . దస్తగిర్

తీగను మీటగానే —
మనస్సు తెగింది.
భావం పగిలి తీయని బాధ
బ్రతుకు రెప్పలనుండి రాలుతూంది
వెచ్చని కన్నీటి బొట్లుగా!
నా కళ్ళలోని రెటీనాపై —
ప్రతిఫలిస్తున్నాయి
చుట్టూ కదలాడే నీడలు!
ఇక్కడి దారులన్నీ పుష్పిస్తున్నాయి
పోరాడే పాదాలను నెత్తుటి మరకలుగా.

దూరంనుండి హోరున
వినవచ్చే నినాదాలు
కెరటాల్లా నా ముఖాన్ని కొట్టుకొని
ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి!
నాగొంతు చిగిర్చిన సంఘీభావంఏరుకొని
పక్షిలాంటి పాట —
రివ్వున ఎగిరిపోతూంది
రాగం రెక్కలు విప్పుకొని
గగనం తీరాలకు
తూర్పును పొదగాలని!!

జ్ఞానపీఠ బహుమతి గ్రహీత
శివరామ కారంత్

ఇటీవల జ్ఞాన పీఠం బహుమతి పొందిన కోట శివరామ కారంత్ బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన కన్నడ సాహిత్యంలో అగ్రపీఠాన్ని అలంకరించడమే కాదు, ప్రాచీనకళ అయిన యక్షగానాన్ని ఖిలం కాకుండా పునరుద్ధరించిన సముద్ధర్త కూడా.

జ్ఞాన పీఠం బహుమతికి అర్హమైనదిగా నిర్ణయింపబడిన ఆయన నవల పేరు: 'మూకజ్జియ కనసుగళు' (మూకజి మామ్మ దృశ్యాలు).

డెబ్భయ్యేరు సంవత్సరాల శివరామ కారంత్ మంగళూరు జిల్లాలోని కోటగ్రామంలో ఒక పండిత కుటుంబంలో జన్మించినారు. గాంధీజీ పిలుపు ననుసరించి జాతీయోద్యమంలో పాల్గొన్నారు; ఖద్దరు వ్యాప్తికి, మద్య నిషేధానికి పాటుపడ్డారు.

సాంప్రదాయాల మీద తిరుగుబాటు, తాను సృష్టించిన సాహిత్యంలోనే కాదు, స్వీయ జీవితంలోనూ కారంత్ ఆచరించారు. బ్రాహ్మణ కులానికి చెందిన కారంత్ బ్రాహ్మణేతర స్త్రీని వివాహం చేసుకోవడంతో ఆయన గ్రామంలో తుఫాను చెలరేగింది. కాని ఆయన లక్ష్య పెట్ట లేదు.

మానవతకు భిన్నమూ, వ్యతిరేకమూ అయిన విశ్వాసాలనూ, విలువలనూ ధిక్కరించడం ఆయన సాహిత్యంలో లాగానే, జీవితంలోనూ కనిపిస్తుంది.

కారంత్ విశిష్ట ప్రసిద్ధి ప్రధానంగా నవలా కారునిగానే. ఆయన 50 వరకూ నవలలు రాశారు. ఇందుకు సరిసమానమైనది యక్షగాన పునరుద్ధరణకు, వ్యాప్తికీ ఆయన చేసిన కృషి. ఆయన అనేక సంవత్సరాలు నాటక సమాజాలు నడిపించారు. వాటి కోసం నాటకాలు రాశారు. విజ్ఞాన శాస్త్రం గురించి, కళ గురించి పుస్తకాలు వ్రాశారు. సాహిత్య పత్రిక నడిపారు. సంఘసంస్కరణకు పాటుపడ్డారు. వ్యభిచారిణులకు పెళ్లిళ్లు చేసి, వారిని అవినీతి నుండి తప్పించడానికి తీవ్ర ప్రయత్నాలు చేసి, కొందరికి వివాహాలు చెయ్యగలిగారు. ఒంటి చేతిమీదుగా "విజ్ఞాన ప్రపంచ" అన్న పేరుతో బాలల కోసం బృహత్తర విజ్ఞాన సర్వస్వాన్ని ప్రచురించారు.

కారంత్ తొలి ముఖ్య రచనలలో ఒకటి, "చోమన దుడి" అన్న నవల (1933). దీని కథ ఆధారంగా నిర్మించిన కన్నడ చలన చిత్రం జాతీయంగా, అంతర్జాతీయంగా ఖ్యాతిని పొందడం అందరూ ఎరిగిననే. పేదవాడయిన చోమన అంటరాని జీవితం, పాట్లు కథావస్తువుగా వున్న యీనవలను రాసేందుకు కారంత్ 33 గ్రామాలకు వెళ్ళి పరిశీలనలు జరిపేరట. సమకాలీన జీవితంలో యిటువంటి వాస్తవ విషయాలే, యించుమించుగ ఆయన నవల లన్నిటికి కథా వస్తువులు.

ఆయన యింకో ప్రసిద్ధ నవల, 'మరళె మన్నిగె' - (మళ్లీ మట్టి వద్దకు). దీని తెలుగు అనువాదం ప్రచురింప బడింది. ఇది మూడు తరాల కథ. తరతరానికీ జీవితంలో వచ్చిన మార్పులు యీ నవలలో అద్భుతంగా చిత్రించబడ్డాయి.

కారంత్ నవలలోని ఒక ప్రత్యేకత ఏమిటంటే - యితివృత్తాని కనుగుణంగా ఒక్కొక్క నవల రూపం, కథాకథనం, వస్తువు, శైలి యింకో దానికి భిన్నంగా వుంటాయి.

జ్ఞానపీఠం బహుమతి పొందిన 'మూకజ్జీయ కనసుగళు' ఒక ముసలమ్మ మాటల సొంపుతో నడిచే నవల. ఆమె పాతదైనా, కొత్తదైనా ఏ వస్తువు గురించేనా చెప్పేటప్పుడు, ఆయా ఘటనల్ని జరిగినవి జరిగినట్లుగా, కళ్లకు కట్టినట్టు చెప్పే నేర్పున్న పాత్ర.

కారంత్ రచనలు అతివాద భావాలతో వున్నా, ఆయనకు అతివాద సాహిత్య రచయితలతో సఖ్యత లేదు. అన్ని విధాలైన రచయితల బృందాలకూ ఎడంగా వుంటారు. కాని అనేక సమస్యల పైని బలమైన అభిప్రాయాలు న్నాయి. వాటిని నిస్సంకోచంగా వ్యక్తం చేస్తారు. 'ఔదార్యద ఉరుళల్లి' (ఔదార్యపు ఉరి ఉచ్చులలో) అన్న తన నవలలో ఒక గాంధీ ఆదర్శవాది, దొంగ దేశభక్తుల ఉచ్చులలో ఎలా చిక్కుకున్నదీ వర్ణిస్తారు. ఆయన నవలలో ఎక్కువ వాటిలో దారిద్ర్యం, దగా, నైతిక పతనం మొదలైన చెడుగులు చిత్రింపబడతాయి.

రాజకీయ ఘటనల పైని కారంత్‌కు తీవ్రమైన అభిప్రాయాలున్నాయి. కాని అవి ఆయన రచనలలో కనిపించవు ఆయన లోని వైరుధ్యం యిది. రచనలలో ఏమున్నా, అన్ని విషయాల పైని ఆయనవి మితవాద భావాలు. అతివాదులు యిందువల్ల, ఆయనకు అభివృద్ధి నిరోధకుడన్న ముద్ర వేస్తారు.

కాని రచనల తీరు యిందుకు భిన్నం. ఇందులో ఆయన మానవతావాదిగా కనిపిస్తారు. మనిషి, బ్రతుకును బాగుచేసుకోడానికి అతను జరుపుతోన్న రు-పో ప్రగతి శీలమైన భావాలన్నీ వాటిలో ప్రతిబింబిస్తాయి. హేతువిరుద్ధమైన వాటిని నిరసిస్తారు: హేతుబద్ధమైన శాస్త్రీయవగాహనను ప్రకటిస్తారు. ఈ విధంగా ఆయన రచనలు అభ్యుదయ కరమైన రచనలు.

వ్యక్తిగా కారంత్ ముక్కుకు సూటిగా పోయే మనిషి. తన అభిప్రాయాలను ప్రకటించేటప్పుడు తొణకడం జరగదు. వ్యతిరేకతకు జంకే స్వభావం ఆయనకు లేదు. పద్మశ్రీ బిరుదును తిరస్కరించడం, ఆయన నమ్మకాలెంత గట్టివో తెలుపుతుంది.

విప్లవ పరిస్థితుల్ని సృష్టించడానికి ఉత్త అసంతృప్తి మాత్రం చాలదు. విప్లవ విలువల్లో గాఢ విశ్వాసం వున్నవాడు, తన తోటివారికి నచ్చచెప్పగలనన్న గట్టినమ్మకం వున్న వాడూ, కొంత కాలం ఉద్వేగం కొనసాగేలా చేయగలవాడూ మాత్రమే విప్లవానికి నాందీ వాచకం పలకగలడు. వేనైతే పరివర్తనను కోరతాను. దీనిది మందగమనం నిజమే, కాని మనిషి సాధించే దానికి ఎక్కువ వికరమైన సూచన యిది. (కారంత్)

మరాఠీ 'విరూపికలు'

మరాఠీ, కవిత్వంలో 'విరూపికలు' అన్న పేరుతో ఒక ప్రయోగం జరుగుతున్నది. విందా కరందికర్ అన్న ఒక అగ్ర మరాఠీ కవి గీతాల అనువాదం యీ దిగువ చదవండి. ఈ గీతాలు, దారి తప్పిన ప్రయోగాలెలా వుండేదీ తెలుపుతాయి. ప్రతి భాషలోనూ, సాహిత్యంలోనూ యీ తీరు తెన్నులు కనిపిస్తూనే వున్నాయి. వెర్రి కుదిరింది, తలకు రోకలి చుట్టుకుంటానన్న మాదిరిగా వుంటాయి – అయినా అవెలా వుంటాయో తెలుసుకోవాలి కదా.

చూడు,
కూలుతోన్న గోడ మీద కూచొని
కాకి,
సిరాలా నల్లనిది,
మెల మెల్లగా
కరగడం మొదలు పెట్టింది.
కరిగి పడుతోంది.
నల్లబడింది గోడ
కాను నల్లగా.
దాని అవశేషాలు
ఎగిరిపోయాయి మెరుస్తూ.
చూడు, చూడు.

* * *

చిన్న వయసులో
ఒకసారి సముద్రంలో
ఉచ్చ పోశాడు వాడు.
మిగతా జీవితమంతా
గడిపాడు
నీటి మట్టం పెరుగుదల కొలుస్తూ.

* * *

ఏనుగ ముఖం, బానకడుపూ వున్న
గణపతి తొండం చూస్తూ
ఒక కాముకికి
(చెత్త పుస్తకాలు
చాటుగా చదవడం అలవాటావిడకు)
కామోద్రేకం కలిగింది
ఏనుగు ముఖం, బాన కడుపూ వున్న
గణపతి ఆమె స్తనాలు
వెనువెంటనే పట్టి,
ఆకాశంలో యిరవయ్యొక్క సార్లు
గిరగిరా తిప్పి,
ఆ పురాతన కాలపు రోజుల్లో
పరిశుద్ధాత్ముల ఘోర నరకంలోకి
విసరి పారేశాడు.

* * *

ఓ దేవుడా,
గొడుగులాగా
రోదసిని ముడవగల, విప్పగల
నీ అరచేతిలోని
ధనరేఖ, శుక్రరేఖ
కనిపిస్తున్నాయి నాకు.
మంచిదే.
కాని – విదేశాల కెళ్లే
యోగం లేదు, పాపం.

"పద్యం వేరూ, కవిత్వం వేరూనూ" అన్న పరమార్థం తెలిసిన వారు చాలా అరుదు మన వదాన్యుల్లో .. ఈ జ్ఞానం కవుల మనుకునే వారిలో కూడా చాలా మందికున్నట్టు లేదు .. 'ఛందస్సులో వుండే నాదం వేరూ, సంగీతంలో వుండే నాదం వేరన్న' అన్న సత్యం తెలిసిన వారు కూడా చాలా తక్కువ మన రసికుల్లో.

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి

పరిచయం

కథానిక

మహీధర రామశాస్త్రి

రామ్ ప్రసాద్ పార్కులో, పోక చెట్టుకి ఓ కాలు తన్నిపెట్టి, నడుం జారేసి, వేరుశనకాయలు నములుతూ నిరీక్షిస్తున్నాడు. ఎవరి కోసం? అమ్మాయి కోసం కాదు! అతని కోసం! ఎవరతను? రామ్ ప్రసాద్ కే తెలియదు! తెలియని వ్యక్తి కోసం నిరీక్షణా? అవును!

రామ్ ప్రసాద్ అతన్ని ఓ బ్యాంకు పని చేస్తుండగా చూసేడు. పరిచయం లేదు. ఇప్పుడతని పరిచయం అవసరం అయింది!

అతను వస్తున్నాడు. దగ్గర పడగానే రామ్ ప్రసాద్ ఓ చిరునవ్వు విసిరేడు. అతనూ తిరిగి నవ్వేడు.

"నమస్కారం మేస్టారూ! మీరు రోజూ వస్తుంటారా పార్కుకి?"

"నా పేరు ప్రభాకరం, నేను మేస్టర్ని కాను! ఈ పార్కు వీధినే వున్న బ్యాంకులో పనిచేస్తున్నా. ఇంటికి యీ పార్కుకి అడ్డంపడి పోతే, దగ్గర. వెడుతూ, అయిదు నిముషాలు గడుపుతుంటాను."

"ఓహో! అలాగా? నా పేరు రామ్ ప్రసాద్. డ్రగ్ యినస్పెక్టరుగ వుంటున్నా. బ్రహ్మచారిని, చూడండి! ఆ గదిలో ఏం తోచక, యిలా పార్కుకి వస్తూంటా. రాండి, అలా కూర్చుందాం!" లానులోకి తోవ తీస్తూ, నాలుగు వేరుశనక్కాయలు ప్రభాకరం చేతిలో పోసేడు.

వాటిని నములుతూ యిద్దరూ చతికిల బడ్డారు ఓ మూల.

మరో రోజు—

"హలో! రామ్ ప్రసాద్ గారూ! తమాషాగా మనం రోజూ కలుస్తున్నాం, యీపార్కు ధర్మమా అని!" ప్రభాకరం పలకరించేడు.

"పార్కులు, ప్లాట్ ఫారాలు తమాషాగా మనుషుల్ని కలుపుతాయి. వాటిని మనం వాడుకోవడంలో వుంది!"

"మీరు తమాషాగా మాట్లాడతారే!"

"చూడండి, ప్రభాకరం గారూ! సరదాగా బతకాలంటే తమాషాగా మాట్లాడ్డం నేర్చుకోవాలి. ముఖ్యంగా స్నేహితులతో! మన పరిచయం, పలకరింపు కాస్త హాయిని కలగించాలి ఎదుటి మనిషిలో! ఏమంటారు?"

"అంత బాగా చెప్పినందుకు మిమ్మల్ని మెచ్చుకుంటానంటాను!"

"థాంక్స్! ఎంతయిన రచయితను కదండీ?"

"ఇన్నాళ్లనుంచీ చెప్పనే లేదేం? మీరు రచయితలని?" సస్ఫూరంగా అన్నాడు ప్రభాకరం.

"ఎన్నాళ్లయిందేవిటి? పదిహేను రోజులేగా? అయినా ఆ అవసరం రాలేదు!"

"భలే వారే! ఉత్తరాల పేజీలో ఓ ఉత్తరం అచ్చయితే, గొప్పగా చెప్పు

కుంటారు గదా ? అలాంటిది రచయిత అయివుండీ, యీ స్నేహితుడికి చిన్న ముక్క చెప్పేరు కాదు ! అవునూ ? రామ్ ప్రసాద్ పేరున రచనలు చదివి నట్లు లేదు.''

"కలం పేరు వాడతా ! పునర్వసు పేరు వినే ఉంటారు !"

"పునర్వసు మీరా? అయ్యబాబోయ్! ఎంత నిండు కుండలండీ మీరు ? మీ "కెరటాలు" నవల ఎన్ని సార్లు చదివేనో!" కౌగలించు కున్నంత పని చేసేడు ప్రభాకరం.

"మీ అభిమానానికి థాంక్స్ !"

అక్కడితో ఊరుకో లేదు ప్రభాకరం.

"మీరీ రోజు అప్సరాలో విందు తీసుకోవాలిసిందే ! కాదన కండి!"

"ఎందుకండి మీకీ శ్రమ ! మీ వాళ్లు ఎదురు చూస్తూ వుంటారు !"

"నేనూ ఒంటరిగాడినే లెండి !"

"చెప్పేరు కాదేం?"

"అవసరం లేక ...." ప్రభాకరం జోకు విసిరేననుకున్నాడు; నవ్వేశాడు. రామ్ ప్రసాద్ అతని నవ్వుతో నవ్వు కలిపేడు.

మిత్రు లిద్దరూ అడుగులో అడుగు వేసుకుంటూ, అప్సర వైపు నడిచేరు.

* * *

"హలో ! ప్రభాకరం గారూ!...."

"మీకు చాలా సార్లు చెప్పేను. గారూ, గీరూ వద్దని ! ప్రభాకరం అని పిలవండి చాలు!"

"ఓ ! అది నా అలవాటండీ సరే. నాకో సలహా కావాలి ! మీరు చెప్ప గలరను కుంటాను !"

"మీకా ? నేనా ! ఏమిటది ?"

"చూడండి. ఈ డ్రాఫ్టు నా పేర వచ్చింది, రెండు వందల యాభైకి. మార్చుకుందామని మీ బ్రాంచికి వెళ్లాను. నా పేర కాతా తెరిస్తే తప్ప డబ్బుగా మారదని చెప్పేరు. నా కాతా స్టేట్ బ్యాంకులో వుంది. తీరా యీ డ్రాఫ్టు మీ బ్రాంచికి వచ్చింది. ఈ డబ్బు తొందరగా కావాలి. మా అమ్మకి అనారో

గ్యంగా వున్నట్లు ఉత్తరం వచ్చింది. రేపు రాత్రి బండికి వెళ్లాలి! మార్గం ఏ వన్నా ఉందంటారా?''

''వాళ్లు చెప్పింది నిజమే అనుకోండి! అయినా మీ కెందుకు? రేపు బ్యాంకుకు వచ్చి నన్ను కలవండి. నేను మీకు సాయం చేస్తాను. అదేం సమస్య కాదు!''

''బ్రతికించేరు! థాంక్స్!''

* * *

పదిహేను రోజుల తరువాత –

బ్యాంక్ మేనేజరు ప్రభాకరాన్ని తన గదికి రప్పించి, అడుగుతున్నాడు.

''ఎ. రామ్ ప్రసాద్ అన్న వ్యక్తిని మీరెరుగుదురా?''

''ఎరుగుదునండి!''

''అతని చిరునామా చెప్పగలరా?''

''అతను గొప్ప రచయితండి''

''అవన్నీ అనవసరం. అతని చిరునామా చెప్పగలరా?''

''అది తెలియదండి!''

''చంపేరు. ఏం. తెలియకుండా అతన్ని ఎలా ఎరుగుదు నన్నారు?''

''నాకు బాగా తెలిసున్న వ్యక్తే నండి. అందులో సందేహం లేదు!''

''ఈ కాగితం చూడండి. ఆ సొమ్ము తనదనీ, అసలు వ్యక్తిని నేనంటూ, మరో రామ్ ప్రసాద్ ముందుకి వస్తున్నాడు. తన డ్రాఫ్టు పొరపాటుగా మరొకరికి బట్వాడా అయిందంటున్నాడు! ఈ యిద్దరిలోను ఎవరు అసలు మనిషో తేల్చగలరా?''

ప్రభాకరం బుర్రలో బొంగరంలా ఆలోచనలు తిరుగుతున్నాయి.

సీలింగ్ ఫాన్ అతివేగంగా తిరుగుతున్నా, ముచ్చెమటలు పోశాయి. పెదాలు తడుపుకుంటూ ప్రభాకరం గదంతా పరికించి, మేనేజరు వైపు నీరసంగా, నిస్సహాయంగా చూసేడు.

మేనేజరు చూపుల్లో అనుమానం.

''నేనే దోషం ఎరగను!''

''అదేదో ఋజువు పరుచుకో!''

''రామ్ ప్రసాద్ కనిపిస్తే కాస్త చెప్పండి!'' అంటూ ప్రభాకరం మిత్రుడి అన్వేషణలో, కొత్త మిత్రులను పరిచయం చేసుకుంటున్నాడు!

మొండి గోడలు . . . మెంటమ్ కవిరాజ్

వీధి దీపాలు సార తాగిన జారిణిలా
ఉషారుగా వెలుగుతున్నాయ్.
వూరు కుక్క తనకేమి పట్టనట్టు
నోరు మూసుకొని కళ్లు బిగించి
లైటు స్తంభం క్రింద పడుకొంది హాయిగా

పాడు పడిన మేడ మొండి గోడల్లో
నుండి ఊర్పుల నిట్టూర్పులు
వినవస్తున్నాయి వికృతంగ.

ఆకలికి బుద్ధిచెప్పాలని పండు,
వెన్నెలో పతనమైపోతుంది
ఓ అభాగ్యురాలు

ఎండిన రొమ్ములు మండి అథం
శుభం ఎరుగని పసివాడిని గొడ్డును
బాదినట్టు వొళ్లు పచ్చడిచేస్తుంది
ఒక తల్లి

దూరాన ఎర్రటోపి వాడి నల్లబూట్ల
సవ్వడి. మొండి గోడల మధ్యనుండి
పారిపోయె గుంపు అలజడి

ఫుట్ పాత్ జనాన్ని తొక్కేస్తు
పరుగెత్తె జవాన్ పట్టేశాడు, కేసు
కొట్టేశాడు, మొండిగోడల మధ్య చాన్ని.

మరుక్షణం శ్మశానంలోని నిశ్శబ్దం.

'రాళ్లపల్లి పీఠికలు'

శ్రీవిరించి

తెలుగు సాహిత్య విమర్శకులలో శ్రీమాన్ రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ గారిది పెద్దపేరు. సాహిత్యమే కాక సంగీతమున కూడా కళాప్రపూర్ణులయిన శ్రీమాన్ రాళ్లపల్లి వారి వయసు యిప్పుడు 85 సంవత్సరాలు కాగా వారు వ్రాసిన పీఠికలకు సైతం ఏనాడో షష్టిపూర్తి జరిగింది. వారు వ్రాసిన పీఠికలన్నిటినీ సంతరించి 'రాళ్లపల్లి పీఠికలు' అనే పేరున రాళ్లపల్లి అభినందన సమితి బెంగుళూరు వారు (53, II Block Thyagaraja nagar, Bangalore 28, 382 పేజీల పుస్తకం తయారు చేశారు. (వెల రు. 15.). ఇందు సంతరించబడిన పీఠికలలో మొదటిది 'వేమన పద్యములు', 1917 లో వ్రాయబడింది. అలాగే 'మీరాబాయి' అనే స్వకీయ పద్య కావ్యానికి పీఠిక 1913లో వ్రాయబడింది. ఈ అభినందన సమితి వారు 1977లో 'అనంతరాగం' అనే పేరున ఒక అభినందన గ్రంథం ప్రచురించి తమ గౌరవ ప్రపత్తులను తెలుపుకున్నారు. ఇప్పుడు ప్రచురించిన ఈ పీఠికల గ్రంథంలో 'తొలి పలుకులు - ఆశీర్వచనాలు – మంగళాశంసలు – సంపాదకీయాలు – పరిచయాలు – కొన్ని అభిప్రాయాలు కూడా వున్నాయి. 'వివిధ సాహిత్య ప్రక్రియానుగుణంగా' పీఠికలను వర్గీకరించారు.

ఈ గ్రంథానికి పీఠికార్చన కూరుస్తూ శ్రీ జి. యస్. రెడ్డి యిలా అంటున్నారు: 'పీఠికా రచన ఒక కళగా భావించి వైయక్తికమైన ముద్రితాలు విలక్షణమయిన ఫక్కీలో పీఠికలు వ్రాయనేర్చిన వారు మనకెందరో లేరు. ఉన్నవారిలో అగ్రస్థానం రాళ్లపల్లి వారిదే.' తెలుగులో పీఠికల సంకలన గ్రంథం ప్రకటనకు తొలిప్రయత్నం యిదే అని కూడా వ్రాశారు. అయితే లోగడ శ్రీగోదా గ్రంథమాల వారు (ముసునూరు) ప్రచురించిన 'సమీక్షా రేఖలు' (శ్రీ సంజీవదేవ్ పీఠికలు), స్పందన సాహితీ సమితి (మచిలీపట్టణం) వారు ప్రచురించిన 'కుందుర్తి పీఠికలు' (శ్రీ కుందుర్తి అంజనేయులు వ్రాసిన పీఠికలు) బహుశ వీరి దృష్టికి వచ్చి వుండవు.

ఈ పీఠికలు క్రింది శాఖలకు చేరి వున్నాయి:

ప్రాచీన కవిత్వం	16
ఆధునిక కవిత్వం	33
నాటికలు	3
నవలలు – కథలు	3
వ్యాసములు విమర్శలు పరిశోధనములు	14
ఇతరములు	7

ఇతరముల కింద కేటాయింపు అయినవి కూడా పైశాఖలకే చెందుతాయి. కాకపోతే వాటి సేకరణలో జరిగిన అలస్యం వల్ల వాటిని బహుశా యిలా కేటాయింప వలసి వచ్చి వుంటుంది.

ప్రాచీన కవిత్వంలో మొట్ట మొదటిది బావిళ్లవారి ప్రచురణ 'వేమన పద్యములు' (1917) కొరకు వ్రాసినది కాగా, శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారి

కొరకు పరిశోధించిన అన్నమాచార్యుల సంకీర్తనముల గ్రంథసంపుటి పీఠికలు ఎక్కువగా వున్నాయి. వేమన పయిని శ్రీశర్మ గారు ఎంత అధికారముగా విషయ వివరణముచేసినారో అట్లే తాళ్ళ పాక కుటుంబ కవుల గురించి కూడా తేటతెల్లము చేశారు.

'ఆధునిక కవిత్వము'లో తమ ఖండ కావ్యము 'మీరాబాయి'కి వ్రాసిన పీఠికలో 'ఎరిగిన సహృదయులు దోష ములను మన్నింతురు గాని కవికి తెలియ చేయరు. ఇంకఎరుగని దుర్హృదయులు గుణములనే దోషములుగా గ్రహించి వషట్కారములకు ఉపక్రమింతురు. ఇంక మాకు కరుణించి తప్పులు దెల్పు వారెవరు?' అంటున్నారు (పేజీ 122). ఇది 1913లో వ్రాసినది. అప్పటికీ యిప్పటికీ దేశములో పరిస్థితి యింతే కదా! ప్రముఖము, విశేషము అయిన మార్పులు రానేలేదు.

'వేమన' ను గురించి వీరు వ్రాసిన వాక్యములు యీనాటికి యేనాటికి ప్రామాణిక మయినవి. అన్నమాచార్యు లను గురించి మొత్తం మీద తాళ్ళపాక వారి రచనలు అర్థ భావ ప్రధాన మయినవి. త్యాగరాజు దీక్షితాదుల వలె నాద రచన ప్రధానములు కావు. కనుక గాయకులు ఆ దృష్టితో సాధించి. పాడిరేని తప్పక సభ్యుల నాకర్షింప గలరని నా నమ్మిక –' (పేజీ 37).

సాహిత్యమును గురించి ఆలోచించే టప్పుడుకూడా వారి మనస్సు సునా యాసముగా సంగీతము పైకి ప్రస రిస్తుంది. సంగీత సాహిత్యములు రెండింటిలోను సమాన ప్రజ్ఞా, గౌరవము కలవా రగుట వల్లనే వీరు అన్న మాచార్యుల కీర్తనములు – పాటలు చక్కగా సాహిత్య సవరణలు చేసి సంగీత 'రాగతాళ గతులు ఊహించి స్వరసంయోజనము చేయగలిగినారు. ఆధునిక కవిత్వంలో 'నాగార్జున సాగరం' నకు మంగళా శాసనము వ్రాయుటలో గణములు – లయ – గతుల పద్ధతులను వివరించడములో యీ సుని శితత్వము స్పష్టముగా అగుపిస్తుంది.

ఎంత విశిష్టమయిన పనిచేసినను దానిని సవినయముగా పండిత లోకము నకు అందించు సహృదయము కలవారే గాని స్వాతిశయము, అహంభావము మచ్చుకయినను మనస్సును అంటని వినమ్రులు. ఇతర పండితులతో, విమర్శ కులతో భేదాభిప్రాయములు ప్రకో పించ వలసి వచ్చినప్పుడు కూడా ఆ పనిని సరళముగా, సులలితముగా చేసినారే గాని మొరటుదనము వేళా కోళము మొదలయిన అసహ్యమైన వాతావరణములను సృష్టించ లేదు. ఇది సద్విమర్శకుల లక్షణము. ఇతరులను అంతగా నొప్పించని రీతి వీరిలో మూర్తీ భవించినది. 'కుదృష్టి చేతనో అసూయ చేతనో చేసిన కౌతస్కుత విమర్శ' కాదు — అంటారు ఒక సందర్భములో (పేజి 317). (సమగ్రాంధ్ర సాహి త్యంకు పీఠిక).

'క్రొక్కారు మెఱుగులు' అన్న గ్రంథానికి ప్రస్తావన వ్రాస్తూ 'ఖండ కావ్యములే కాని మహా కావ్యము లవతరించు కాలము కాదని కొందరు విమర్శకులందురు. . . ప్రకృతము మన దేశమున మాత్రము ఇది చాలా వరకు సత్యమనక తప్పదు, (పేజి 123) అన్నారు. ఇది 1934 లో. తిరిగి 1943 లో శివభారతమునకు ఉపోద్ఘాత ముగా వ్రాస్తూ యిలా అన్నారు. 'మనకు

కొరకు పరిశోధించిన అన్నమాచార్యుల సంకీర్తనముల గ్రంథసంపుటి పీఠికలు ఎక్కువగా వున్నాయి. వేమన పయిని శ్రీశర్మ గారు ఎంత అధికారముగా విషయ వివరణము చేసినారో అట్లే తాళ్ల పాక కుటుంబ కవుల గురించి కూడా తేటతెల్లము చేశారు.

'ఆధునిక కవిత్వము'లో తమ ఖండ కావ్యము 'మీరాబాయి'కి వ్రాసిన పీఠికలో 'ఎరిగిన సహృదయులు దోష ములను మన్నింతురు గాని కవికి తెలియ చేయరు. ఇంక ఎరుగని దుర్హృదయులు గుణములనే దోషములుగా గ్రహించి వషట్కారములకు ఉపక్రమింతురు. ఇంక మాకు కరుణించి తప్పులు దెల్పు వారెవరు?' అంటున్నారు (పేజీ 122). ఇది 1913లో వ్రాసినది. అప్పటికీ యిప్పటికీ దేశములో పరిస్థితి యింతే కదా! ప్రముఖము, విశేషము అయిన మార్పులు రానేలేదు.

'వేమన' ను గురించి వీరు వ్రాసిన వాక్యములు యీనాటికి యేనాటికి ప్రామాణిక మయినవి. అన్నమాచార్యు లను గురించి మొత్తం మీద తాళ్లపాక వారి రచనలు అర్థ భావ ప్రధాన మయినవి. త్యాగరాజు దీక్షితాదుల వలె నాద రచన ప్రధానములు కావు. కనుక గాయకులు ఆ దృష్టితో సాధించి. పాడిరేని తప్పక సభ్యుల నాకర్షింప గలరని నా నమ్మిక –' (పేజీ 37).

సాహిత్యమును గురించి ఆలోచించే టప్పుడుకూడా వారి మనస్సు సునా యాసముగా సంగీతము పైకి ప్రస రిస్తుంది. సంగీత సాహిత్యములు రెండింటిలోను సమాన ప్రజ్ఞా, గౌరవము కలవా రగుట వల్లనే వీరు అన్న మాచార్యుల కీర్తనములు – పాటలు చక్కగా సాహిత్య సవరణలు చేసి సంగీత 'రాగతాళ గతులు ఊహించి స్వరసంయోజనము చేయగలిగినారు. ఆధునిక కవిత్వంలో 'నాగార్జున సాగరం' నకు మంగళా శాసనము వ్రాయుటలో గణములు - లయ - గతుల పద్ధతులను వివరించడములో యీ సుని శితత్వము స్పష్టముగా అగుపిస్తుంది.

ఎంత విశిష్టమయిన పనిచేసినను దానిని సవినయముగా పండిత లోకము నకు అందించు సహృదయము కలవారే గాని స్వాతిశయము, అహంభావము మచ్చుకయినను మనస్సును అంటని వినమ్రులు. ఇతర పండితులతో, విమర్శ కులతో భేదాభిప్రాయములు ప్రకో పించ వలసి వచ్చినప్పుడు కూడా ఆ పనిని సరళముగా, సులలితముగా చేసినారే గాని మొరటుదనము వేళా కోళము మొదలయిన అసహ్యమైన వాతావరణమును సృష్టించ లేదు. ఇది సద్విమర్శకుల లక్షణము. ఇతరులను అంతగా నొప్పించని రీతి వీరిలో మూర్తీ భవించినది. 'కుదృష్టి చేతనో అసూయ చేతనో చేసిన కౌతస్కుత విమర్శ' కాదు — అంటారు ఒక సందర్భములో (పేజి 317). (సమగ్రాంధ్ర సాహి త్యంకు పీఠిక).

'క్రొక్కారు మెఱుగులు' అన్న గ్రంథానికి ప్రస్తావన వ్రాస్తూ 'ఖండ కావ్యములే కాని మహా కావ్యము లవతరించు కాలము కాదని కొందరు విమర్శకులందురు. . . ప్రకృతము మన దేశమున మాత్రము ఇది చాలా వరకు సత్యమనక తప్పదు, (పేజి 123) అన్నారు. ఇది 1934 లో. తిరిగి 1943 లో శివభారతమునకు ఉపోద్ఘాత ముగా వ్రాస్తూ యిలా అన్నారు. 'మనకు

బైరాగి కవితాత్మ పరిశీలన

ఆధునిక (అభ్యుదయ) సాహిత్యంలో అత్యంత ప్రతిభావంతమైన కవిత్వం రాసిన అగ్రశ్రేణి కవులలో ఒకరు, యిటీవల కీర్తిశేషుడైన బైరాగి. ప్రతిభ కంటె పైరవీల వల్లా, వీలయినన్నిసార్లు, దొరికినన్నిసార్లు తమ నామాక్షరాలు పత్రికలు, పుస్తకాల్లో మెరిపించుకోవడంవల్ల కాకండా, కవిగా తన 30 ఏళ్ల జీవితంలో గుణంలో గంగిగోవు పాలవంటి కొద్దిపాటి కవిత్వం రాసిన బైరాగి, విజ్ఞులలో వాసికెక్కిన కవి.

మాటలతో చక్కని బొమ్మలు కట్టడం, ఆ బొమ్మలలో యింపయిన భావాలు పొదగడం బైరాగి విశిష్టత. ఈ విషయంలో అతనికి సాటి రాగలిగిన వాళ్లు ఎక్కువమంది లేరు. మరణించిన తరువాత అతని 26 గీతాలు ఏరి ముద్రించిన 'నూతిలో గొంతుకలు', 'చీకటి నీడలు' అన్న రెండు సంపుటాలలో రమ్యమైన పంక్తులెన్నో దొరుకుతాయి.

ప్రధానంగా 'నూతిలో గొంతులు' జీవిత రంగస్థలమించి విషాదంగా నిష్క్రమించిన బైరాగి స్వగతం వంటిది. ఆ పేరుతో వున్న గీతంలో —

త్రోవలు రెండే రెండు త్రోవతెలియ గలందులకు
ఒకటి, వెలుగు కొరకు వేచియుండి విజయ ఫలసాధన
రెండు, కటిక చీకటిలో దూరదృష్టి సంపాదన
ఒకటి నీలి ఆకసంలో ఎగిరే పులుగుల త్రోవ
రెండవది మురికి మంటిని మెలగే పురుగుల త్రోవ

ఇంకో చోట -

కూకటి వేళ్ల రహస్యాలు తెలిసిన తరువాతనే
తెలిపూవుల తొలి పలుకులు వినవస్తాయ్ నీ చెవులకు
కన్నీరుల కుంభవృష్టి వెలిసిన తరువాతనే
హరివిల్లుల రంగవల్లులు, కనిపిస్తాయ్ ని కనులకు
ఏడు గోడల పెట్టిన కోట దాటితేనే
రాకుమారి నివసించే ఒంటిస్తంభం మేడ
ఎగిరే ఇసుక దిబ్బల ఎడారి దాటగానే
రేవులో స్వదేశానికి తిరిగి వెళ్లే ఓడ
చొచ్చుకపో ఆత్మల చీకటిలోకి సాహసికుడా!

"హామ్లెట్ స్వగతం"లో "కత్తిరించిన ఒత్తులే వెలుగుతాయి దివ్యంగా। బాధా దగ్ధ కంఠాలే పలుకుతాయి శ్రావ్యంగా" అనీ, మానవుడు "అనుక్షణం అడుగుతీసి అడుగువేసి పోతుంటాడు। చివరకువెళ్ళే లోపున మొదలు మరచిపోతుంటాడు"- తాత్త్వికాంశ, కవితాంశ కలిపి చెప్పటం బైరాగి ప్రత్యేకత.

'రాస్కల్నికోవ్' లో చక్కని పద చిత్రాలతో కూడిన యిటువంటివే యింకొన్ని పంక్తులు. 'త్రోవ ఎక్కడ' అని అడుగుతూ :

గహన మానస కాననంలో చిక్కు తీవెల తలపు గుబురులు

సూర్యరశ్మిలు పోకవిచ్చుట, నడుల ఆకుల గాలి కబురులు
ఎప్పుడూ నడిరేయి చీకటి జడలు విప్పిన కానవంలో

అంటూ యిలా ప్రశ్నిస్తాడు:

దనుజ హస్తపు దీర్ఘరేఖల వలే పరచిన రాచబాటలు
సందు గొందుల మారుమ్రోగే త్రాగు బోతుల వెకిలి పాటలు
జీవితానికి వేయి వాల్కలు, లక్ష చీల్కలు, కోటి కోరలు
త్రోవతప్పిన నరుని హృదయం ఎక్కడున్నది

కవితా గమనంలో "పరిహాసించే గడ్డి పోచలు", "దిక్కులన్నీ వెక్కిరించాయి", "మొయిలు నొసలున నల్లత్రాచులు", "స్వీయ హృదయం న్యాయసదనం నేరమారోపించటానికి నరనరాల గూఢచారులు దృష్టి నాపై ఉంచటానికి", "మా చీని చీనాంబరాల పొరల క్రింద కేవలం దిగంబరులం" వంటివీ, లోతయిన ఆలోచనలు కలిగినవీ పదచిత్రాలు అప్రయత్నంగా ఊడిపడుతుంటాయి.

"నూతిలో గొంతులు సంశయ కావ్య" మని బైరాగి తానే చెప్పాడు. ఇదొక్కటే కాదు. మొత్తంగా చూస్తే బైరాగి కవిత్వమూ, జీవితమూ కూడా. ఏదో తపనతోనూ, మథనతోనూ చలించిపోతూ అస్థిరంగా గడిపిన జీవితం అతనిది. జీవితంలో లేనట్టుగానే, కవిత్వంలోనూ నిలకడ లేకండా పోయింది.

అతిచిక్కని ప్రయోగాలూ, అతిచక్కని పద దృశ్యాలు, లోతయిన ఆలోచనలూ సునాయాసంగా రువ్వుకుంటూ పోతాడు. అందని దానిని దేనినో అందుకోవాలన్న ఆరాటం కవితలోనూ, జీవితంలోనూ అడుగడుగునా కనిపిస్తాయి. కాని తాను నిరంతరం తపించిపోయిన సమస్యల మూల సత్యాన్ని అవగతం చేసుకోలేకపోవడంవల్ల జీవితంలోనూ, భావాలలోనూ నిలకడలేకపోవడం జరిగింది. శైలిలో వ్యక్తావ్యక్తస్థితికీ, అన్వయక్లిష్టతకు కారణం యిదే. ఇతరులు అర్థం చేసుకోగలుగుతున్నారో లేదో అన్నది, తాను పట్టించుకోడు. తన ధోరణే తనది. అంతటి తీవ్రావేగం అతనిది. ఇంతేకాక మితిమీరిన అసంతృప్తి, ఆవేదన, అంతా చీకటి:

అంధకార సాగరాన పయనించిన ఓడల గురుతులుండవు
వల్లకాటి మునివాకిట నాటిన మొక్కలు పండవు
చివరికి చీకటొకటే, చలనం లేదు చీకటికి

అనే బైరాగి కోలుకొని "చొచ్చుకపో ఆత్మల చీకటిలోకి సాహసికుడా!" అన్నా, అతని ముఖ్య ధోరణి యిందుకు భిన్నమైనది.

నిదురబోతున్నాయి వాడిన పువ్వుల్లో ఆశలు
మొగ్గల్లో నిరాశలు
ముళ్లలో హెచ్చరికలు
కీచురాళ్ల నైశ్శబ్ద్యపు గురకలు

ఇంత శ్రావ్యంగా చెప్పిన గొంతులో అపశృతిలా కవి సంశయాత్మ వెల్లడయింది!

మితిమీరిన అశాంతికీ, నిరాశకూ గురై "అగ్ని దేవుని అజీర్తికి ఆహుతి

అవుతున్నది మన నాగరికత" అన్న దిగులులో పడిపోయి, విప్లవాదర్శం మీద విశ్వాసం పోగొట్టుకొని –

విప్లవాల ప్రసవ బాధల దైత్య శిశువు భస్మాసురుడు
నిలకడగల నమ్మిక ఎలా కలుగుతుంది

అని ప్రశ్నిస్తాడు. ప్రజలను అంతులేని బాధలకు గురిచేసిన నిరంకుశులను కూలద్రోసేటప్పుడు, విప్లవకారులు విముక్తి కొరకు చేయక తప్పని ప్రతి హింస గురించి విప్లవప్రతిఘాతుకుల దుష్టాచారాన్ని నమ్మిన బైరాగి, విప్లవాల ప్రసవ బాధల్ని దైత్య శిశువు భస్మాసురుడంటూ చేసిన ప్రతిధ్వని యిది. కాని విప్లవాలు దేనినయితే కూల్చడానికి పూనుకుంటాయో ఆ దుర్వ్యవస్థను నిరసించుటలో తానెవరికీ తీసిపోడు !

ఈ లోకంలో చెడుగు బహుముఖాలా వ్యాపించివున్నదని, దాన్ని తుదముట్టించకపోతే లోకం సుఖపడదనీ తెలుసును. మంచి కూడా లోకంలో వ్యాపిస్తూవున్నదనీ, రాను రానూ దానిదే పై చేయి అవుతూవున్నదనీ ఎరుగును. ఆ మంచి వెనుకను తాను వుండాలనీ ఎరుగును. కాని తన సంశయాత్మ సమ్మతించదు. ఇదీ బైరాగి జీవితాన్ని, కవిత్వన్నీ క్రుంగదీసిన పరిస్థితి.

'పెనుతుపాను', 'వేశ్య', 'కదిలించూ !', 'ఒకే జ్యోతి' వంటి కొన్ని గీతాల్లో తన నిరాశా నిస్పృహలు వదుల్చుకున్నట్టు కనిపిస్తుంది. కాని అది క్షణికం.

స్థిరచిత్తత కొరవడడం వల్ల, అనేక చోట్ల శైలి, భావన కుంటుపడడమూ కనిపిస్తుంది బైరాగి గీతాల్లో. తను చలించిపోతూ, చదివే వారిని కుదిపివేస్తూ మధ్య మధ్య జీవితాన్ని "అవిరళ గరళస్తన్యద కుహనా ధాత్రి పూతన" వంటి గడ్డు సమాసాలూ, అసలు అంటే పట్టని ప్రయోగాలూ గుప్పిస్తాడు. పై సమాసం వంటి వాటిని తేలిక మాటల్లో చెప్ప లేని వాడు కాడు. అయితే అతని మాటల పరుగు ఆగేది కాదు.

ఇలాగనే కుప్పిగంతులు వేసి రసాభాసం చెయ్యడమూ జరిగింది. 'సంఘర్షంలో – "ఈ తొత్తులు అని చత్తురు, జనశక్తులుమంది మెత్తురు ధన్ ధన్ ధన్ ఢం ఢం ఢం" అని (అరుద్ర ఫక్కీలో) తీవ్రంగా చెప్పకపోయి, గొంతుక మార్చేసి "ఈతపళ్లండోయి బాబూ, గుత్తివంకాయి కూరోయి బావా, ఓఓ హో హో హో హో పావురమా" అంటూ వెక్కిరింపు ధోరణిలోకో, స్త్రియలిస్టు ధోరణిలోకో దిగి పోయి. కోలుకొని "ఇది జననం ఇది మరణం భవహరణం" అంటూ గజిబిజి చేసేస్తాడు.

ఎంతో మంచికవి అయిన బైరాగిలో అస్పష్టత, అన్వయిక్లిష్టత, అపరిపక్వ తాత్విక చింతన లేకుంటే బాగుండు ననిపిస్తుంది. కాని తన జీవిత సరళి తన సంశయాత్మ బైరాగిని కవిగా యింకా ఉన్నత శిఖరాలందుకోకుండా చేశాయి. నిలకడ లేని మనస్సు, తానెందుకైతే ఆరాటపడుతూవుండేవాడో ఆ సవ్యమైన వ్యవస్థ సాధన దిశగా వెళ్ళకుండా చేసింది. ఇప్పటి దుర్వ్యవస్థ పట్ల కోపం, జుగుప్స విషయంలో బైరాగి ఎవ్వరికి తీసిపోడు. కాని అంత మాత్రంలో సరిపోదు. నైర్మాణిక దృష్టి దృక్పథం లోపించి, బైరాగి మనస్సు

దారి కాని దారులలో విహరించింది. ఈ కొరతలున్నా మౌలికమైన ప్రతిభ, ప్రజ్ఞ వున్న వాడవడం చేత తన విషాదయోగాన్ని ఒప్పుకోనివారు కూడా మెచ్చుకోవలసిన కవిత్వం చెప్పి వెళ్ళిపోయాడు.

"సంశయాల సంధ్యా బాహుబంధనాల హృత్ స్పందనల" మధ్య; స్వకరుణ (Self - Pity ?) యను కుంపటి కడ ఇడుముల చలి కాచుకుంటూ" ('హామ్లెట్ స్వగతం'), రాయిజం ద్వారా పెడదారిని పడకుండా వుంటే (చూ. "మేము కాలు చాపటమే ఆర్థిక విపర్యాసమంటాడు మార్క్స్" – 'ఒక సమిష్టి ప్రార్థన'), బైరాగి స్థిర సంకల్పుడైన మహాకవి అయివుండేవాడు. తన "ఊహకీ వాస్తవానికి, క్రియకీ కదలికకీ మధ్య నీడలు" పడకండా వుండేవి,

ఈ సంకలనాలలో 'విధ్వంసం', 'తాజ్‌మహల్ పడగొట్టండోయ్' వంటివి కేవలం అరాచక రచనలు. 'కడుపు మంట', శ్రీశ్రీ 'ఆనందం అర్ణ తమైతే' అన్నపాటకు చవకబారు పేరడీ.

మంచి కవి చనిపోగానే అతని స్మారక చిహ్నంగా చక్కగా వేసిన యీ సంపుటాలలో అచ్చు తప్పులు కొల్లలుగా వుండడం బాగా లేదు.

("నూతిలో గొంతుకలు", వెల : 5.00. 'చీకటి నీడలు', వెల : 3 - 50. ప్రతులకు : ఎ. బి. సి. ప్రచురణలు, 6 - 1 - 108, /6, లకిడీకాపూల్, హైదరాబాద్ - 500 004)

కవి సమస్య

కీ. శే. బైరాగి

...గాలి విసరుల తావిలా తప్పించుకొని,
శిరీషసుమ మార్దవపు నవనవలా జారిపోతూ,
కనులు మూసి, కిలకిల నవ్వి
కనబడక మాయమయ్యే మనోజ్ఞతను
ఈ తెగిన త్రాళ్లు బెట్టి, వాక్యాల
మొండి గోడల మధ్య ఎలా బంధించటం ?
నిండు మదిలోంచి తొణికిన భావావిష్ట మహోర్ఘురులు
నిరర్థక శబ్దాల సహారా సైకతాల్లో ఇంకనీక
జనసాగర సంగమానికి ఎలాగ అందించటం ?
సర్వ సంకుల పథంలో సజ్జిత సన్నద్ధ రథం,
త్వరాతురుడు బుద్ధిసారథి, కాని కదలని శబ్దాలు మొండి గుర్రాలు
కాలాతీతమై పోతోంది, చెప్పవలసిన చెప్పదలచిన దానిలో
ఇప్పటికి చెప్పినదాక సహస్రాంశమైనా లేదు.
ఏమిటి చేసేది నేను ? ....

('కవి సమస్య' నుంచి)

చర్చావేదిక

బహుమతి కథలు

ఆంధ్ర ప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం మద్రాసు శాఖ, ఒక వారపత్రిక (ఆంధ్ర భూమి) జరిపిన కథల పోటీలో బహుమతులు పొందిన కథలను చర్చించడానికి అక్టోబరు 1న పొట్టి శ్రీరాములు స్మారక మందిరంలో సమావేశమయ్యింది. విమర్శకు లందరూ బహుమతి పొందిన కథలన్నీ చాలా దుర్బలంగావున్నాయన్న ఏక గ్రీవాభిప్రాయం వెలిబుచ్చారు. "కథల పోటీలు ఉత్తమ సాహిత్యానికి ప్రోత్సాహ మివ్వడానికి వుద్దేసించబడినా, యీ పోటీలో బహుమతి పొందిన కథలు చాలా పేలవంగా, నిరాశా జనకంగా వున్నాయి" అన్నారు శ్రీ పి. శ్రీపతిరావు. "పోటీ కథలు అనగానే వైవిధ్యం, నవ్యత ఉంటాయని ఆశించిన ఎందరికో ఈ కథలు నిరాశ కలిగించాయి" అన్నారు శ్రీ ఉపద్రష్ట శాయి. ప్రథమ బహుమతి ('కాలిపోయిన క్షణం' – రచన, ఆర్. లలితాంబ) పొందిన కథను విశ్లేషించి వివరిస్తూ, శ్రీ పి. సూర్యమోహన్ రచయిత్రి ఏమి చెప్పదలచు కొన్నారో కూడా అర్థంకాని ఇల్లాంటి కథను బహుమతికి, అందులోనూ ప్రథమ బహుమతికి ఎల్లా ఎంపిక చేశారా అని ఆశ్చర్యం వెలిబుచ్చారు. బహుమతి కథలు మూడింటిలోనూ మూడవది ('రెండు లోకాలు' – రచన శ్రీ వి. రాజా రామ్మోహనరావు) కాస్త బాగున్నదనీ, కథలో కొత్తదనం, ప్రత్యేకత లేక పోయినా, కథావస్తువంటూ కనిపిస్తుందనీ శ్రీ టి. ఎల్. నరసింహా రావు అన్నారు.

పోటీకథలలో రెండవది ('తెల్లగులాబీ ఎర్రబడింది', రచన : కిన్నెర) నేటి విద్యావ్యవస్థ లోని లోపాల్ని ఎత్తిచూపుతూంది. విద్యార్థులకు అన్నివేపుల నుంచీ అధైర్యాన్ని నూరిపోసి, భావి భారత పౌరులను ఆ వ్యవస్థ ఎలా పిరికి వాళ్ళు గా తయారు చేస్తూందో, ఏడవ తరగతి పిల్లవాడి మనస్తత్వం ద్వారా రచయిత తెలిపారు. కాని రచన ధారాళంగా సాగదు, అన్నారు శ్రీ శ్రీపతి రావు.

మూడవ బహుమతి కథలో మల్లి అనే ఓ పేదింటి కన్నెపిల్ల, సినీమా చూడాలనే కోర్కె తీర్చుకోవడం కోసం, తమ గుడిసెకెదురుగా వుండే డాబా యింటి కాలేజీ కుర్రాడి కోర్కెకు బలైపోతుంది. వస్తువులో కొత్తదనం లేక పోయినా, చెప్పిన తీరులో వుంది. సినీమాల ప్రభావం లేనింటి పడుచు పిల్లల మనస్థితిని ఏ విధంగా ప్రభావితం చేస్తుందో చెప్పడంలో రచయిత కృతకృత్యులయ్యారు' అన్నారు శ్రీపతి రావు.

ఇక పోతే కన్సొలేషన్ బహుమతి కథలు కొంతవరకు విమర్శకుల ప్రశంసలు పొందాయి. శ్రీ ఉపద్రష్ట శాయి. ("గాజు పెంకులు" – రచయిత జగన్నాథశర్మ –)మరుగునపడ్డ రంగస్థల నటి మాణిక్యం తన కొడుకు

చదువు కోసం, జీవనోపాధి కోసమూ కుట్టుమిషను నాశ్రయించింది. కాలేజీలో కొడుకును చేర్చాలని తపించే సమయంలో 'నటరత్నాలు' పేరిట ప్రముఖ రంగస్థల నటీ నటులకు సన్మానం జరుగుతుందని – తనను రమ్మని – వచ్చిన ఆహ్వానం మీద గంపెడు ఆశతో ఊరివాళ్ళ చందా డబ్బులతో హైదరాబాదు వెళ్ళొచ్చిన మాణిక్యం సంచీలో, ఎండి పోయిన పూలహారం, నలిగి పోయిన శాలువా తప్ప మరేం కనిపించదు – ఆత్రంగా వెతక బోయిన కొడుకు బట్టల అడుగున వున్న సన్మాన పత్రం ప్రేమతో కింద పడి చెదిరిన గాజు ముక్కలు మాత్రం కనబడ్డాయి. కథలో చక్కని విషయం, కథ చెప్పిన తీరు – చాలా బాగుంది అని చెప్పారు.

మరో కన్సొలేషను కథ. ('టాస్' రచయిత, అల్లం రాజయ్య). రెండు సార్లు చదివినా అర్థం కాలేదు.

మూడో కన్సొలేషన్ కథ – "మనిషిలో మనిషి". (రచయిత, కేఎస్వీ). చేయి తిరిగిన రచయిత. "మనం పేదోల్లం. – మనకన్న గొప్పోల్లను మోసీలాగీ బతుకుతా వుండాం. అయినా మనకన్నా పేదోల్లుండారు. అల్లను మన పయ్యోల్లు పట్టించుకోరు. మనమన్నా పట్టించు కోవాల. వొక దినమో రెండు దినాలో మనం పత్తులున్నా పరవాలేదు. మనం ఇంకో మనిసికి తోడుండాల. అవసరమైనప్పుడు తప్పకండా తోడుండాల" – ఇదీ ఇతివృత్తం.

చావు బ్రతుకుల మధ్య ఊగులాడుతున్న పాపతో రాత్రి పూట రిక్షా స్టాండు కొస్తుంది ఒక యువతి – రెండు రూపాయలకు తక్కువ ఎవరూ బండి కట్టరు. అప్పుడే అక్కడికొచ్చిన సన్నాసిగా జమ కట్టబడ్డ రిక్షావాడు సన్నాసి ఆ యువతి పరిస్థితికి జాలిపడి బండి కడ్తాడు – ఆమె ఆసుపత్రికి పోతుంది – కానీ మధ్యలోనే పాప ప్రాణం పోతుంది. ఆస్పత్రి వాళ్ళు శ్మశానం వైపు దారి చూపారు – బిడ్డను పూడ్చడానికి కూడా డబ్బులేని ఆమెపై జాలిపడి తన డబ్బుతో ఆ పాపకు అంత్యక్రియలుచేసి ఆ యువతిని సొంత వూరికి టిక్కట్టు కొనిచ్చి రైలెక్కిస్తాడు. సన్నాసిగా పిలవబడ్డ ఆ రిక్షావాడు — నేను సన్నాసి గాన్నే అయినా అటుమంటోల్లు పక్కా సన్నాసులు అయినా అవుతారేమో గానీ బూమికి బరువు మాత్రం కారు . . . . . ఏమంటారు?" అన్నాడు సన్నాసి. హృదయ రంజకంగా వుంది ఈ కథ.

కన్సొలేషన్ బహుమతి పొందిన "టాస్" కథను గురించి చెప్తూ శ్రీ పి. శ్రీపతిరావు ఇల్లా అన్నారు : "దీనిలో రచయిత తెలంగాణా యాసతోనూ, పాత్రలు స్వచ్ఛమైన కోస్తా జిల్లాల తెలుగులోనూ మాట్లాడతారు. మొరార్జీ మద్యపాన నిషేధం విజయవంత మవుతుందో, లేదో టాస్ ద్వారా తేలుస్తాడు, ఓ పాత్రద్వారా రచయిత. మద్యపాన నిషేధాల వంటివి సక్రమంగా అమలు జరపబడాలంటే అందుకు మూలమయిన పరిస్థితులను మార్చుకోవాలి తప్ప, టాస్ వేసి నిర్ణయించడం ఏమిటో ఈకథలో అర్థంకాని విషయం."

తరువాత సభకు వచ్చిన శ్రీ సుప్రసన్నాచార్య (కాకతీయ విశ్వవిద్యాలయంలో తెలుగు లెక్చరరు), శ్రీ తంగిరాల సుబ్బారావు (బెంగుళూరు విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగం అధిపతి) సభకు పరిచయం చేయ

బడ్డారు. శ్రీ సుప్రసన్నాచార్య మాట్లాడుతూ, రచయితలలో సమైక్యత అవసరం అన్నారు. విశ్వ విద్యాలయాలకు, వాటి బయటనున్న సృజనాత్మక రచయితలకూ మధ్య పొంతన, సమన్వయమూ లేకుండా వున్నాయనీ, విశ్వ విద్యాలయాలలో సృజనాత్మకతను నిరుత్సాహ పరచడమే జరుగుతుందనీ, వాటిలో పరిశోధనల పేరుతో ఎంతో కృషి జరుగుతున్నా తెలుగులో విమర్శ మరీ బలహీనంగా వుండడానికి కారణం అదేననీ అన్నాయి.

శ్రీ తంగిరాల సుబ్బారావు కన్నడ దేశపు విశ్వవిద్యాలయాలు సృజనాత్మక రచయితలను విశ్వవిద్యాలయాలకు ఆహ్వానించి ఒకటి రెండు నెలలు లెక్చరర్లు, రీసెర్చి విద్యార్థులు, విద్యార్థులతో ప్రత్యక్షసంబంధాలు పెట్టుకొనేటట్లు చేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రముఖ సృజనాత్మక రచయితలు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులుగా వుంటుండడాన్ని వివరిస్తూ, దానివలన సృజనాత్మకతకు దోహదం జరుగుతున్నదన్నారు.

ఆంధ్ర విశ్వ విద్యాలయపు సాంస్కృతికోత్సవాలకు శ్రీ విశ్వనాథ వంటి వారిని ఆహ్వానించి నప్పుడు జరిగిన ఘటనలు వివరించి శ్రీ సి. దుర్గాప్రసాద్ (ఐ ఐ టి లెక్చరరు) విశ్వవిద్యాలయాధ్యాపకులకూ, బయటనున్న ప్రముఖ సృజనాత్మక రచయితలకూ పరస్పర వైమనస్యాలు క్రమంగా ప్రస్తుత దుస్థితికి దారి తీశాయన్నారు.

శ్రీసుదర్శన్(ఆంధ్రోపాజీ లెక్చరరు) మద్రాసు విశ్వ విద్యాలయం) విశ్వ విద్యాలయాలకు సృజనాత్మక రచయితలను ఆహ్వానించడం అవసరమన్నారు.

లేఖలు

సాహిత్యోద్యమ సంస్థ

Books and books అనేది ఒక సాహిత్యోద్యమ సంస్థ. దీని లక్ష్యాలు : (1) అభ్యుదయ దృక్పథంతో సాహిత్య సమావేశాలు నిర్వహించడం, (2) రచయితలు స్వంతంగా వేసుకున్న పుస్తకాలకు పబ్లిసిటీ యిచ్చి అమ్మిపెట్టడం, (3) రచయితల సహకారంతో పుస్తకాలు ప్రచురించడం. ఈ సంస్థను నేను 1973లో ప్రారంభించాను. విలువైన తెలుగు రచనలను యితర భారతీయ భాషలలోకి అనువదింప చెయ్యడం, పరిచయం చెయ్యడం; English writers in Andhra కు ఒక వేదిక నిర్మించడం మేం త్వరలో అందుకోవాలన్న లక్ష్యాలు. 1979 వేసవిలో ఆంధ్రప్రదేశ్‌లోని యింగ్లీషు రచయితల కొరక సెమినార్ నిర్వహించుతున్నాం. ఇది ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆవరణలో జరుగుతుంది. మేం ప్రస్తుతం 10 పుస్తకాలు అమ్మకానికి వుచ్చుకున్నాం. ఈ సంస్థ లోగడ 3 పుస్తకాలు ప్రచురించింది. 1979 లో ఒక కథా సంకలనం, ఒక కవితా సంకలనం తీసుకరానున్నాం.

విశాఖ, శ్రీకాకుళం జిల్లాలు అన్ని విధాల కొన జిల్లాలు. పుస్తకం అచ్చువేసుకుంటా మంటే పరిస్థితులు అనుకూలం కావు. ఇల్లాంటి సందర్భంలో మేం సాహసంతో తలపెట్టిన యీ పనికి సాహిత్యాభిమానులంతా సహకరించాలని కోరుతున్నాను,

మానేపల్లి సత్యనారాయణ, శ్రీకాకుళం - 1
పుణ్యపు వీధి,

ఫిలిమ్ సొసైటీలకు ప్రాతినిధ్యం ఆవశ్యకత

రాష్ట్రంలో చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన సమస్యలను పరిశీలించే నిమిత్తం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల మూడు ఉప

సంఘాలను నియమించడం ఎంతయినా ముదావహం. ప్రేక్షకులలో ఉత్తమ చిత్రాలు చూడాలనే ఆసక్తిని, ప్రోత్సాహాన్ని కలిగించడంలో రాష్ట్రంలోని 42 ఫిలిం సొసైటీలు విశేషంగా కృషి చేస్తున్నాయి. ఈ సొసైటీల ప్రతినిధులు ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఉపసంఘాలలో ఉంటే, సాంఘిక ప్రయోజనాలుండే ఉత్తమ చిత్రాల నిర్మాణానికి కావలసిన వాతావరణం యేర్పడడానికి వారు దోహదపడతారు.

కర్ణాటక ప్రభుత్వం "కర్ణాటక ఫిలిం సొసైటీస్ డెవలప్‌మెంట్ కౌన్సిల్" అనే ఓ సంస్థను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. కర్ణాటక సమాచారశాఖా మంత్రి, ఆ మండలికి 'ప్యాట్రన్' గా వుంటారు. కర్ణాటక ఫిలిమ్ ఇండస్ట్రి డెవలప్‌మెంట్ కార్పోరేషన్ మేనేజింగ్ డైరెక్టరు ఈ సంస్థకు గౌరవాధ్యక్షులుగా వుంటారు. విశేష మేమిటంటే - ఈ సంస్థలో మిగతా సభ్యులంతా ఫిలిం సొసైటీలకు సంబంధించిన వారే. మరి మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇప్పుడు యేర్పాటు చేసిన ఉప సంఘాలలో ఫిలిం సొసైటీలకు సంబంధించిన వారినే సభ్యులుగా నియమించలేక పోయినా, వారి ప్రతినిధులలో కొందరినయినా సభ్యులుగా ఆ ఉపసంఘాలలో నియమించితే, ఉత్తమ చిత్రాల నిర్మాణానికి ప్రోత్సాహమిచ్చే వాతావరణం యేర్పడగలదు.

అయితే మరి కర్ణాటక ప్రభుత్వాన్నే ఎందుకు ఉదాహరణగా తీసుకోవాలన్న ప్రశ్నకు సమాధానంగా, ఆ రాష్ట్రంలో నేడు విశేషంగా సాగుతున్న ఉత్తమ చిత్ర నిర్మాణాన్ని గమనించవలసి వుంది. వాణిజ్య దృష్టితో నిర్మించే చిత్రాలతో పాటు, ప్రేక్షకులలో చైతన్యం కలిగించే, వారిని ఆలోచింపచేట్టు చేసే చిత్రాలు కర్ణాటకలో చాలా నిర్మించబడుతున్నాయి. ఈ సందర్భంలో ఇతర రాష్ట్రాలనుండి కూడా అక్కడకు వెళ్లి మంచి చిత్రాలను నిర్మిస్తున్న విషయం అందరికి తెలిసినదే.

మరి మన రాష్ట్రంలో గుణాత్మకమైన చిత్రాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఏమి చేస్తున్నది? చలన చిత్ర పరిశ్రమ మద్రాసు నుంచి హైద్రాబాద్‌కి తిరిగి రావాలనే ప్రబోధమే తప్ప, యింతవరకూ ప్రభుత్వం అందుకు యిచ్చిన ప్రోత్సాహమేమిటి? "చలిచీమలు", "అనుగ్రహం", "ఒక ఊరి కథ" లాంటి చిత్రాలకు వినోదం పన్ను మినహాయింపు సౌకర్యమయినా యివ్వలేదే: ఫిలిం సొసైటీలు ప్రదర్శించే ఉత్తమ చిత్రాలకు వినోదం పన్ను మినహాయింపు కూడా యివ్వలేదు! - ఈ విషయాలన్ని ప్రభుత్వం వెంటనే పరిశీలించవలసి వుంది.

ఉప సంఘాలలో ఫిలిమ్ సొసైటీలకు ప్రాతినిథ్య మివ్వడానికి ప్రభుత్వానికి గల అభ్యంతరాలేమిటో తెలియదు. ప్రేక్షకులలో ఉత్తమ కళాభిరుచులను పెంపొందించడానికి రాష్ట్రంలోని ఫిలిమ్ సొసైటీలు చేస్తున్న కృషిని ప్రభుత్వం గమనించలేదా? గమనించినా పట్టించుకోవడం లేదా? రాష్ట్రంలోని ఫిలిమ్ సొసైటీలు ఈ విషయమై వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి టెలిగ్రామ్ ద్వారా విజ్ఞప్తి చెయడం తక్షణ కర్తవ్యం.

పి. ఎస్. ఎన్. శర్మ, విజయవాడ
విజయవాడ ఫిల్మ్ సొసైటీ పక్షాన

విమర్శ సరైనదే

అక్టోబరు అభ్యుదయ యిప్పుడే అందింది. పై వ్యాసంపై విమర్శ ('గాథాసప్తశతి పరిశీలనా భిన్నాభిన్నాభిప్రాయం' పుటలు 43 - 45) సరియైనదే ననుకుంటున్నా.

కం· సత్యనారాయణ హైద్రాబాదు

'పిన్ని'

అభ్యుదయ 78 అక్టోబరు సంచికలో 'రచయిత్రికి విజ్ఞప్తి' చదివాను. వస్తువును, వస్తురూపంలో పరిశీలించిన మీ ఉదాత్త గుణం ప్రశంసనీయం. రచయిత్రి పెళ్ళకూరు జయప్రద గారు రాసిన 'పిన్ని' ఏ పత్రికలోనిదో - ఆమె అడ్రసు (వీలుంటే) తెలియజేస్తే సంతోషిస్తాను.

ఎన్. భాస్కరరావ్ పెంటపాడు

కథా పఠనం

అక్టోబరు "అభ్యుదయ" లో 'రచయితలకు ముడి సరుకు' శీర్షిక క్రింద 58 పుటలోని భూమి తగాదా సమస్యపై.

పొట్టి శ్రీరాములు స్మారక మందిరంలో, నవంబరు 5 (ఆదివారం) సాయంత్రం 6 గం. కు

Edited and Published by T. Venkataramiah, at 15, Arulammal Street, Madras - 600 017 and Printed at Stree Seva Mandir Press, Madras - 17 for Sri Venkateswara. Printers, Madras - 600 021.